గుణము పొదుపు
లక్షలాదులు ఉపయోగించు
సాధారణము పాకెట్లు తీపు
సంజీవి గోడు పండ్లపొడి
... కమైన ఆయుర్వేద ఔషధములు
నరముల బలవృద్ధి టానిక్
ఆరోగ్యమును వృద్ధిపరచును
బ్రింగామలక తైలము
... హైదరాబాద్, విజయవాడ, బొంబాయి
మా స్టాకిస్టులుగా వుండుటకు మీకిష్టమేనా ?

VISALAANDHRA, VIJAYAWADA-4. Phone . 376 * * * Regd No. H- 203

విశాలాంధ్ర

706358

సంపుటి 14 సంచిక 66] విజయవాడ * 20-5-1964 బుధవారం [6 పేజీలు 7 న.పై

కాశ్మీర్ సమస్యపై ఎట్టితీర్మానం చేయకుండానే భద్రతాసంఘ సమావేశం నిరవధికంగా వాయిదా

భారతపాకిస్తాన్లు ముఖాముఖిచర్చలుజరుపుకోవాలని భద్రతాసంఘ అధ్యక్షుని సమీక్ష

ఈ సమీక్షకు తాము బద్ధులం కానక్కరలేదని చాగ్లా, భుట్టోల ప్రకటన

ఐరాస, మే 18

కాశ్మీర్ సమస్యపై ఎట్టి తీర్మానంలేకుండా భద్రతాసంఘ అధ్యక్షుడు తయారుచేసిన సమీక్షను మాత్రం వినటంతోనే కాలనిర్ణయం లేకుండా నేటి సాయంకాలం భద్రతా సంఘం వాయిదా పడింది.

సంప్రదింపుల ద్వారా తమ విభేదాలను పరిష్కరించుకునేందుకు సాధ్యమయినంత త్వరలో ఉభయపక్షాలు తమ సంబంధాలను పునః ప్రారంభించాలనేదే భద్రతాసంఘ సభ్యుల అభిప్రాయమని అధ్యక్షుడు సీదో తన సమీక్షలో పేర్కొన్నారు.

భారత ప్రతినిధివర్గ నాయకుడు చాగ్లా వ్యాఖ్యానిస్తూ, అధ్యక్షుని సమీక్షకు తాము కట్టుబడి ఉండనక్కరలేదని, ఇది తీర్మానం కాని, సభ్యుల ఏకాభిప్రాయం కాని కాదని అన్నారు.

ఇప్పుడు పాకిస్తాన్ ఆక్రమణలో ఉన్న కాశ్మీరులోనిదే అయినింత రెండు వంతుల భాగంకూడ భారతదేశం అంతర్భాగమేనని ఒక ప్రశ్నకు సమాధానంగా చాగ్లా అన్నారు.

నెహ్రూ అబ్దుల్లాలమధ్య జరిగే సంభాషణలకూ, భారత-పాకిస్తాన్ల మధ్య సంప్రదింపులకు ఎట్టిసంబంధంలేదని అన్నారు.

అధ్యక్షుని సమీక్షానంతరం వెంటనే భారత పాకిస్తాన్ ప్రతినిధులుమాట్లాడుతూ ఈసమీక్షకు తాము కట్టుబడి ఉండనవసరంలేదని, అది తీర్మానంకాదని తెలియచేశారు.

భారత విద్యామంత్రి చాగ్లా మాట్లాడుతూ భారతపాకిస్తాన్ దేశాలతో ప్రత్యక్ష సంప్రదింపులు జరపడం మనటం ఉభయపక్షాల సామరస్యవైఖరిపైన, భారతదేశంలో కాశ్మీరు అంతర్భాగమనే భారతదేశ మౌలిక వైఖరిని పాకిస్తాన్ ఆమోదించడంపైన ఆధారపడి ఉంటుందని అన్నారు. భారత దేశ లౌకిక రాజ్యాంగానికి భంగం కలిగేదేదీ జరగరాదని చాగ్లా ఉద్ఘాటించారు.

పాక్ విదేశాంగమంత్రి భుట్టో మాట్లాడుతూ భద్రతా సంఘం చర్చ తాత్కాలికంగా ముగిసిందని, ప్రధాని నెహ్రూతో అబ్దుల్లా జరిపినసంభాషణలు, అదే విధంగా అయూబ్ఖాన్తో అబ్దుల్లా జరపనున్న సంభాషణం ఫలితాలు తమకు సంతృప్తిగా లేనట్లయితే భద్రతాసంఘ సమావేశం జరగాలని తిరిగి తాము కోరుతామని తెలియ చేశారు.

వివిధ మతాలు, వివిధ జాతులతో కూడిన భారతదేశ సమాజాన్ని విభిన్న భాగాలుగా ముక్కలు కొట్టటానికి ప్రయత్నిస్తే ఆసియా, ఆఫ్రికా, మధ్యప్రాచ్య ప్రాంతాలలోని ఇతర దేశాల్లో కూడ ఇదేదుస్థితి ప్రారంభమవుతుందని చాగ్లా హెచ్చరించారు.

అధ్యక్షుని సమీక్ష ఆయన అభిప్రాయం మాత్రమే. ఏ సభ్యుడు ఏమి చెప్పారో రికార్డులో ఉంది. ఉభయపక్షాలు సుహృద్భావంతో ద్విపక్ష సంప్రతింపులు జరపడంద్వారానే భారత పాక్ల మధ్య విభేదాలు పరిష్కరించబడగలవని భద్రతాసంఘం చర్చలు తెలుపుతున్నాయి. బయటివారిజోక్యం పరిష్కారానికి కాక సంప్రదింపులకు ఆటంకంగా మాత్రమే పరిణమిస్తుందని చాగ్లా వక్కాణించారు.

ఐరాస ప్రధానకార్యదర్శి ఎడల భారతదేశానికి అపారగౌరవం ఉంది. ప్రభుత్వ అతిథిగా ఆయన భారతదేశం రావచ్చు. తన కిష్టంవచ్చిన ప్రదేశానికి వెళ్ళవచ్చు, ఎవరితోనైనా మాట్లాడవచ్చు. అయితే కాశ్మీరు చర్చ సందర్భంలో ఆయన రావటం నా కిష్టంలేదు అని చాగ్లా అన్నారు.

శ్రీ నెహ్రూ అబ్దుల్లా సంభాషణలపై శ్రీ చాగ్లా మాట్లాడుతూ భారత యూనియన్లో ఒక రాష్ట్రానికి ఎంతవరకు స్వపరిపాలనాధికారం ఉండాలనేదానిపై వారు బహుశా సంభాషణలు జరుపుతూ ఉండవచ్చునని అన్నారు. భారతదేశంలో కాశ్మీరు అంతర్భాగమనే విషయాన్ని నిరాకరించు పరిష్కారాన్ని భారతదేశం ఎన్నటికీ ఆమోదించదని ఆయన అన్నారు.

అబ్దుల్లా, నెహ్రూల మధ్య సాగే సంభాషణలు ఒక భారతదేశ పౌరునికి, ప్రధానికి మధ్య సాగే సంభాషణలని, వానిలో అంతర్జాతీయ ప్రతిపత్తి లేనేలేదని అన్నారు.

కాశ్మీరు ప్రతిపత్తిపైగాని వేరే భారత దేశంలో దానిస్థానంపైనగాని పాకిస్తాన్తో సంప్రతింపులు జరిపే సమస్యలేదని శ్రీ చాగ్లా పత్రికా గోష్టితో మాట్లాడుతూ స్పష్టంచేశారు.

శ్రీ చాగ్లా నేడుబయలుదేరి ఢిల్లీవస్తున్నారు.

జనాంతిక చర్చ

అంతకుముందు భద్రతా సంఘం అధ్యక్షుడు రోగర్ సేదో రూపొందించిన సమీక్షపై ఒక అంగీకారానికి వచ్చేందుకు నేటి ఉదయం భద్రతాసంఘ సభ్యులు ఇష్టాగోష్టి సమావేశం జరిపారు.

రెండు భాగాలుగా తయారు చేయబడింది. సభ్యులు 11 మంది అంగీకరించే విషయాలను గురించి ఒక భాగం, విభిన్న వైఖరులను ముఖ్యంగా యుథాంట్ పాత్రపై సభ్యులకు గల అభిప్రాయాలకు చెందిన సమస్యలపై మరో భాగంగా ఈ సమీక్ష రూపొందించబడింది.

సభ్యులంతా అంగీకరించే విషయాలపై సంఘ అధ్యక్షుడు తన సమీక్షలో ప్రకటించే హక్కు ఉన్నప్పటికీ అధ్యక్షుడుగా ఇతరులు ఏమి వివరించారని చెపుతూ దానిని వ్యాఖ్యానించటానికి ఐరాస ప్రణాళిక క్రింద ఆయనకు హక్కులేదని సోవియట్ యూనియన్ వాదించినట్లు తెలుస్తుంది.

స్పృహరాక పోయినా పరిస్థితి తృప్తికరం

శ్రీ పి. వి. జి. రాజు పరిస్థితిపై డాక్టరు ప్రకటన

చండీఘర్, మే 18

మోటారుకారు ప్రమాదంలో తలమీద తీవ్రమైన గాయాలకు గురైన ఆంధ్ర విద్యామంత్రి శ్రీ పి. వి. జి. రాజు గత ఎనిమిది రోజులు తర్వాత కూడా స్పృహలేకుండానే వున్నారు.

శ్రీ రాజుకు చికిత్స చేస్తున్న ఒక వైద్య నిపుణుడు నేటి రాత్రి పత్రికలవారితో మాట్లాడుతూ ఆయన సాధారణ పరిస్థితి సంతృప్తికరంగానే వుందన్నారు.

నేడుదయం పరీక్ష చేశారు. నాడి, శ్వాస, రక్తంపోటు — అన్నీ తృప్తికరంగానే వున్నాయి. కొంతబలంకూడా ఆయనకు చేకూరింది. ఆయనకు తగిలిన తీవ్రమైన దెబ్బ దృష్ట్యా అభివృద్ధి తృప్తికరంగానే వుంది.

పంజాబు ముఖ్యమంత్రి శ్రీ ప్రతాప్సింగ్ కైరాన్ మరల నేడుదయం ఆసుపత్రికి వచ్చి శ్రీ రాజు పరిస్థితిని గురించి తెలుసుకొని వెళ్ళారు.

కాంబోడియాఫిర్యాదుపై భద్రతాసంఘ చర్చ

ఐరాస, మే 18

భద్రతా సంఘం తిరిగి రేపు రాత్రి 8 గంటలకు సమావేశమయి అమెరికా, దక్షిణ వియత్నాంపై కాంబోడియా అభ్యంతరాన్ని పరిశీలించుతుంది.

ట్యూటికోరన్ రేవును అభివృద్ధి చేయ దానికుద్దేశించిన నిర్మాణ పథకానికి జులై 9న ప్రారంభోత్సవం జరుగుతుంది.

సోవియట్-భారత దేశాల వాణిజ్యం పెంపుదలకు చర్చలు

మాస్కో, మే 18

మద్రాసు రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి శ్రీ ఆర్. వెంకట్రామన్ సోవియట్ యూనియన్ విదేశవాణిజ్య శాఖ డిప్యూటీ మంత్రి నికోలాయ్ స్మెలియకోవ్ను కలుసుకొన్నారని సోవియట్ వార్తా సంస్థ టాస్ నేడు ప్రకటించింది.

సోవియట్ - భారతదేశాల మధ్య వాణిజ్య పెంపుదలకు సంబంధించిన సమస్యలను గురించి సుహృద్భావ పూర్వక వాతావరణంలో సంభాషణలు జరిపినట్లు టాస్ ప్రకటించింది.

సోషలిస్టు పార్టీల విలీనీకరణ

మధులిమాయే ప్రకటన

ఇండోర్, మే 17

పి. యస్. పి. సోషలిస్టుపార్టీల విలీనం జూన్ 2 వ తారీకుకల్లా పూర్తవుతుందని సోషలిస్టుపార్టీ నాయకుడు శ్రీ మధులిమాయే నేడిక్కడ వెల్లడించారు.

నూతన పార్టీపేరు, జెండా, ఎన్నికలగుర్తు వగైరా విషయాలను గురించి చర్చించడానికి ఉభయపార్టీల ప్రతినిధులు బొంబాయిలో గానీ, ఢిల్లీలోగానీ సమావేశ మవుతారని అన్నారు.

నూతనంగా ఏర్పడే పార్టీలో కలవడానికి సుముఖంగావున్న పెజంట్స్ అండ్ వర్కర్స్ పార్టీకూడా ఈ కమిటీ సమావేశానికి ప్రతినిధులు పంపుతుందన్నారు.

కొత్తపార్టీలో శ్రీ కామత్ చేరబోడట

రాంపూర్, మే 18

వచ్చే అక్టోబరులో పి. యస్. పి., సోషలిస్టు పార్టీల విలీనం అనంతరం ఏర్పడేనూతన పార్టీలో తాను సభ్యుడుగా ఉండలేనని శ్రీ హెచ్. వి. కామత్ (యం. పి.) నేడిక్కడ పత్రికలవారితో చెప్పారు.

శ్రీ జోషి, శ్రీ ప్రేమ్ బాసిన్లు

పి. యస్. పి. అధ్యక్ష కార్యదర్శులుగా తిరిగి ఎన్నిక

నరేంద్రదేవ్నగర్, (రాంపూర్), మే 18

ప్రజాసోషలిస్టుపార్టీకి నూతన సంవత్సరానికి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా తిరిగి శ్రీ ఎస్. యం. జోషి, శ్రీ ప్రేమ్బాసిన్గార్లు ఎన్నికైనారు.

ప్రజాసోషలిస్టుపార్టీ సప్తమ జాతీయ మహాసభ యిద్దట జరుగుతున్న విషయం పాఠకులకు విదితమే.

జాతీయ కార్యవర్గ సభ్యత్వాన్ని 15 నుండి 12 కు తగ్గిస్తూ నిబంధనావళికి వచ్చిన సవరణను మహాసభ అంగీకరించింది.

"చైనాతో పశ్చిమరాజ్యాలవ్యాపార సంబంధాలు నాకిష్టంలేదు"

అమెరికన్ టెలివిజన్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ప్రధాని నెహ్రూ స్పష్టీకరణ

న్యూయార్కు, మే 18

చైనాతో కొన్ని పశ్చిమరాజ్యాలు నెలకొల్పు కొన్న వాణిజ్య సంబంధాలు నిజంగా చెప్పాలంటే తనకు ఏ మాత్రం ఇష్టం లేదని ప్రధాని నెహ్రూ స్పష్టం చేశారు.

అమెరికాలో దేశ వ్యాపితంగా చూపించిన ఒక టెలివిజన్ ఇంటర్వ్యూలో శ్రీ నెహ్రూ పై విధంగా అన్నారు.

ఒక గంటసేపు జరిగిన ఈ టెలివిజన్ ఇంటర్వ్యూను కొన్ని వారాల క్రితం భారత దేశంలో ఫిలిం తీసి రికార్డు చేశారు.

ఈ టెలివిజన్ ఇంటర్వ్యూకు "నెహ్రూ ప్రధానిభావాలు" అని నామకరణం చేశారు.

ఆర్నాల్డు మికిపీస్చేసిన ఈ ఇంటర్వ్యూలో జాతీయ అంతర్జాతీయ వ్యవహారాలకు సంబంధించిన అనేకవిషయాలు ప్రస్తావించబడినాయి.

"చైనా ప్రజలు ఆకలితో చనిపోవాలని నేను కోరడంలేదు. కాని ఇతర దేశాల నుండి యుద్ధానికి ఉపయోగపడే ఎలాంటి సరకూ చైనాకు పంపడం నాకు యిష్టంలేదు" అని కూడా శ్రీ నెహ్రూ అన్నారు.

కాశ్మీరునుగురించి శ్రీ నెహ్రూ మాట్లాడుతూ మత ప్రాతిపదికపై అక్కడ అభిప్రాయం తీసుకోవడం కాశ్మీరుకు, తతిమ్మా భారత దేశానికి అరిష్ట దాయకం అని అన్నారు.

భారత - పాకిస్తాన్ల మధ్యయుద్ధం ఆలోచించకూడని విషయంఅనిఆయనస్పష్టంచేశారు.

కాలం గడిచినకొద్దీ రెండు దేశాలమధ్య రాజకీయ ఉద్రిక్తత తగ్గిపోతుందని, అవి ఒక అంగీకారానికి రాగలుగుతాయని ఆయన చెప్పారు.

పాకిస్తాన్ విధానం కేవలం భారత విద్వేషంపై ఆధారపడివుంది. దానివలననే యిబ్బందులు ఏర్పడుతున్నాయి.

భారత ప్రభుత్వంలోనూ, ఉద్యోగాల్లోనూ కూడా, సైన్యంలోనూ ముస్లిములకు చక్కటి ప్రాతినిధ్యం వుంది. సైన్యంలో చాలామంది ముస్లిములు వున్నారు. ఆఫీసర్లుగా కూడా వున్నారు.

పాకిస్తాన్తో భారతదేశ సంబంధాలను గురించీ, ఉభయదేశాలమధ్య ఉద్రిక్తత పెరిగినపక్షంలో సమస్యలను పరిష్కరించే పద్ధతిని గురించి అడిగిన ప్రశ్నకు శ్రీ నెహ్రూ అంతకు ముందు భారతదేశం చేసిన నిర్యుద్ధ ప్రకటనను జ్ఞప్తికి తెచ్చారు. ఇవి సమస్యలను పరిష్కరించలేకపోయినప్పటికీ వాతావరణాన్ని బాగు పరచగలవన్నారు. పాకిస్తాన్తో ఏ సమస్యపైనా వర్తించే ఏదో విధంగా అంగీకారానికి రావడానికి భారతదేశం సంసిద్ధంగా వుందని శ్రీ నెహ్రూ చెప్పారు.

పాకిస్తాన్తో ఏర్పడిన ఇతర పెద్ద ఇబ్బందులను భారతదేశం ఎదుర్కోవలసివచ్చిన విషయాలను గురించి శ్రీ నెహ్రూ ఇలా అన్నారు:

పాకిస్తాన్ చైనాల పొత్తు

"పాకిస్తాన్ దాదాపు చైనాతో ఏకమైంది. పాకిస్తాన్కు చైనాతో సన్నిహిత సంబంధం ఏర్పడింది. చైనాతో చేసుకొన్న సరిహద్దు ఒడంబడికలో పాకిస్తాన్ [illegible] కొంత కాశ్మీర్ భాగాన్ని చైనాకు యిచ్చివేయడానికి ఒప్పుకొన్నది. అలా ఇచ్చివేసే హక్కు దానికి లేదు. ఒకవేళ వారి ఉద్దేశంలో కాశ్మీరు సమస్య యింకా పరిష్కారం కాకపోయినప్పటికీ వారికి అలా చేసే హక్కులేదు.

భారత - పాకిస్తాన్ల మధ్య సాయుధ సంఘర్షణ జరిగితే "చాలా ప్రమాదకరమైన పరిస్థితులు" ఏర్పడతాయి. అలా జరగదనే నేను ఆశించుచున్నాను, అప్పుడప్పుడు అధ్యక్షుడు అయూబ్ఖాన్ కూడా యిలాగే చెప్పారు. కాని పాకిస్తాన్ మనస్తత్వమంతా భారత దేశం వట్ల భయ విద్వేషాలతో కూడుకొని వుంది.

యుద్ధరంగంలో భారతదేశాన్ని ఎదుర్కొనే ఉద్దేశ్యంతో పాకిస్తాన్ బలపడేందుకు మొదట పశ్చిమ రాజ్యాలపై ఆధారపడింది. అది తామనుకున్నంత వరకూ సాగకపోయేటప్పటికి ఇంక చైనావైపుకు మరలారు.

చైనాదాడి జరిగినప్పుడు ఆ అవకాశం తీసుకొని తాము భారతదేశంపై దాడిజరపనందుకు విచారించానని అయూబ్ఖాన్ ఎక్కడో చెప్పారుకూడా. ఏమైనప్పటికీ పాకిస్తాన్, భారతదేశాలు స్నేహంగా వుండాలి. స్వతంత్ర దేశాలుగా ఒకదానితో మరొకటి సహకరించు

(మిగతా 6 వ పేజీలో)

జార్సుమైదానంలోని తటస్థపక్ష స్థావరాలు

పాథెట్ లావో దళాలు స్వాధీనం చేసుకున్నట్లు ప్రిన్సు సావన్నాఫూమా వెల్లడి

వియంతియాన్, మే 18

కేంద్రలావోస్లోని జార్సుమైదానంలో తటస్థపక్ష అధీనంలో ఉన్న స్థానాలన్నిటిని పాథెట్లావోసైన్యాలు స్వాధీనం చేసుకున్నాయని ప్రధానమంత్రి సావన్నఫూమా నేడు ప్రకటించారు.

బ్రిటన్, సోవియట్ రష్యా అంతర్జాతీయ కంట్రోల్ కమిషన్, పోరాటాన్ని ఆపవలసిందని పాథెట్లావో నాయకుడు ప్రిన్సుసౌఫనోవాంగ్ను కోరటానికి కేంద్ర లావోస్లోని ఖాంగ్ఖేకు ఒక ప్రతినిధివర్గాన్ని పంపటానికి ప్రయత్నం చేస్తున్న సందర్భంలో యీ ప్రకటన చేసినట్లు దౌత్యవర్గాల ద్వారా తెలుస్తోంది.

తటస్థ పక్ష దళాల నాయకుడు జనరల్ కాంగ్లే ప్రధాన కార్యాలయంకూడా పాథెట్లావో సైన్యాలు స్వాధీనం చేసుకున్నట్లుప్రిన్సు సావన్న ఫూమా పత్రికా విలేకరులకు తెలియజేశారు.

పూర్తిగా చుట్టుముట్ట బడ్డామని చెప్పవచ్చునని కూడా ఆయన అన్నారు.

పరిస్థితి చాలా క్లిష్టంగా ఉంది.

కాల్పుల విరమణను, 1962 జెనీవా ఒడంబడికను పాథెట్లావో పక్షం ఉద్దేశ్యపూర్వకంగానే అతిక్రమిస్తున్నారని ప్రిన్సు సావన్న ఫూమా ఆరోపించారు.

ఖాంగ్ఖేలోని పాథెట్లావో ప్రధాన కార్యాలయానికి రేపు రమ్మని పాథెట్లావో నాయకుడు ప్రిన్సు సౌఫనోవాంగ్ తనను గత [illegible] ఆహ్వానించాడని, ప్రస్తుత పరిస్థితులలో తాను వెళ్ళటంలేదనికూడా ఆయన తెలియచేశారు.

ఇటీవల ఖాంగ్హాంవద్ద జరిగిన పోరాటంలో ఇద్దరు ఉత్తరవియత్నాం సైనికులవద్ద దొరికాయని చెప్పిన గుర్తింపు కార్డులు, ముందుకు పదండి అనే ఉత్తరువు ప్రిన్సు సావన్నా ఫూమా చూపించారు.

ప్రస్తుతం కొనసాగించిన దాడి బైటనుండి వచ్చిన సహకారంతోనూ, ఒడంబడికతోనూ తయారు చేయబడినట్లు కనపడుతోందని కూడా ఆయన ఆరోపించారు.

అంతర్జాతీయ కంట్రోల్ కమిషన్లోని పోలెండు ప్రతినిధివర్గం నివాస గృహాన్ని సాయుధ సైనికులు ఆక్రమించుకున్నారు. బైటవారిని లోనికిరానీ, లోన ఉన్నవారిని బైటకుగాని పోనీయటంలేదు.

కాల్పుల విరమణ ఒడంబడికను అతిక్రమించే దళాలను అదుపు చేయడానికి తన పలుకుబడిని ఉపయోగించమని కోరుతూ జెనీవామహాసభ అధ్యక్షునికి ప్రిన్సు సావన్నఫూమా ఒక సందేశం పంపినట్లు నేడు ప్రకటించారు.

ప్రస్తుత దురాక్రమణ చర్యలకు పూర్తిగా బాధ్యత పాథెట్లావో దేనని ఆ సందేశంలో ఆరోపించారు.

పాథెట్లావో నాయకులని అంతర్జాతీయ కంట్రోలు కమిషన్ ప్రతినిధివర్గ సభ్యులమధ్య ఖాంగ్ఖేలో నేడు జరగవలసిన సమావేశం, పోలెండ్ ప్రతినిధివర్గకార్యాలయాన్ని సాయుధ సైనికులు చుట్టుముట్టడంతో రద్దుచేసుకున్నట్లు దౌత్యవర్గాలు తెలియచేశాయి.

"కాశ్మీరుసమస్యపైకమ్యూనిస్టుపార్టీలో విభేదాలేమీలేవు"

ఆ సమస్యపై తామంతా కలిసే నిర్ణయం తీసుకొన్నామని శ్రీ భూపేష్ గుప్త ప్రకటన

తిరువనంతపురం, మే 18

కాశ్మీరు సమస్యపై కమ్యూనిస్టు పార్టీలో అభిప్రాయ భేదాలేమీ లేవని, ఆ సమస్యపై "తామంతా కలిసే నిర్ణయం తీసుకొన్నామని" రాజ్యసభలో కమ్యూనిస్టు పక్షనాయకుడు శ్రీ భూపేష్గుప్త నేడిక్కడ పత్రికా గోష్ఠిలో ఒక ప్రశ్నకు సమాధానంగా తెలియజేశారు.

భారత దేశంలో కాశ్మీరు విలీనమైనదని, ఇంక ఆ ఒడంబడికను ఏ విధంగానూ మార్చరాదని ఆయన అన్నారు.

ఉన్న సమస్యల్లా కాశ్మీరుపై పాకిస్తాన్ దురాక్రమణ జరుపుతున్నది, ఆ దురాక్రమణను మట్టుపెట్టడంలో ఐరాస విఫలమైనదని ఆయన్నారు.

భారతదేశ నాయకులతో అబ్దుల్లా సంభాషణలను గురించి ఆయన ప్రస్తావించి కాశ్మీరు భారతదేశ అంతర్భాగమని, దాని విషయమై ఇంక ఎలాంటి చర్చలు వుండరాదని అన్నారు. ఆ తరువాత భారత నాయకులతో షేక్ అబ్దుల్లా కాశ్మీర్లో ప్రజాతంత్ర పరిపాలనను ఎలా నెలకొల్పాలన్న విషయమై మాట్లాడవచ్చునని అన్నారు.

షేక్ అబ్దుల్లా ప్రధానమంత్రి యింటివద్ద కూర్చొని అన్నిరకాల భావాలను వెల్లడించడమే నేడు ఆసక్తిదాయకమైన పరిణామంగా వున్నదని శ్రీ భూపేష్గుప్త అన్నారు.

పాకిస్తాన్ అధ్యక్షునితో షేక్ అబ్దుల్లా జరపదలచిన సంభాషణలను గురించి శ్రీ భూపేష్ ప్రస్తావించి యిలా అన్నారు:

అయూబ్ ఖాన్తో షేక్ అబ్దుల్లా ఏమి చర్చించ బోతున్నారో మనకు తెలియదు. కాశ్మీరు భారతదేశ అంతరంగిక సమస్య. కాశ్మీరు [illegible] సమస్య కారాదు. సామ్రాజ్య వాదుల కోర్కెలు ఈ విషయంలో సఫలం కాకుండా చూడాలని భారత ప్రజలు, జమ్మూ-కాశ్మీర్ ప్రజలూ స్పష్టం చేయాలి.

కాశ్మీరు సమస్యపై కమ్యూనిస్టుపార్టీలో అభిప్రాయభేదాలు వున్నాయా అని ప్రశ్నించగా ఆ సమస్యపై "తామంతా కలిసే నిర్ణయం తీసుకొన్నా"మన్నారు.

కాశ్మీరులో ప్లెబిసైట్ తీసుకోవాలని కేరళలోని కమ్యూనిస్టులలో కొందరు అంటున్నారట నిజమేనా అని ఒక విలేకరి అడుగగా అలా ఎవరైనా సూచించితే అది తప్పుకాగలదన్నారు.

శ్రీ భూపేష్ భువనేశ్వర్ కాంగ్రెసు తీర్మానంపై ఢేబర్ కమిటీ నివేదికను ప్రస్తావించి, బ్యాంకులను జాతీయం చేయడం, [illegible] టోకు వ్యాపారాన్ని ప్రభుత్వం నిర్వహించడంలాంటి కొన్ని నిర్దిష్టమైన చర్యలను తీసుకుంటునే ఆ కమిటీ వెల్లడించిన సిద్ధాంత విషయాలకు ఏమైనా విలువ వుండగలదన్నారు.

ఇలాంటివి ప్రభుత్వం వెంటనే నిర్వహించవలసిన విషయాలన్నారు.

త్రిపురలోవున్న 21 మందితోసహా చాలామంది కమ్యూనిస్టులు ఇంకా డిటెన్షన్లో వున్నారనీ, వారిని యింకా డిటెన్షన్లో వుంచడం మంచే మాసిన రాజకీయ కక్ష సాధించడమే కాగలదని శ్రీ భూపేష్ అన్నారు.

అమెరికా సహాయ సంస్థ డైరెక్టరు

జాన్. పి. లెవిస్ నియామకం

వాషింగ్టన్, మే 18

భారతదేశంలోని అమెరికా సహాయసంస్థకు డైరెక్టరుగా జాన్. పి. లెవిస్ను నియమించనున్నట్లు అమెరికా అధ్యక్షులు జాన్సన్ నేడు ప్రకటించారు.

అధ్యక్షుని ఆర్థిక సలహాసంఘంలో సభ్యుడుగా ఉన్న లెవిస్ న్యూఢిల్లీ వెళ్ళటానికి సెప్టెంబరు నెలలో ప్రస్తుత పదవినుండి విరమించవచ్చునని వైట్హౌస్నుండి విడుదల చేసిన ప్రకటనలో ఉంది.

షేక్ అబ్దుల్లా విడుదల పూర్తిగా సమర్థనీయం

లాల్ బహదూర్ శాస్త్రి ప్రకటన

మంగళూరు, మే 18

షేక్ అబ్దుల్లాను విడుదల చేయడంవల్ల ఐక్యరాజ్యసమితిలో మనవాదానికి బాగా బలంచేకూరిందని కేంద్రమంత్రి శ్రీ లాల్బహదూర్ శాస్త్రి నేడిక్కడ చెప్పారు.

శ్రీ శాస్త్రి నేడిక్కడ పదిహేనుకోట్ల నలభై రెండులక్షల రూపాయల వ్యయంతో నిర్మించబడే మంగళూరు హార్బరు నిర్మాణానికి ప్రారంభోత్సవం చేస్తూ ఈ విషయం చెప్పారు.

"పదేండ్లపాటు షేక్ అబ్దుల్లాను కారాగారంలో ఎందుకు బంధించి ఉంచామో పెక్కు విదేశాలు అర్థంచేసుకోలేదు. ఐక్య రాజ్య సమితిలో పరిస్థితి, వాతావరణం అంతా మార్పు చెందింది. భద్రతా సంఘంలో భారతదేశాన్ని వ్యతిరేకించిన అమెరికా, బ్రిటన్లు సైతం కాశ్మీర్ సమస్యను భారత-పాకిస్తానులమధ్యముఖాముఖి సంప్రతింపులద్వారా పరిష్కారం అయ్యేందుకే విడిచిపెట్టాలని బహిరంగంగా చెప్పాయి" అన్నారు శ్రీ లాల్ బహదూర్.

భారతదేశంలోనిపరిస్థితి నిశ్చలమయంగా ఉన్నదని, కాశ్మీర్ సమస్య రానురాను దేశమంతటా బాగా ఆందోళన కలిగిస్తున్నదని శ్రీ శాస్త్రి పేర్కొన్నారు.

ఏ విదేశ జోక్యమూ మాకు అవసరం లేదని మనం ఖండితంగా చెప్పామని, మన భూభాగంలో ఏ ప్రాంతంలోనైనా స్వయం నిర్ణయ హక్కు సిద్ధాంతాన్ని వదలుకోవడం కష్టమని, స్వయంనిర్ణయం అనేది అర్థరహిత మని ఆయన అన్నారు.

దేశంలో విచ్ఛిన్నకర వైఖరులు కనిపిస్తున్నందుకు హెచ్చరిస్తూ, దేశ విచ్ఛిన్నానికి జరుగుతున్న కార్యకలాపం ప్రమాదకరమని శ్రీ శాస్త్రి పేర్కొన్నారు.

మన ఆలోచన అంతా ఐక్యతపైనే కేంద్రీకరించాలని ఆయన అన్నారు.

మంత్రిగా శ్రీ తోట రామస్వామి నియామకం

ముఖ్యమంత్రి ప్రకటన

హైదరాబాద్, మే 19

ఆంధ్ర ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి నేడిక్కడ పత్రికా విలేకరులతో మాట్లాడుతూ మంత్రివర్గ విస్తరణంటూ ఏమీ వుండదని శ్రీ పల్లంరాజు మరణంవలన మంత్రివర్గంలో ఏర్పడిన ఖాళీలో ఒక మంత్రిని నియమించగలమని చెప్పారు.

తూర్పు గోదావరి జిల్లాకు చెందిన శ్రీ టి. రామస్వామిని ఆస్థానంలో మంత్రిగా నియమించగలనన్నారు. శ్రీ రామస్వామి ప్రస్తుతం శాసనమండలి సభ్యుడు.

మంత్రివర్గంలో చేర్చుకోవడానికి ఇంకా సమర్థులున్నప్పటికీ శాసనమండలికి ప్రాతినిధ్యం యివ్వడానికే శ్రీ రామస్వామిని తీసుకొంటున్నామని ఆయన చెప్పారు.

శ్రీ టి. రామస్వామి తూర్పు గోదావరి జిల్లా కాంగ్రెసు అధ్యక్షుడుగా వున్నారు. ప్రస్తుతం ఆయన జిల్లా పరిషత్ అధ్యక్షుడుగా కూడా వున్నారు.

24 వ తేదీ 8½ గంటలకు ఆయన ప్రమాణ స్వీకారం చేస్తారు. ఆయనకు పూర్తి కాబినెట్ హోదా ఉంటుంది.

ఆయన వయస్సు 55 సంవత్సరాలు. ఆయన 1952 నుండి 55 వరకు శాసన సభ్యులుగా ఉన్నారు.

తూ|| పాకిస్తాన్లో జలవిద్యుత్ ఉత్పత్తి

పెంపుదలకు అమెరికా ఆర్థిక సహాయం

వాషింగ్టన్, మే 18

తూర్పు పాకిస్తాన్లో విద్యుచ్ఛక్తి ఉత్పత్తి పెంచటానికి అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి సహాయక సంస్థనుండి 85 లక్షల డాలర్లు అప్పుగాయివ్వటానికి అధికారం యివ్వబడింది.

ఢక్కావద్ద వున్న విద్యుత్ ఫ్యాక్టరీలో జల విద్యుత్ యంత్రాన్ని నెలకొల్పటానికి యీ అప్పును అమెరికా యిస్తుంది.

ఈ కొత్త జలవిద్యుత్ యంత్ర నిర్మాణం ద్వారా 44 వేల కిలోవాట్ల విద్యుచ్ఛక్తి ఉత్పత్తి అవుతుంది. ప్రస్తుతం 30 వేల కిలోవాట్ల జల విద్యుత్ మాత్రం తూర్పు పాకిస్తాన్లో ఉత్పత్తి అవుతోంది.

వాషింగ్టన్కు శ్రీ చావన్ రాక

వాషింగ్టన్, మే 18

భారత రక్షణమంత్రి శ్రీ వై. బి. చావన్ నేడిక్కడకు వచ్చారు.

అమెరికా రక్షణశాఖ ఉన్నతాధికారులు, శ్రీ చావన్ మధ్య జరిగే సంభాషణలలో భారతదేశానికి అమెరికా చేసే దీర్ఘ కాలిక సైనిక సహాయంపై కేంద్రీకరించబడవచ్చునని తెలుస్తుంది.

బ్రిటిష్ ప్రభుత్వంతో సంప్రతింపులకై మే 29 వ తేదీన ఆయన లండన్ వెళతారు.

జూన్ 17 నుంచి 22 వరకూ పాట్నాలో మామిడి పండ్ల ప్రదర్శనం జరుగుతుంది.

సత్యాగ్రహుల విడుదలకై ఆందోళన

ముఖ్యమంత్రి వద్దకు శ్రీ కృష్ణారావు, శ్రీ సదాశివన్ల రాయబారం

హైదరాబాద్, మే 18

అదనపు శిస్తు చట్టం రద్దుకొరకూ, బంజరు పంపకం కొరకూ సత్యాగ్రహ పోరాటాన్ని నడిపిన అఖిల పక్ష కార్యాచరణ సమితి కన్వీనర్ శ్రీ వై. వి. కృష్ణారావుగారూ, శాసన మండలి ప్రతిపక్షనాయకుడు శ్రీ బద్దకల్లు సదాశివన్, ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డిగారిని కలుసుకుని, శిక్షలుపడిన సత్యాగ్రహ ఖైదీల నందరినీ, విచారణలో ఉన్నవారినీ కూడా విడుదల చేయవలసిందిగా కోరారు.

అఖిలపక్ష కార్యాచరణ సమితి సత్యాగ్రహ పోరాటాన్ని విరమించుకొన్న విషయాన్ని వీరు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో ఆ యా ప్రాంతాల్లో ఈ సత్యాగ్రహ ఖైదీల అవసరం చాలా ఉందనికూడా తెలియజేశారు. శిక్షలు పడిన సత్యాగ్రహ ఖైదీల గురించి, విచారణలో ఉన్నవారి గురించి పూర్తి వివరాలను తెలుసుకొని, త్వరలో తగు నిర్ణయం తీసుకుంటానని ముఖ్యమంత్రి వారికి వాగ్దానం చేశారు. (వి. వి.)

డి. ఎం. కె. సభ్యుల అరెస్టు

హిందీ వ్యతిరేక ఉద్యమ సందర్భంగా

తిరుచిరపల్లి, మే 18

హిందీ వ్యతిరేక ఉద్యమ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలముందు పికెటింగుజరిపినందుకు తిరుచిజిల్లాలోని పదునాలుగు కేంద్రాలలో మొత్తం 210 మంది ద్రవిడ మున్నేట్రకజగం వాలంటీర్లను నేడు అరెస్టు చేశారు. వీరిలో అయిదుగురు శాసనసభ్యులు, ఒక మహిళా శాసనసభ్యురాలుకూడా ఉన్నారు.

తిరుచి పట్నంలో పికెటింగ్ చేసినవారిలో కాంగ్రెస్ కార్యకర్తలుకూడా ఉన్నారు. ఆయనను కూడా పోలీసులు కస్టడీలోనికి తీసుకున్నారు.

విశాఖపట్నం ఉక్కు ఫ్యాక్టరీ

సాంకేతిక నివేదిక తయారైందని ప్రకటన

హైదరాబాద్, మే 18

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ప్రతినిధి ఒకరు నేడు పత్రికల వారితో మాట్లాడుతూ రు. 100 కోట్ల వ్యయంతో విశాఖలో నిర్మించ తలపెట్టిన ఉక్కు ఫ్యాక్టరీ సాంకేతిక నివేదిక తమకు అందిందని తెలియ జేశారు.

కొత్తగూడెంలో మూడు కోట్ల వ్యయంతో నిర్మించుతున్న బేరియమ్ రసాయనాల ఫ్యాక్టరీ నిర్మాణం త్వర త్వరగా పూర్తవుతోందని అన్నారు.

విశాలాంధ్ర

గుత్తవర్గాలకు వ్యతిరేకంగా ఐక్య కార్యాచరణ

ప్రజాస్వామ్య సోషలిజంపై, ఫేబర్ కమిటీ నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించటంతో బొంబాయిలో అఖిలభారత కాంగ్రెసుకమిటీ సమావేశం ముగిసింది.

గుత్తవర్గాలను అదుపులో పెట్టేందుకుగాని, వారలను అదుపులో పెట్టేందుకుగాని నిర్దిష్టమైన ఏ ఒక్క సూచన ఇందులో లేదు. బ్యాంకుల జాతీయకరణగాని, ధాన్యం టోకు వ్యాపారాన్ని ప్రభుత్వమే నిర్వహించవలసిన అవశ్యకతను గాని ఈ నివేదిక సూచించలేదు. కొత్త పరిశ్రమలకు లైసెన్సులిచ్చే సందర్భంలో గుత్త సంస్థలు పెరగకుండా జాగ్రత్తపడాలని, మూడో ప్రణాళికాంతానికిధాన్యవ్యాపారంలో ప్రభుత్వం బలీయమైన స్థానాన్ని సంపాదించాలని మాత్రం నివేదిక సూచించింది.

కనుకనే కాంగ్రెసులోని పెక్కుమంది ప్రజాతంత్రవాదులు ఈ నివేదికను తీవ్రంగా విమర్శించారు.

విభిన్న ధోరణులను, కొన్ని అసందర్భమైన వాదనలను సైతం సమన్వయం చేయటానికి ఈ నివేదిక ప్రయత్నించిందని కనుక ఈ నివేదిక నిరుపయోగమని మాజీ రక్షణ మంత్రి కృష్ణమీనన్ నిశితంగా విమర్శించారు. నెరవేరని ఆశలను రేకెత్తించటం అనర్థాలకు కారణమని భువనేశ్వర్ మహాసభ నాటి నుండి కాంగ్రెసు ఇలాగే వ్యవహరిస్తుందని మీనన్ నిశితంగా ఖండించారు.

దేశంలో జమీందారులు రద్దయినారే గాని, జమీందారీ వ్యవస్థమాత్రం రద్దుకాలేదని, దున్నేవానికి భూమి లభించే విధంగా నిజమైనభూసంస్కరణలు జరగనిదే ఆహార సమస్య పరిష్కారం కాదని తెలియచేశారు. బ్యాంకులను జాతీయం చేసి, ఆర్థిక వ్యవస్థపై గుత్తవర్గాల పట్టును తగ్గించాలని ఉద్ఘాటించారు.

మాజీ కేంద్ర ఆహార మంత్రి ఎ. పి. జైన్, కె. డి. మాళవీయా యన్. వి. గాడ్గిల్, అలిదాలీజాఫర్ ఖాయి తదితరులు పెక్కుమంది కూడా ఇదే విధంగా ఫేబర్ కమిటీ సూచనలను తీవ్రంగా విమర్శించారు.

ఇలాంటి నివేదికలను కాంగ్రెసు ఇదివరకే ఎన్నిటినో ఆమోదించిందనీ, కాగా "నివేదికలపై గాక ఆహారోత్పత్తి భూమిపై సాగవలసి ఉంటుందని" శ్రీ జైన్ అవహేళన చేశారు.

సోషలిజానికి బద్ధశత్రువులైనవారు కాంగ్రెస్‌లో కీలక స్థానాలలో ఉండగా, ఏ తీర్మానమైనా ఎలా అమలుజరుగుతుందని, శ్రీ ఎన్. వి. గాడ్గిల్ సూటిగా ప్రశ్నించారు. అవినీతికి పేరుపడిన ప్రముఖులందరినీ అందలం ఎక్కించి, అవినీతిని నిరోధించాలని ప్రసంగాలు చేయటం మోసంకాదా అని అలిదాలీ జాఫర్ ఖాయి విమర్శించారు.

ఫేబర్ కమిటీ సూచనలపై ఇంతటి తీవ్రవిమర్శలను, కాంగ్రెస్‌లోని అతివాదులు చేసినప్పటికీ, చివరకు ఫేబర్‌కమిటీ ఎట్టిసవరణలు లేకుండానే నివేదిక ఆమోదించబడ్డది. కాంగ్రెసులోని ప్రజాస్వామ్యవాదులకు అధికారవర్గ తీర్మానాలను మార్పించగలశక్తి ఇంకా ఏర్పడలేదనటానికిది తార్కాణం.

చివరకు ఫేబర్ ఇచ్చిన సమాధానం, కాంగ్రెసు నాయకత్వం ఇంతకాలంగా అనుసరిస్తున్న మోసపు విధానానికి చిహ్నంగా ఉన్నది.

సోషలిస్టు లక్ష్య సాధనపై కాంగ్రెసు నాయకత్వంలో విభేదాలేవనీ కాగా, దేనికి ప్రాధాన్యం ఇవ్వాలి అనే అంశంపై మాత్రమే అభిప్రాయభేదాలున్నాయనీ, బ్యాంకుల జాతీయకరణ భువనేశ్వర్ తీర్మానంలో ప్రస్తావించలేదుగనుక ఆ విషయం పరిశీలించలేదని ఫేబర్ సమర్థించుకో చూశారు.

కేవలం నివేదికలతోనూ, తీర్మానాలతోనూ, కాలక్షేపం చేయాలని మాత్రమే కాంగ్రెసు నాయకత్వం ప్రయత్నిస్తున్నది తప్ప, ఆహార సమస్య పరిష్కారానికిగాని, గుత్త వర్గాలపై అదుపుకుగాని ఏ ఒక్క నిర్దిష్ట చర్యను తీసుకోటానికి సిద్ధపడటం లేదని, బొంబాయిలో సమావేశ నిర్ణయాలు మరొకసారి స్పష్టం చేస్తున్నాయి.

బొంబాయిలో జరిగినట్టి చర్చలు, ఇంతకుముందు పెద్దస్థాయిలో, భువనేశ్వర్‌లోనూ అంతకుముందు జయపూర్ సమావేశంలోనూ జరిగాయి.

కాని ఫలితం శూన్యం. శూన్యమే కాదు. లక్ష్యానికి పూర్తిగా విరుద్ధమైన విధానాలు. దేశీయ, విదేశీయ గుత్తవర్గాలకు ఇతోధిక సౌకర్యాలను కలిగించే చర్యలు, ఆర్థికమంత్రి కృష్ణమాచారి అధ్వర్యాన, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్నది.

దేశంలో గుత్తసంస్థలు ఎంత ప్రమాదకరంగా బలపడ్డాయో ఆర్థిక పరిస్థితులను స్థూలంగా పరిశీలించిన ప్రతిఒక్కరికి బోధ పడుతున్నది. మహలనోబిస్ కమిటీ నివేదిక ఈ విషయాన్నే నిరూపించింది.

ఐనా తిరిగి గుత్త పెట్టుబడుల పెరుగుదల ఎలా ఉందో పరిశీలించేందుకు ఆర్థికమంత్రి ఒక కమిషన్ నియమించారు. ఈ కమిషన్ నివేదిక 1966 ఆఖరుకుగాని, అంటే రెండేండ్లకుగాని తయారుకాదు.

కాలయాపనకు కాకపోతే ఈ కమిషన్ నియామకంలో మరొక ఉద్దేశమేముంది?

బ్యాంకులిచ్చే రుణాలనువినియోగించుకొని, ధాన్య వ్యాపారులు ధాన్యంకొని నిల్వచేసి కృత్రిమంగా ధరలు పెంచుతున్న విషయం జగద్విదితం. అయినా బ్యాంకులను జాతీయం చేయటానికి ప్రభుత్వం సిద్ధపడడంలేదు.

భూసంస్కరణచట్టాల ఫలితంగా దున్నేవానికి భూమి లభించలేదు. ఆహారోత్పత్తిని పెంచేందుకవసరమైన నిజమైన ప్రోత్సాహం రైతాంగానికి లభించలేదు. కాని ఈ కీలకమైన అంశాన్ని దాటవేస్తూ ధాన్యాల దిగుమతిద్వారానే ఆహారసమస్యను పరిష్కరించాలనే విఫలయత్నాన్ని ఏండ్ల తరబడి కేంద్ర ప్రభుత్వం సాగిస్తూనే ఉన్నది.

కాంగ్రెసు సంస్థలోనూ, నాయకత్వంలోనూ బలీయంగాఉన్న అభివృద్ధినిరోధకవర్గాల, పట్టువలననే ఇలా జరుగుతున్నది. కాంగ్రెసు చేసే ప్రతి ఒక్క తీర్మానాన్ని బుట్టదాఖలు చేయటమే తమ పనిగా ఈ వర్గాలు చేపట్టాయి. ఈ స్థితిలో మార్పు రానంతవరకూ, ఆకు కుపోకకు అందని, ఫేబర్ కమిటీ నివేదికల వంటివాటిని ఆమోదిస్తూ కాలక్షేపం చేయటంతప్ప కాంగ్రెసు సంస్థ చేయగలిగిందిలేదు.

లైసెన్సులు మంజూరుచేసే సందర్భంలో గుత్తసంస్థలు పెరగకుండా జాగ్రత్తవహించవలెనని, ఫేబర్‌కమిటీ చేసిన నిర్దిష్టమైన సూచన అమలు జరగాలన్నా కాంగ్రెసు నాయకత్వంలోని గుత్తవర్గాల పట్టుబలహీనపడవలసిఉంది.

కాంగ్రెసులోని ప్రజాస్వామ్య వాదులు, అతివాదులు, కృష్ణమీనన్, మాళవీయాల వంటివారి నాయకత్వాన అభివృద్ధికర విధానాలకై నిరంతరం ఆందోళన సాగిస్తున్న మాట నిజం. ఇది నిస్సందేహంగా శుభ సూచన.

కాగా కాంగ్రెసులోని అతివాదుల ఆందోళనా కృషి ఇంకా ఎన్నోరెట్లు అభివృద్ధి చెందవలసి ఉంది. సమైక్యంగా కొనసాగవలసి ఉంది. కాంగ్రెసు వెలుపల ఉన్న ప్రజాస్వామ్య శక్తులతో సన్నిహిత సంబంధాలను ఏర్పరచుకొని గుత్తవర్గాలకు వ్యతిరేకంగా ఐక్య ఆందోళన, పోరాటం సాగించవలసి ఉంది.

కాంగ్రెసు వెలుపల, లోపలఉన్న ప్రజాస్వామ్య శక్తులు మరింత ఐక్యంగా, సంఘటితంగా కృషిచేసినప్పుడే కేవలం కబుర్లతో కాలక్షేపం చేసే, కాంగ్రెసు నాయకత్వ విధానాలను, ఆచరణను మార్పించటం సాధ్యం.

పినకొండవారి మార్చి నెల ఆదాయం రూ 9,75,410 లు. ప్రత్యేక ఆదాయాలు: [illegible] లో వచ్చిన మొత్తం రూ4,500లు. [illegible]

డాంగే ప్రసంగం 3

నిరంతరం బ్రిటీషుగూఢచారుల వలయాలను తప్పించుకుంటూసాగినతొలినాటి కమ్యూనిస్టు విప్లవకారులకృషి

1920-24 సంవత్సరాల మధ్య కమ్యూనిస్టు విప్లవకారులు తమ కార్యక్రమాలను ఎన్ని కష్టనష్టాలకూ సిద్ధపడి కొనసాగిస్తూ ఉండేవారో, బ్రిటిష్ గూఢచారులు వారిని నిరంతరం ఎలా వెంటాడేవారో శ్రీ డాంగే, ఏప్రిల్‌లో జరిగిన జాతీయ సమితి సమావేశంలో చేసిన ప్రసంగంలో వివరించారు. ఈ ప్రసంగంలోని మొదటి రెండు భాగాలు ఇదివరకే ఇచ్చాము. మూడో భాగాన్ని నేడు ప్రచురిస్తున్నాము — (సం)

(నిన్నటి తరువాయి)

ఆ వచ్చినవ్యక్తి నళిని అవునోకాదో తెలుసుకోమని నేనెందుకు చెప్పలేదు: అతణ్ణి పోలీసులని హెచ్చరించలేదెందుకు? అనే ప్రశ్న వస్తుంది. మొదటి విషయం, నళినిఎప్పుడొస్తాడో నాకు తెలియదు. అతని మారు పేరుగాని చిరునామాగానీ నాకు తెలియదు. నిర్మాణ రంగంలో స్థితి యెంత గందరగోళంగా వుందో అతనికి చెప్పాలనికూడా భావించాను.

నళిని వచ్చాడు. మధ్య వ్యక్తి అతణ్ణి నా దగ్గరకు తీసుకొచ్చాడు. అతని రాక గురించి పోలీసులకు తెలుసనీ, అందుకని జాగ్రత్తలు తీసుకోమని ముందుగానే హెచ్చరిక చేశాం. నళిని అనుమాన పడ్డాడు, రౌద్రు డయ్యాడు. తన రివాల్వర్ తీసి "నన్ను పడవ్వా పట్టుకోవడానికి ప్రయత్నిస్తే, యిదిగో, దీన్ని ప్రేలుస్తాను" అంటూ చూపాడు. తొందరపాటుతనంతో తెలివితక్కువగా వ్యవహరించవద్దని అతనికి నచ్చచెప్పాను. ఆ తరువాత చాలా సేపు మాట్లాడుకున్నాం. తాను విదేశాల నుండి పంపిన ఒక అచ్చుయంత్రం చేరిందా అని అడిగాడు. లేదనిచెప్పాను. స్వంతంగానేఒకయంత్రం సంపాదించి పని వెళ్లదీస్తున్నానని చెప్పాను. పంపిన డబ్బు చేరిందా అని మరో ప్రశ్న వేశాడు. అదీలేదు. బెర్లిన్‌లో అచ్చయిన వార్తా పత్రికలు ఎన్ని ప్రతులొస్తున్నాయి? అప్పుడప్పుడూ మూడో నాలుగో తప్ప నాకు చేరడంలేదు. ఇదంతా విని నళిని ఆశ్చర్యపోయాడు. నిర్మాణం అంతా తల్లక్రిందులుగా వుందని అతనికి బోధపడింది. ప్రభుత్వం కల్పిస్తున్న అవరోధాన్ని అధిగమించడమెలాగో అతనికి బోధపడకపోయింది.

పాలకొట్టులో సమావేశాలు

ప్రతిరోజూ సాయంత్రం అఖాడాకు వెళ్ళి వ్యాయామం చేయడం నాకు సరదా. వ్యాయామశాలనుంచి తిరిగివచ్చి నా నివాసానికి సమీపంలోనిఒక చిన్నసందులోవున్న ఒకపాలకొట్టుకు వెళ్ళడం అలవాటు. అలా వ్యాయామశాలకువెళ్ళి తిరిగివస్తూ పాలకొట్టుకువెళ్ళే సందర్భంలో మాపై వుండే నిఘాను తప్పించుకోగలిగేవాణ్ణి. ఆ రోజుల్లో మాపై నిఘా వేయడానికి ఏర్పాటయిన రహస్యశాఖ వాళ్ళెలా వుండేవారో మీకు తెలుసనుకుంటా. ఎక్కడికన్నా వెళ్ళదలచుకుంటే వాళ్ళకే డబ్బిచ్చి రైలుటిక్కెట్ తెచ్చిపెట్టమని చెప్పేవాళ్ళం. స్టేషన్‌లో టికెట్ కలెక్టర్లవెంటా, యితరుల వెంటా పడిమా గమ్యం గురించి ఆరా తీయాల్సినబాధ వాళ్ళకు తప్పిపోయేది. అందుకని వాళ్లు మా కలాంటి చిన్న చిన్న పనులు చేసి పెడ్తూవుండేవాళ్లు.

ముగ్గురమూ మా బసనుండి బయలుదేరాం. వాళ్లు దారిలో కన్పించి సలాంకొట్టేసి, పాలకోసం వెడుతున్నారా అని పరామర్శించారు. తలఊపి దారిపట్టాం. మూలమలుపు తిరిగాక, నళినిని వెళ్ళిపొమ్మని చెప్పాను. వీలైనంత త్వరలో బొంబాయి విడిచివెళ్ళమని కూడా హెచ్చరించాను.

మూడు, నాలుగురోజుల తరువాత పోలీసులు నాకడకొచ్చారు. కొత్తవాళ్లెవరైనావచ్చారాఅని అడిగారు. నళిని ఫోటో చూపెట్టారు. నేనా ఫోటోను గుర్తించలేదు. అయితే ఎవరో ఒకరు వచ్చిపోతూనే వుంటారన్నాను. ఆ మాటకొస్తే మా యింటికి చాలా మంది వస్తుంటారన్నాను. నళినీ బొంబాయి వస్తున్నట్లు, అదీ నన్ను కల్సుకోవడానికే వస్తున్నట్లు తమకు సమాచారం అందిందని వాళ్ళు చెప్పారు. మూడు నాలుగు రోజుల క్రితం ఒక కొత్త వ్యక్తి యెవరో నన్ను కల్సుకోవడానికి వచ్చినట్లు మఫ్టీలు సమాచారం యిచ్చినట్లు గూడా వాళ్ళు చెప్పారు.

నళినివెంట పోలీసులు

జరిగిన సంగతి అంతా వాళ్ళకు తెలిసిపోయిందని నాకు అర్థమైంది. నాకే తెలియనట్లే నటించాను. సాధారణ ధోరణిలోనే వాళ్లతో మాట్లాడాను. ఈ వ్యక్తి బొంబాయిలోనే వుంటున్నాడా అని గూడావాళ్లు ప్రశ్నించారు. నాకేమీ తెలియనట్లు నటించాను. అయితే వెంటనే అతను దేశం విడిచివెళ్ళి [illegible]. నళిని ఆచూకీ దొరకలేదు. అతను మద్రాసు వెళ్లి అక్కడి నుండి కలకత్తా వెళ్లిపోయాడు. కొద్దిమాసాల తరువాత అతనక్కడే పోలీసులకు చిక్కాడు.

అతనెలా అరెస్టయ్యాడు? నా పేర వ్రాసిన లేఖల మూలంగా శ్రీ ముజఫర్ అహ్మద్‌గూడా యిటీవల [illegible] ఆయన చెబుతున్నారు. ఆష్లే బొంబాయి రాక గురించి [illegible] నేనే అని ఆయన అంటున్నారు. అయితే, నేను తన పేర క్రింద వున్న [illegible] అని ఆయన చెప్పేదంతా [illegible]న్నాడు. నళిని నా చేతినుండి సురక్షితంగా వెళ్ళిపోయాడు. అయితే కలకత్తా చేరాక అతనెలా పట్టుబడిపోయాడు? అతణ్ణెవరు పట్టించారు? ఈ ప్రశ్నలకు శ్రీ ముజఫర్ వ్యాసంలో సమాధానం లభించదు.

చార్లెస్ ఆష్లే రాకగురించిన విషయం చెబుతాను. భారత దేశంలోని కమ్యూనిస్టులను కలుసుకొని అంతర్జాతీయ కమ్యూనిస్టు మహాసభకు భారత ప్రతినిధి వర్గాన్ని రప్పించే యేర్పాటుచేయడానికి ఆయనను పంపారు. ఆష్లే విదేశాలలో ముక్కూమొహం తెలియని అనామక వ్యక్తికాదు. ఆయన చాలారోజులుగా కమ్యూనిస్టు ఉద్యమంలో పాల్గొంటున్నాడు. ఆయన రచయిత గూడా: సమ్మె పోరాటాలనిర్వహణలో ఆయనకు అమెరికాలో జైలుశిక్ష కూడా పడింది. అయితే, ఆంగ్లేయుడుగాబట్టి, సులభంగా భారతదేశానికిచేరుకోగలడనీ, మాతో సంబంధా లేర్పాటుచేసుకోగలడనీ ఆశించారు. బొంబాయిచేరేసరికి, అతను వస్తున్న ఓడను పోలీసులు సోదా చేశారు. వెంటనే అతణ్ణి తిరిగి పోవలసిందిగా ఉత్తర్వు జారీచేశారు. ఇది 1922 సెప్టెంబర్ 19 వ జరిగింది.

అతణ్ణి బొంబాయిలో జైల్‌కుగానీ, లాకప్‌కుగాని పంపలేదు. తాజ్‌మహల్ హోటల్‌లో అతణ్ణిగట్టికసడీలోవుంచారని శ్రీ ముజఫర్ చెబుతున్నారు. ఆహోటల్‌లో పోలీసుకస్టడీకి ఏర్పాటే లేదనే విషయం శ్రీ ముజఫర్‌కు తెలిసివుండాలి. పోలీసులు ఆష్లేని కస్టడీలోకి తీసుకొన్నారు. తిరుగుజాత అందేవరకు ఆ హోటల్‌లోనే వుండాల్సిందిగా అతణ్ణి ఆదేశించారు. అతని రాకపోకలను పసిగట్టేటందుకు సాదా దుస్తుల్లోవున్న ఒక గూఢచారిని మాత్రం అక్కడ వుంచారు.

ఆష్లే రాక గురించి నాకు ముందుగానే తెలుసునని ముజఫర్ అంటున్నారు. నా కా విషయం బొత్తిగాతెలియదు. అయినా, ఆయన యీ ఆరోపణ యెందుకని చేస్తున్నట్లు?

ఆష్లే తనను కలుసుకోవడానికి వస్తున్నట్లు తనకు ముందుగానే తెలుసునంటారాయన. అలాంటప్పుడు, ఆ సమాచారమే బైటపడి ఆష్లేపట్టివేత జరిగివుండటం సంభవం కదా? వాస్తవమేమంటే ఆష్లే ప్రసిద్ధుడైన వ్యక్తి. అందువలనే అతనిరాక వెల్లడై వుండాలి. శ్రీ యం. యన్. రాయ్ నిర్లక్ష్యం కూడా కారణం కావచ్చు. ఇలాంటి విషయాల గురించి, ఆయన అయినవారికీ, కానివారికీ నిర్లక్ష్యంగా లేఖలు రాస్తుండేవారు. శ్రీ రాయ్ నిర్లక్ష్యం గురించి మరో సందర్భంలో [illegible] చెప్తాను.

ముజఫర్ మాటల్లో ద్వంద్వార్థాలు

అధికారుల మెప్పుపొందాలనే ఆదుర్దాకొద్దీ, పోలీసుల సహాయంతోనే నేను ఆష్లేను తాజ్‌హోటల్లో కలుసుకున్నారనే వరకూ ముజఫర్ వెళ్ళారు. ఆష్లేను కలుసుకున్నట్లు నేనే ఆయనతో జైలులో వుండగా చెప్పాను.

ఆష్లేను నేనుకల్సుకొన్నమాటనిజం. అయితే తాజ్‌లో కాదు, ఒక బేరర్‌ను లోబర్చుకొని ఆష్లే దొడ్డిగుమ్మంగుండా హోటలు బైట కొచ్చాడు. అక్కన్నుంచి బొంబాయి క్రానికల్ పత్రిక కార్యాలయానికి వెళ్ళి నన్ను చూడాలనుకుంటున్నానని, పిలిపించమని అక్కడి వాళ్ళను కోరాడు.

సంపాదకుడు నన్ను చూడగోరుతున్నట్లు వాళ్లు ఒక జవాను చేత నాకు కబురంపారు. కార్యాలయానికి వచ్చి బ్రహ్మ అనే ఆయన గదికి వెళ్ళాను. బ్రహ్మ ఆ రోజుల్లో సహాయ సంపాదకుడుగా పని చేసేవాడు. అభ్యుదయభావాలు గల వ్యక్తి. అతను లోట్వాలాకు, నా యితర మిత్రులకీ పరిచయుడు. క్రానికల్ పత్రికద్వారానే బ్రహ్మ పేరు ఆష్లేకి పరిచయమై వుంటుంది.

అంతర్జాతీయ కమ్యూనిస్టు మహాసభకు భారత ప్రతినిధి వర్గాన్ని పంపడం గురించి చర్చించుకొన్నాం. ఇక్కడి సాధక బాధకాల గురించి నేను ఆష్లేకు చెప్పాను. సరైన రహస్య యంత్రాంగం లేకపోవడం మా ఇద్దరిముందున్న ప్రధాన విషయమని చెప్పాను. సరైన నిర్మాణాన్ని యేర్పాటు చేయడంలో శ్రీ రాయ్ యెలా విఫలమౌతూ వచ్చారో కూడా ఆయనకు వివరించక తప్పలేదు. ఆష్లే తెచ్చిన సమాచారాన్ని తత్సంబంధమైన మిగతా వారికి అందజేస్తానని చెప్పాను.

మరికొంత కాలానికి శ్రీ యం. యన్. రాయ్, మాస్కో ద్వారా నాతో రహస్య సంబంధాలు యేర్పాటు చేసుకోవడానికి కొందరు వ్యక్తుల్ని పంపుతున్నారని. నా పేరున గూడా ఎవరో ఒకరు రానున్నారని పత్రికల్లో [illegible]. [illegible] ఒక లేఖ వ్రాశాను. ఆష్లేతో నా సమావేశం గురించి ఆ లేఖలో ప్రస్తావించాను. [illegible] అయితే ఆష్లేతో నా సమావేశం జరిగిన [illegible] గురించి మాత్రం [illegible] శ్రీ బ్రహ్మ, క్రానికల్ కార్యాలయం, వారూ యిబ్బందుల పాలవుతారని భావించాను.

పత్రికల్లో యీ లేఖ వ్రాయాల్సిన అవసరం యెందుకు కల్గిందో చెబుతాను. శ్రీ లోట్వాలాకు ఆష్లేతోనా సమావేశం గురించి తెలిసింది.బహుశా శ్రీ బ్రహ్మ ద్వారానే ఆ విషయం ఆయనకు తెలిసి వుండవచ్చు. అంతేకాదు భారత ప్రతినిధుల ప్రయాణం కోసం ఆష్లే నాకు కొంత డబ్బిచ్చాడు. ఈ డబ్బును లోట్వాలా మేనేజర్‌ద్వారా మార్పించుకున్నాను. శ్రీ లోట్వాలా భయపడ్డాడు. తన భద్రత కోసమైనా యీ లేఖ వ్రాయమనీ, యిందులో కుట్ర యేమీ లేదని ప్రకటించమని ఆయన పట్టుబట్టారు. ఆయన కోర్కెను మన్నించక తప్పలేదు.

శ్రీ ముజఫర్ అహ్మద్ కథనం బట్టి ఆయన మాస్కో వెళ్ళడానికి సిద్ధపడినట్లు కన్పిస్తుంది. ఇందుకాయన యెలా యేర్పాటు చేసుకొన్నారో నాకేమీ తెలియదు. దురదృష్టవశాత్తు, కలకత్తావీధుల్లో వెళ్తుండగా ఆయనను పిచ్చికుక్క కరిచింది. పాపం ఆయన మాస్కోయాత్ర మానుకొని చికిత్స కోసం కసౌలీ వెళ్ళిపోయారు. తన మాస్కో ప్రయాణ పథకాన్ని తలక్రిందులు చేసేటందుకు ఆ పిచ్చికుక్కను కూడా నేనే పంపానని ఆయన ఆరోపించలేదు; అంతవరకు అదైనా కొంతమేలే. నాపట్లద్వేషం ఆయనలో జీర్ణించుకొని పోయినట్లు కన్పిస్తుంది.

అంతర్జాతీయ ఖ్యాతిని పొందే ప్రథమ తరుణంలోనే, నిస్పృహకు గురైన వ్యక్తిలో యితరుల పట్ల అలాంటి ద్వేషం ప్రజ్వరిల్లడం సహజమే ననిపిస్తుంది.

ప్రతివారినీ అనుమానించడం, వారి పట్ల ద్వేషం పెంచుకోవడం, శ్రీ ముజఫర్‌లోని ప్రత్యేకత. ఎదుటి వ్యక్తి ప్రతివాణ్ణీ, పోలీసు గూఢచారేనని ఆయన అనుమానించేవారు. అది నిజం కాదని నిర్ధారణ అయ్యేవరకు ఆయన అనుమానం వదిలేది కాదు.

ముజఫర్ అహ్మద్ మనస్తత్వం

వ్యక్తుల్ని నిరసించడం, కించపరచడం ఆయనకు సరదా. ట్రేడ్‌యూనియన్ల గురించి గూడా ఆయన ధోరణి అదే. "భారతదేశంలోని ట్రేడ్‌యూనియన్లలో నూటికి 90 వరకు, అన్నీ గవర్నమెంటు సంఘాలే" అని ఆయన ఒకసారి యం. యన్. రాయ్‌కి వ్రాశారు. పాపం! అందుకనే ఆయన ఏనాడు కార్మిక నాయకుడు కాలేకపోయారు.

రాయ్‌తో జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలోనూ ఆయన రెండు అంశాలు పదే పదే నొక్కి చెబుతుండేవారు. ఒకటి, రాయ్ సంబంధాలేర్పాటు చేసుకోగోరుతున్న ప్రతి వ్యక్తికీ ఆయన పోలీసుల మనిషే అని ఆయన ముద్రవేసేవారు. రెండో విషయం, డబ్బులేదనీ, అందుకనే పని జరగడంలేదని ఆయన రాస్తుండేవారు తనచుట్టుపట్ల ప్రపంచం పట్ల, అందులోని వ్యక్తులపట్లా, ఆయన ఎంతటిద్వేషాన్ని పెంచుకున్నారో, శ్రీభూపేన్ దత్తా గురించి ఆయన వ్రాసిన జుగుప్సాకరమైన నీచమైన వ్రాతలు చూస్తే బోధపడుతుంది.

శ్రీ ముజఫర్ మనస్తత్వం నాకు సుపరిచితమే. అయితే, ఆయన యింతటి తక్కువ స్థాయికి దిగజారిపోతారని నేను అనుకోలేదు. ఆష్లే, నళినివంటివారి సందర్భాలలో జరిగిన అన్ని అవాంతరాలకూ, ఆకస్మిక ఘటనలకూ నన్నే బాధ్యుడిగా యెంచే స్థితికి నాడు ఆయన వెళ్లారు. పార్టీలో ఆయనకున్న గౌరవ ప్రతిష్ఠలనూ, ఆయన వృద్ధాప్యాన్నీ, ఆయన తత్వంలోని బలహీనతలనూ ఒంటెత్తు ధోరణి కలిగిన విచ్ఛిన్నకులు తమ దుష్టఆశయాలను సఫలం చేసుకోవడానికి వినియోగించుకొంటున్నారు. పార్టీని బద్దలుకొట్టేందుకు నాపైన అతిపిరికితనంతో నీచారోపణలు చేస్తున్నారు.

వారి నిజఉద్దేశం యిది కానట్లయితే, వారు నిజాన్నే తెలుసుకొనిగోరి వుండినట్లయితే, మన దేశంలోని అనేకమందితో శ్రీ రాయ్ జరిపిన ఉత్తరప్రత్యుత్తరాల ద్వారానే, ఆ పుత్తరాలను పట్టివేయడం ద్వారానే కావలసినంత సమాచారం సేకరించుకో గలిగివుంటారని వారికి విదితమై వుండేది. ఇందుకు అవసరమైనన్ని సాక్ష్యాధారాలు జాతీయ పత్రాలభాండాగారంలోనే లభించి వుండేవి.

శ్రీ ముజఫర్ ఈ సందర్భంలో బొంబాయి పోలీస్ శాఖకు సంబంధించిన స్టీవార్ట్ అనే డిప్యూటీ కమిషనర్‌ను గూడా ఉదహరిస్తున్నారు. స్టీవార్టు వ్రాతలను సందర్భ శుద్ధి లేకుండా ఉదహరిస్తున్నారు. "చాలా జాగ్రత్తగా కాపుకాసినప్పటికీ, శ్రీ డాంగే మనకు అవసరమైన సమాచార సేకరణకు వీలుపడలేదు" అని డాంగేపట్ల [illegible] స్టీవార్టు వ్రాసిన వ్యాఖ్యలను [illegible] న్నారు. వారికి నా ఉపయోగం యేమిటి? భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమానికి నేను [illegible]. కాబట్టి శ్రీ రాయ్ తరచు నాకు ఉత్తరాలు వ్రాస్తుండేవాడు. ఆ ఉత్తరాలను మధ్యలో పట్టివేయడం ద్వారా తమకు [illegible] సమాచారం [illegible] అని [illegible].

నన్ను [illegible] సంవత్సరాల [illegible] గురించి [illegible] 1923 జూన్ 11 వ తేదీన బొంబాయి ప్రభుత్వం పంపిన ఒక లేఖలో యీ క్రింది విధంగా వుంది:

"డాంగేకు మద్రాసు, ఉత్తరప్రదేశ్, పంజాబ్ ప్రాంతాలలోని కమ్యూనిస్టులతో సన్నిహిత సంబంధాలున్నవి. మద్రాసులో సింగారవేలు అనే అతను ప్రారంభించిన హిందుస్తాన్ కార్మిక రైతు పార్టీలో చేరడానికి వాగ్దానం చేశాడు.

"యం. యన్. రాయ్‌తో క్రమబద్ధంగా ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేందుకు అతను ప్రయత్నించాడు. అయితే, అతని ఉత్తర ప్రత్యుత్తరాలపై యేర్పాటుచేసిన గట్టి నిఘా కారణంగా అతని కృషిపూర్తిగా సఫలం కాలేదు. రాయ్ మాస్కో నుంచి వ్రాసిన 22-9-22 లేఖ, బెర్లిన్ నుండి వ్రాసిన 12-12-22 లేఖ జూరిచ్ నుండి వ్రాసిన 4-12-22 లేఖ తిరిగి బెర్లిన్‌నుండి వ్రాసిన 25-2-12: 23-3-22 లేఖలు పట్టి వేయడం జరిగింది.

"సోషలిస్టు పత్రికను ప్రచురిస్తున్నందుకు రాయ్, డాంగేను ఈలేఖల్లో అభినందించారు. ఆష్లేయూరప్‌నుండి తెస్తున్న పత్రాల గురించి హెచ్చరించారు. బెర్లిన్‌లో జరిగే కమ్యూనిస్టు మహాసభకు రావలసిందిగా ఆహ్వానించారు. మరికొన్ని తాజా లేఖల్లో ప్రయాణ ఖర్చులకోసం డబ్బు పంపే ఏర్పాట్లు గురించి, సోషలిస్టు పత్రికల్లో కొన్ని వ్యాసాలను ప్రచురించేవిషయం గురించి రాయ్ ప్రస్తావించారు.

అభాండాల సృష్టి

ప్రభుత్వానికి సమాచారం ఏలా లభ్యమవుతున్నదీ, ఆష్లే రాక గురించి ముందుగానే ఎలా తెలిసిందీ, బొంబాయి ప్రభుత్వం వ్రాసిన యీ లేఖను చూస్తే స్పష్టంగా అర్థమౌతుంది.

అయినా, పార్టీని విచ్ఛిన్నంచేయడమే తమ పనిగా పెట్టుకొన్న శ్రీ ముజఫర్, ఆయన సహచరులు నాపై ఏలాంటి అభాండాలను సృష్టించడానికైనా సరే సిద్ధపడుతున్నారు. వీళ్లెంత దిగజారిపోయారో చూడండి! అయితే యిందులో ఒక సుగుణం వుంది, వీరి అబద్ధాలను యిట్టే పట్టివేయవచ్చు. కల్పిత లేఖల గురించిన విషయం వచ్చినప్పుడీ విషయం మరోసారి ప్రస్తావిస్తాను. వీరి వుద్దేశాలగురించీ, తర్కంగురించీ, వారి నిర్మాణ యంత్రాంగం గురించి ఆ సందర్భంలోనే చెబుతాను.

ప్రపంచ మహాసభకు వెళ్ళలేకపోయాను. భారత వ్యవహారాల గురించి, అప్పుడప్పుడు రాయ్ లేఖల ద్వారా బోధపడినదానికిమించి, కమ్యూనిస్టుఅంతర్జాతీయసంస్థ యోచనయేమో నాకు పూర్తిగా అవగతం కాలేదు. అంతర్జాతీయ కమ్యూనిస్టు సంస్థ విధానాలను నేను అర్థంచేసుకొన్న పరిధిలో, నాకు తోచిన విధంగా నా పనిని కొనసాగించాను. బొంబాయి కాంగ్రెస్‌లో బలం చేకూర్చుకున్నాం. ట్రేడ్‌యూనియన్ పని ప్రారంభించాం. మా శాయశక్తులా సోషలిస్టు సాహిత్యాన్ని ప్రచారంలో పెట్టాం. పార్టీనిర్మాణానికి సన్నాహాలు చేశాం.

కోర్టులో దాఖలు చేయబడిన పత్రాలను బట్టి రాయ్, సి. ఆర్. దాస్ మొదలైనవారితో యేదో రకమైన సఖ్యతకోసం ప్రయత్నిస్తూ వుండినట్లు బోధపడుతుంది. సరిగా గయా కాంగ్రెస్ మహాసభకు ముందు బ్రిటిష్ ప్రభుత్వం, శ్రీ రాయ్ కార్యక్రమాన్నంతటినీ బహిర్గతం చేసింది. చాలామంది నాయకులు బెదిరిపోయారు.

గయా కాంగ్రెసు

ఇతర ప్రాంతాలలోని కమ్యూనిస్టు గ్రూపులతో సంబంధాలనేర్పాటు చేసుకొని నేనుకూడా గయా వెళ్ళాను. అంతర్జాతీయ కమ్యూనిస్టు కేంద్రం యీ బాధ్యతను నిర్వర్తించమనీ, యీ కార్యకలాపాలన్నింటిని బొంబాయినే కేంద్రంగా చేసుకోమనీ శ్రీ రాయ్ ద్వారా నన్ను ఆదేశించింది.

బొంబాయిలో మా గ్రూపు చాలా చురుకుగా పనిచేస్తూవుంది. పత్రికల ద్వారా ప్రచురణల ద్వారా ముమ్మరంగా ప్రచారం సాగిస్తూ వుంది. ట్రేడ్ యూనియన్లలో పనిచేస్తున్నాం. డేరా-అన్-సోన్ అనేచోట మేము రహస్యంగా సమావేశమయినాము. శ్రీ ముజఫర్ యీ సమావేశం గురించి ప్రస్తావించారు. నిజానికి ఆయనకు ఆ సమావేశాన్ని గురించి ఏమీ తెలియదు. [illegible]లోగాని, రంగంలోగాని లేరు.

సుభాస్ బాబుతో చర్చలు

గయా మహాసభలో రాజగోపాలాచారి ఆయన నో-ఛేంజ్ అనుచరులు సి. ఆర్. దాసును ఓడించారు. సుభాస్‌బోస్ నాయకత్వాన [illegible] ప్రయత్నం చేశారు.

ఈ సందర్భంలోనే బోస్ నన్ను కలుసుకోవడానికి బొంబాయి వచ్చారు. [illegible] కాంగ్రెసులో [illegible] పాత్ర [illegible] కొమింటర్న్‌తో సంబంధాలు [illegible] ఆయన నాతో చర్చించారు. ఆర్. యన్. [illegible] ఒక చిన్న రహస్య సమా[illegible]

[illegible]

ఆ తరువాత బ్రిటిష్ ప్రభుత్వం, కాంగ్రెస్‌లోనూ, వెలుపలగూడా వున్న అభ్యుదయవాదులపై దాడిచేసింది. శ్రీ దాసుతో సహా బెంగాల్‌లో చాలా మందిని అరెస్టు చేసింది.

కాన్పూరు కుట్రకేసు

బ్రిటిష్ ప్రభుత్వం బోల్షివిక్ కుట్రకేసు ప్రారంభించ తలపెట్టింది. మూరో సల్దుర్ని అరెస్టుచేసి కాన్పూర్ తెచ్చారు. కొమింటర్న్‌తో కుట్రపన్ని రైతు కార్మికుల హింసాత్మక విప్లవం ద్వారా బ్రిటిష్ ప్రభుత్వాన్ని [illegible] కూలద్రోయ ప్రయత్నించారని ఆరోపించి విచారణ జరిపారు. మాకు 4 సంగరాల శిక్షవిధించారు. చౌరీ చౌరా కేసులో రైతాంగాన్ని విచారించి, అనేకమందికి ఉరిశిక్షలు వేసిన జడ్జీనే మమ్ములను విచారించాడు.

కాన్పూరు జైలుకు తేబడిన మొట్టమొదటి వాణ్ణి నేనే. ఆ తరువాత ఉస్మాన్ వచ్చారు. ఆ తరువాత నళినిగుప్తా, ముజఫర్ అహ్మద్ వచ్చారు.

మిగతా ముగ్గురూ అంతకు ముందు నుండే డిటెన్షన్‌లో వున్నారు.

నా బహిరంగమైన అరెస్ట్‌కు పుత్తరాలు వ్రాయడంవల్ల కల్గిన యిబ్బందులను గురించి నేను ఉస్మానీకి చెప్పాను. నళినిగుప్తా, ముజఫర్ అహ్మద్ మూగనోము పట్టి కూర్చుంటూ వుండేవారు. వారలా ఎందుకుంటున్నారో నాకు బోధపడలేదు. వాళ్ళనే ఆ విషయం అడిగాను. నన్ను "అప్రూవర్"గా మారుస్తున్నారనో, అలాంటిదే మరేదో అనుమానం ముజఫర్‌కు కలిగిందట! తన యీ స్వభావ సిద్ధమైన అనుమానాన్నే ఆయన నళిని బుర్రలోకికూడా జొప్పించారు. అయితే, మరికొద్ది కాలానికే యీ అనుమానాలు నివృత్తి అయినాయి.

విచారణ సందర్భంలో నళిని ఫోటోగ్రాఫును, ముజఫర్ హస్తాక్షరాలను (ఆయన యం. ఏ. అని వ్రాసేవారు) గుర్తించ నిరాకరించాను.

జడ్జి వ్యాఖ్యలు

ఈ విషయం సెషన్సు జడ్జి యిలా వ్యాఖ్యానించాడు:

"కొన్ని అంశాలు నిందితుని (డాంగే) నేరాన్ని నిస్సంశయంగా రుజువుచేస్తున్నాయి. రాయ్ కార్యక్రమాలు తనకు నచ్చలేదని ఆష్లేకు చెప్పినట్లు డాంగే యిచ్చిన వాఙ్మూలం తప్పు ఈ ఎం. ఏ. అనే పొడి అక్షరాలెవరివో తెలియదనికమిటల్ కోర్టుముందునిందితుడిచ్చిన వాఙ్మూలంకూడా అబద్ధమే డాంగే ఈ కుట్రలో భాగస్వామి. అందుకని యీ వ్యక్తి యెవరో అతనికి తప్పకుండా తెలిసివుంటుంది. తనతోటి కుట్రదారుణ్ని మరుగు పరిచే వుద్దేశం లేకపోతే నిందితుడు నిజంచెప్పివుండేవాడు. కమిటల్ కోర్టుముందు నళిని గుప్తా తనను కలుసుకున్న విషయమూ అతని ఫోటో తనకు చూపబడిన విషయమూ నిందితుడు నిరాకరించాడు. హబీబ్‌కు యితను ఒకలేఖవ్రాసి లోపల "తాయక్"కు (ఉస్మానీ మారుపేరు) అందజేయమని కోరాడు.

"రాయ్‌తో తాను విభేదిస్తున్నానని అతను చెప్పడం నటన మాత్రమే. పోలీసులనూ, ప్రభుత్వాన్ని మోసగించడానికే నిందితుడిలా చేశాడు."

రాజకీయంగా నా వైఖరి

మరెవర్నీ యిరుకున పెట్టకుండా ఆ కేసు సందర్భంలో నేనొక రాజకీయ ప్రకటన చేశాను. దేశప్రజలు అంతా మా కేసు విషయమై చాలా ఆసక్తితో వున్నారు. పత్రికలు గూడా మా కేసుకు సంబంధించిన విషయాలు ప్రముఖంగా ప్రచురిస్తున్నవి. మీరట్ కేసు సందర్భంలో కంటే యీ సారి నేను యిచ్చిన వాఙ్మూలం చాలా క్లుప్తమైనదే. అయితే యిందులో నా రాజకీయవైఖరిని వివరించాను. రాజకీయంగాగానీ, చట్టరీత్యాగానీ, సమర్థించ దానికి వీల్లేని పద్ధతిలో ముజఫర్ అహ్మద్ మిగతావారూ యేలాంటి ప్రకటనా చేయకుండా గమ్మున ఊరకుండిపోయారు.

వారికిది సహజమే కావచ్చు, ఎందుకంటే వారికి రహస్యమైన కుట్ర స్వభావం కలిగిన కార్యకలాపాలతో మాత్రమే సంబంధం వుంది. ఉస్మానీకి తాష్కెంట్ రంగంలో విప్లవప్రతీఘాతకులతో పోరాడిన కొంత చరిత్ర అయినా వుంది ముజఫర్ అహ్మద్, నళినీలు రహస్యపత్రాలు సృష్టించడమే తమ పనిగా పెట్టుకున్నారు. వారు పత్రాలలోని కార్యక్రమాన్ని ఏనాడూ అమలు జరిపిన పాపానపోలేదు, అందుకనే వారు గమ్మున ఊరుకున్నారు.

నా పాత్ర యింతకు పూర్తి భిన్నం. ప్రజలనూ, కార్మిక సంఘాలనూ దృష్టిలోవుంచుకొని నేను పనిచేశాను. రాజకీయ పరిస్థితి గురించి నేను వారి కేదో కొంత చెప్పలేదా? అందుకనే నేను వారికి భిన్నమైన పంథా అనుసరించాను. [illegible] మార్గానపడిన వారు నా ప్రకటనను అపార్థాలు కల్పిస్తూ ఆరోపణలు చేస్తున్నారు. అనాటి కేసుకు సంబంధించిన రాజకీయ పూర్వరంగాన్ని [illegible] నిరాకరించడమే చాలా మంచిదని [illegible] చెప్పుకుంటున్నారు. తమ మనో దౌర్బల్యాన్ని, పిరికి తనాన్ని కప్పిపుచ్చుకుంటున్నారు.

(స్వాధీన్ మే 17. మిగతా భాగం స్వాధీన్ 21 సంచికలో వెలువడుతుంది.)

దక్షిణ వియత్నాంకు అమెరికా సహాయం

మరో 125 మిలియన్ల డాలర్లకు అధ్యక్షుడు జాన్సన్ అభ్యర్థన

వాషింగ్టన్, మే 18

దక్షిణ వియత్నాంకు అమెరికా సైనిక, ఆర్థిక సహాయం క్రింద మరో 125 మిలియన్ల డాలర్లను మంజూరు చేయవలసినదిగా అమెరికా అధ్యక్షుడు జాన్సన్ అమెరికా కాంగ్రెసును కోరాడు.

దక్షిణ వియత్నాం స్వాతంత్ర్యాన్ని అంతవరకు అందిస్తామని ప్రభుత్వం ముందు అమెరికా వాగ్దానం చేసిందని, అందుకనే ఈ నూతన సహాయం కేటాయింపును ఆమోదించవలసిందిగా అధ్యక్షుడు అమెరికా కాంగ్రెసును కోరాడని వైట్‌హౌస్ విడుదల చేసిన ఒక ప్రత్యేక ప్రకటనలో పేర్కొన్నది.

ఈసమ్వత్సర కాలంలో దక్షిణ వియత్నాంకు అమెరికా చేస్తున్న సహాయం ప్రతి యేటా ఐదువందల మిలియన్ల డాలర్లకు చేరుకుంది. ఇది కాకనే అదనంగా మరో 125 మిలియన్ల డాలర్ల సహాయానికి అంగీకరించాలని అధ్యక్షుడు అమెరికా కాంగ్రెసును కోరుతున్నాడు.

బ్రెజిల్‌కు అమెరికా ఆర్థిక సహాయం

తిరిగి కొనసాగిస్తున్నట్లు ప్రకటన

వాషింగ్టన్, మే 18

తొమ్మిదికోట్ల మున్నైలక్షల డాలర్ల విలువగలవివిధరకాలఆహారపదార్థాలనుసరఫరా చేయటంద్వారా బ్రెజిల్‌కు ఆర్థికసహాయం చేయటానికి నిశ్చయించినట్లు అమెరికా ప్రభుత్వం ప్రకటించింది.

గౌలార్టు అధికారంలో ఉండగా ఉభయ దేశాలకు మధ్య ఒడంబడిక కుదరనందున అమెరికా సహాయం ఆపివేసింది. గౌలార్టు ప్రభుత్వాన్ని యీ సంవత్సరం ఏప్రిల్‌లో జరిగిన తిరుగుబాటులో పడగొట్టారు.

దక్షిణరైల్వేఎంప్లాయీస్ యూనియన్ గుర్తింపు

విజయవాడ బ్రాంచి అభ్యర్థన

విజయవాడ, మే 18

డివిజనల్ స్టాఫ్‌కౌన్సిలు ఎన్నికలలో దక్షిణ రైల్వే ఎంప్లాయీస్‌యూనియన్‌కు వచ్చిన మెజారిటీదృష్ట్యా యూనియన్‌ను వెంటనేగుర్తించాలని దక్షిణరైల్వే ఎంప్లాయీస్ యూనియన్ విజయవాడ ఓపెన్‌లైన్ బ్రాంచికమిటీ సమావేశంలో తీర్మానించారు. విజయవాడలో శ్రీ డి. బాలకోటయ్యగారి అధ్యక్షతను 10వ తేదీన ఈ సమావేశం జరిగింది.

ఈ క్రిందితీర్మానములు ఆమోదించబడినవి.

కేంద్ర ప్రభుత్వోద్యోగులకు పెంచిన కరువు భత్యము తగినంతగాలేదు. కనుక జీవనవ్యయ సూచిక పెరుగుదల మేరకు కరువుభత్యము పెంచవలెను.

బోనసు కమిటీ నివేదికను వెంటనే ఆమోదించి, రైల్వే ఉద్యోగులకుకూడా బోనసు స్కీము వర్తింప చేయవలెను.

రైల్వే ఉద్యోగులకు ధాన్యం షాపులు పెట్టవలెను.

విజయవాడ డివిజన్‌లో పనిచేయుచున్న పాయింట్‌మెన్‌లకు రు 105-135 మరియు రు 80-110 స్కేలులో జీతములు యివ్వవలెను.

గుడివాడ, సత్యనారాయణపురము స్టేషన్ల మధ్య గూడ్సుబళ్ళ ట్రాఫిక్ విపరీతముగా పెరిగినందువలన యిచ్చట పనిచేయు ట్రాఫిక్ పనివారలకు రోజుకు 8 గం॥ డ్యూటీ మాత్రమే యివ్వవలెను.

6 నెలలు పైబడి పనిచేసే ఇ. యల్. ఆర్. కార్మికులందరకు ఆథరైజ్ పేస్కేల్సు యివ్వవలెను.

గ్యాంగ్‌మెన్ సెలక్షనుకు పాత ఎ. యల్. సి. పద్ధతిని తిరిగి ప్రవేశ పెట్ట వలెను.

రైల్వే పోరంబోకులను సాగు చేసుకుంటున్న రైల్వే పనివారలయొద్ద కౌలు వసూలు చేయరాదు.

గుడివాడ సెక్షనులో గ్యాంగ్‌మేస్త్రీ, కీమెన్ ఖాళీలను వెంటనే భర్తీ చేయవలెను.

పోటీలేని పంచాయతీలకు ప్రభుత్వ బహుమానం

ముఖ్యమంత్రి ప్రకటన

హైదరాబాద్, మే 17

[illegible] గ్రామ పంచాయితీ ఎన్నికలు ఏకగ్రీవంగాజరిగినట్లయితే ఆ పంచాయితీకి ప్రభుత్వం రూ. 5 వేలు బహుమానం ఇస్తుందని, అదేవిధంగా అది మూడువేలజనాభా లోపుగల పంచాయితీ అయితే రు 2500/- బహుమానం ప్రభుత్వం ఇస్తుందని ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి పత్రికా విలేకరులతో మాట్లాడుతూ తెలియచేశారు.

ప్రభుత్వ అంచనా ప్రకారం 15-20 శాతం మధ్య ఏకగ్రీవంగా ఎన్నికలు జరుగుతాయని అనుకొంటున్నట్లుగా శ్రీ బ్రహ్మానంద రెడ్డి అన్నారు.

నాల్గవ ప్రణాళిక సందర్భంలో మంచినీటి సదుపాయం, ప్రాథమిక విద్యా సౌకర్యం కల్పించాలని [illegible] ఒక లేఖ వ్రాశానని ఆ లేఖను ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్షుడు శ్రీ అశోక్‌మెహతాకు ఆయన అందజేశారని శ్రీ బ్రహ్మానందరెడ్డి తెలియచేశారు.

శ్రీ మెహతా నా సూచనతో ఏకీభవించగలనని వాగ్దానం చేశారని ముఖ్యమంత్రి అన్నారు.

[illegible] 300 కుటుంబాలకు నాగార్జునసాగర్ వద్ద మరో 200 కుటుంబాలకు బెల్లంపల్లి, రామగుండం [illegible] పునరావాస సౌకర్యాలు కల్పించనున్నామని ముఖ్యమంత్రి తెలియజేశారు.

బాలికలకు స్కూలుఫైనల్ వరకు ఉచితవిద్యావకాశం హర్షనీయమే

కాని ఫస్ట్‌ఫారంలో చేరడానికి వచ్చే వేలాది పిల్లలకు సీట్లు కొరత లేకుండా ప్రభుత్వం ముందే జాగ్రత్త పడతుందా?

1964-65 సంవత్సరంనుండి బాలికలకు స్కూలు ఫైనల్ వరకు, హయ్యర్ సెకండరీ విద్యవరకు ఉచితవిద్య గరపడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిశ్చయించడం స్త్రీ విద్యాభివృద్ధికి నిస్సంశయంగా ఒక ముందడుగే. ఇందుకు ఆంధ్రప్రభుత్వాన్ని ప్రతిఒక్కరూ అభినందింపుతారు. పురుషులతో సమానంగా స్త్రీలు కూడా అభివృద్ధి చెందడానికి ఇది తప్పక తోడ్పడుతుంది. యూనివర్సిటీ విద్యవరకు స్త్రీలకు ఉచిత విద్య గరపి సమాజంలో ఇన్నాళ్లుగా స్త్రీలకు విద్యావిషయంలో జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వం తొలగించితే స్త్రీ జాతికి ఇంకా మహోపకారం చేసినట్లు అవుతుంది.

సింహళం మున్నగు దేశాలలో యూనివర్సిటీ వరకు స్త్రీలకు ఉచిత విద్యావకాశం కల్పించడంవలన ఆ దేశంలో స్త్రీలు సత్వరాభివృద్ధి పొందడానికి ఎంతో దోహదం కల్గిన విషయం విదితమే. అందుచేత మనదేశంలోను, మన రాష్ట్రంలోను అటువంటి శుభసమయం ఎప్పుడు వస్తుందా? అని స్త్రీలు సహజంగా ఎదురు చూస్తారు.

ఏది ఏమైనప్పటికీ బాలికలకు స్కూలు ఫైనల్ వరకు ఉచిత విద్యావకాశాన్ని ఆంధ్ర ప్రభుత్వం కల్పించడం నిజంగా స్త్రీ లందరకు సంతోష కారణమైన విషయం.

కాని జూన్ నెల వచ్చి స్కూళ్లు తెరిచే సమయం దగ్గరకువస్తున్న కొలదీ ఫస్టుఫారములో పిల్లలను చేర్చడం ఎల్లాగ? అన్నది ప్రతీ తల్లిదండ్రులను ఆందోళనపరుస్తూంది. అందులో యిప్పుడు బాలికలకు స్కూలు ఫైనల్ వరకు ఉచిత విద్యఅనడంతో ప్రతిబాలికను స్కూలుకు పంపడానికి తల్లిదండ్రులు కుతూహల పడతారు, ముందుకు వస్తారు.

అందుచేత గత సంవత్సరంకంటే ఈ సంవత్సరం హైస్కూలులో చేరగోరే పిల్లల సంఖ్య ముఖ్యంగా ఆడపిల్లల సంఖ్య రాష్ట్రం మొత్తంపై కొన్నివేలు లక్షలు ఎక్కువగా ఉండటంలో ఆశ్చర్యమేమీలేదు.

బాలబాలికలకందరికి ప్రస్తుతం మూడవ ఫారంవరకు ఉచిత విద్యావకాశం ఉంది. ఈ పరిమిత అవకాశం ఉన్నప్పుడే ఆంధ్రదేశంలోని ఏ పట్నంలో చూచినా ఫస్టుఫారములో సీట్లు దొరక ఎంట్రెన్సుపరీక్షలో ఉత్తీర్ణులై సీట్లులేక వేలాదిబాలబాలికలు ఎందుకూ కొరగాని స్థితిలో ఉండిపోతున్నారు. మళ్లీవారికి ట్యూషన్ పెట్టడమో లేక యిళ్లలోనే చదివించుకోవడమోజరుగుతూంది. పిల్లల విద్యాజీవితంలో ఒక సంవత్సరం కాలం వృథాగా పోవడం అంటే వారి జీవితాలకు పునాదులు నిర్మించవలసిన రోజులువృథాఅన్నమాట.

ఒక ఉదాహరణ

ఇందుకు విజయవాడ ఉదాహరణే చూద్దాం. ఆంధ్రలో రెండవ పెద్ద పట్నం విజయవాడ. ఈ పట్నంలో 8-11 ఏళ్ళ వయస్సు కల్గిన బాలబాలికలు 25 వేలమంది ఉన్నారు. కాని వారిలో 10,500 మందికి మాత్రమే విద్యావకాశాలభిస్తున్నాయి. మిగిలిన దాదాపు 15 వేల మంది చదువుకోలేని స్థితిలో ఉండిపోతున్నారు. వచ్చే జూన్ నెలలో విజయవాడలో 4 వేల మంది బాలబాలికలు మొదటి ఫారంలో చేరవలసి ఉంది. ప్రైవేటు ఉపాధ్యాయుల వద్ద చదువుకొని ఫస్ట్ ఫారంలో చేరడానికి మరో 1400 మంది సిద్ధంగా ఉన్నారు, హయ్యర్ ఎలిమెంటరీ స్కూళ్ళలో మరో 600 మంది పిల్లలున్నారు.

విజయవాడలో ఉన్న పది ఉన్నత పాఠశాలలూ ఏమాత్రం సరిపోవు. ఈ వివరాలు ఇటీవల తెలియ జేసింది ఎవరోకాదు, ఆ జిల్లా విద్యాశాఖాధికారి!

జూన్‌నెలలో స్కూళ్లు తెరిచే తెరవగానే సీట్లకొరకు హైస్కూళ్లచుట్టూ పడిగాపులుపడే తల్లిదండ్రులు ఒకవైపు, రికమండేషన్లు ప్రాధేయపడటాలు ఒకవైపు ఫస్టుఫారంసీటు లభించితే ఎం. బి. బి. ఎస్ సీటు లభించినంతగా తల్లిదండ్రులు ఆనంద పడిపోతూ ఉండే దృశ్యాలు కనబడతాయి.

రాష్ట్రం మొత్తంలో విద్యావకాశాల కొరత

ప్రభుత్వ సమాచారపత్రిక "ఆంధ్రప్రదేశ్" మే నెల సంచికలో 1964-65 సంవత్సరం ప్రణాళిక కార్యక్రమాలను వివరించుతూ ఇలా తెలియజేయబడింది.

"1963-64 సంవత్సరానికి రాష్ట్రంలో 1-5 తరగతులలో మొత్తం 16 లక్షలమంది పిల్లలను అదనంగా చేర్చాలని అంచనా వేసుకున్నారు. కాని 4 లక్షల 64 వేల మందిని మాత్రమే అదనంగా చేర్చుకోగలిగారు.

11-14 సంవత్సరాల వయస్సు కల్గిన పిల్లలను 2 లక్షల 53 వేలమందిని అదనంగా చేర్చాలనుకున్నారు. ఈ సంఖ్య మించిపోయేటట్లు కనబడుతూంది.

టీచర్లను 11,500 మందిని అదనంగావేయాలనుకుంటే, 9 వేల 300 మందిని మాత్రమే అదనంగా వేశారు.

ఈ అంతటను తెలియజేసే దేమిటి? 1-5 తరగతుల మధ్య 16 లక్షల మంది పిల్లలను అదనంగా చేర్చాలనుకున్నది చేర్చలేక పోయారు. 11-14 సంవత్సరాలు అంటే మాధ్యమిక విద్యాదశలో అనుకున్న సంఖ్యను మించి విద్యార్థులు స్కూళ్ళలో చేరగోరుతున్నారు.

1-5 తరగతులు చదివే వయస్సు 6-11 సంవత్సరాల మధ్య పిల్లలు రావలసినంత మంది స్కూళ్ళకు రావడంలేదు. నిర్బంధ విద్యాపథకం అమలుజరగడంలేదు. ఫస్టుఫారం క్లాసు వచ్చేసరికి ఉన్న స్కూళ్ళు, సీట్లు చాలడంలేదు. మూడింట రెండు వంతులకు కూడా మాధ్యమికదశలో స్కూళ్లు, సీట్లు అసలే సరిపోవడంలేదు.

అందుచేత రాష్ట్రప్రభుత్వం ఉచితవిద్యావకాశాలను కల్గిస్తామని ప్రకటించినంత మాత్రాన ఏమీ ప్రయోజనంలేదు. 1-5 తరగతులు చదివే వయస్సుగల పిల్లలందరూ స్కూళ్ళకు వచ్చే సాంఘిక, ఆర్థిక పరిస్థితులు కల్పించాలి. 11-14 వయస్సు మాధ్యమికవిద్యాఅవకాశాలు రెండు మూడురెట్లు హెచ్చించాలి.

ఉపాధ్యాయులు

మూడవ ఫారం వరకు ఉచిత విద్య రావటంతోనే సాధారణంగా ఆ వయస్సు గల బాలబాలికల సంఖ్య స్కూళ్ళకు రావడం హెచ్చింది పట్టణాలలో జనతా పెరిగి అంత వరకు ఉన్న సౌకర్యాలు ఏ మాత్రం చాలనిస్థితి ఏర్పడింది.

ఉపాధ్యాయుల సంఖ్యను పెంచడం బదులు ఉపాధ్యాయుల విద్యార్థుల నిష్పత్తి పెంచారు. ఒకప్పుడు 30-35 నుండి యిప్పుడు 40-45 వరకు పెంచేశారు. ఇందువలన ఉపాధ్యాయుడు వ్యక్తిగతంగా పిల్లల అభివృద్ధిని గమనించలేడు. అందువల్ల ప్రమాణాలు తగ్గిపోతున్నాయి. పైపెచ్చు పాఠ్యాంశాలు అనాటి కానాడు పెరిగిపోతున్నాయి.

కావున జూన్‌నెల వచ్చి స్కూళ్లు తెరువగానే ప్రభుత్వం ఈ సంవత్సరం స్కూలులో చేరడానికి అదనంగా వచ్చే బాలబాలిక లందరికి సీట్లు లభించేటట్లు విద్యావకాశాలు పెంచాలి, అందుకు ఇప్పటినుండి మహిళా సంస్థలు, క్లబులుఆందోళన చేయాలి. బాలికలకు స్కూలుఫైనల్‌వరకు ఉచితవిద్య అనే నూతన పరిస్థితిలో నూతన విద్యావకాశాల కోసం ఆందోళన చేయాలి.

ఇరాక్ దేశపు స్త్రీల నికృష్టజీవితపరిస్థితులు

రాచరిక నిరంకుశ పాలనలో కనీసహక్కులు కోసం వీరోచిత పోరాటం

అంతర్జాతీయ ప్రజాస్వామిక మహిళాసంఘం పత్రిక "వుమెన్ ఆఫ్ ది హోల్ వరల్డ్" ప్రత్యేక ప్రతినిధిగా డెనిస్ బ్రెటన్ ఇరాన్ దేశాన్ని సందర్శించి అక్కడి స్త్రీలు (ముస్లిమ్‌లు), ఎట్టి అధోగతిలో ఉన్నారో ఎట్టి నికృష్ట పరిస్థితులకు వ్యతిరేకంగా పోరాడుతున్నారో ఈ వ్యాసంలో వివరించారు.

"నావర్యటనలో ఇరాన్ స్త్రీలలో ఎక్కువ మంది ఇంకా బురఖాలు వేసుకొని ఘోషా అవలంబించుతున్న విషయం నేను గమనించాను, నల్లటి బురఖా లేక, ఆకుపచ్చ వస్త్రం పువ్వులు కుట్టినది, వేసుకుంటారు. ముఖమంతా కప్పబడే ఉంది, కాళ్ళవరకుజీరాడుతూ స్త్రీలకు ఇది ఒక శాపంగా పరిణమించిందని చెప్పవచ్చు. 12, 13 సంవత్సరాల బాలికలకు కూడా ఈ దురవస్థ తప్పడంలేదు.

ఇరాన్ కుటుంబాలలో స్త్రీలకు ఎటువంటి హక్కులూ లేవు. కుటుంబం ఒక గుడారం లాంటిదని చెప్పవచ్చు. ఈ గుడారానికి మధ్య నున్న స్థంభం ఆ యింటికి పురుషుడు. యింట్లో పిల్లలు ఆ గుడారానికి భద్రత చేకూర్చేవారు. ఎంత ఎక్కువ మంది పిల్లలుంటే స్త్రీకి అంత ఎక్కువ భద్రత. ఎందుకంటే ఎప్పుడు తల్చుకుంటే అప్పుడు ఇరాన్ స్త్రీని పురుషుడు వెళ్ళగొట్టవచ్చు. అప్పుడు పుట్టిల్లే స్త్రీకి గతి. ఒకవేళ పుట్టింటిదగ్గరకూడా ఆశ్రయం దొరకక పోతే ఇక నడివీధే ఆమెకు శరణ్యం. పిల్లలమీదకూడా ఆమెకు ఎటువంటి హక్కు లేదు. ఆడపిల్లలకు 7 యేళ్లు, మగపిల్లలకు రెండేళ్ల వయస్సు వచ్చేంతవరకే తప్ప ఆ తరువాత ఆమెకు ఎట్టి ప్రమేయమూలేదు.

తర తరాలుగా ఇరాన్ స్త్రీలు అనుభవించుచున్న యిట్టినికృష్ట జీవితం ఇకసహించరాదన్న చైతన్యం వారిలో కల్గింది. బురఖాలు తీసి వేసి స్వేచ్ఛగా స్వచ్ఛమైనగాలి పీల్చు కొనాలనే కోర్కె వారిలో ఏర్పడింది. బురఖాలు తీసివేయడమేగాక, సివిల్ కోర్టులలో స్త్రీలు విడాకులు పొందడానికి కూడా అవకాశం ఉండాలని, పిల్లల సంరక్షణ హక్కు తల్లికివ్వాలనీ వారు ఆందోళన సాగించారు.

ఇది ఇరాన్ స్త్రీలలో చాలా చైతన్యాన్ని తీసుకొని వచ్చింది.

స్త్రీలకు యిటువంటి హక్కులు యివ్వాలని ఇరాన్ అంతటా ఉద్యమం నడిచింది.

ఇటీవలనే మరొక నలుగురితో కలసి శ్రీమతి హెలాలి ఇరాన్ పార్లమెంటుకు ఎన్నుకోబడింది.

ఓటు హక్కు

ఇరాన్ స్త్రీలకు ఓటుహక్కు లభించడం వారి జీవితంలో ఒక గొప్ప మార్పు.

పార్లమెంటుకు అభ్యర్థిగా నిలబడిన శ్రీమతి హికామీ తన విచిత్రమైన అనుభవాన్ని యిలా తెలియజేసింది. స్త్రీలకు ఓటుహక్కు యిచ్చిన విషయం తెలియడంతోనే మునిసిపల్ ఎన్నికలకు అభ్యర్థిగా నిలబడాలని శ్రీమతి హికామీ నిశ్చయించింది. ఇస్ఫాహాన్ నగర పాలనకు తన పేరు తెలియజేసింది. అభ్యర్థుల జాబితాలో శ్రీమతి హికామీ పేరు పడగానే ముస్లిమ్ మత గురువులు పెద్ద పెట్టున అసమ్మతి ప్రారంభించారు. స్త్రీల విముక్తికి వ్యతిరేకులు కూడా పెద్ద యెత్తున అలజడి ప్రారంభించారు. టెలిఫోన్ ద్వారా, ఉత్తరాల ద్వారా ఆమెను బెదరించ సాగారు. కాని తన అభ్యర్థిత్వాన్ని బలపరుచుటూ అయిదుగురు ప్రముఖుల సంతకాలను శ్రీమతి హికామీ సంపాదించింది. స్త్రీలపట్ల ఈ వివక్షతను రద్దు చేయాలనే ప్రతిఒక్కరి సానుభూతిని చూరగొంది. ప్రధానమంత్రి, హోమ్‌శాఖామంత్రి కూడా ఆమెను అనేకసార్లు పిలిచి ఈ ఆందోళనను విరమించుకో వలసిందిగా కోరారు. కాని శ్రీమతి హికామీ ధైర్యంతో నిలబడింది. నాకు హెచ్చరికన్నా, ప్రమాదమున్నా ఏమీ భయంలేదు అని ఆమె నిర్భయంగా ప్రకటించింది. అయితే ఈలోగా ఇరాన్ ప్రభుత్వం పడిపోవడంతో చిట్ట చివరకు ఇస్ఫాహాన్ మునిసిపల్ ఎన్నికలు జరుగలేదు.

ఇరాన్‌లో ప్రస్తుతం 20 మహిళా సంస్థలున్నాయి. అందులో కొన్ని హితకారిణీ సంస్థలు. మిగిలిన సంస్థలు స్త్రీలవిద్య, స్త్రీల హక్కులకు సంబంధించిన సమస్యలపైఆందోళన సాగింపుతాయి.

ఈ అన్ని సంస్థలను కలిపి ఒక మహిళా ఉన్నత సంస్థ ఉంది. మాస్కోలో జరిగిన మహిళా సభకు ఈ సంస్థ నుండి ప్రతినిధులు హాజరయ్యారు.

ఈ సంస్థకు అధ్యక్షురాలు ఇరాన్‌రాజా షా సోదరి, రాకుమారి అష్రాఫ్. నేను వెళ్లిన సంవత్సరంలో ఒక స్త్రీల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అన్నితరగతుల స్త్రీలు హాజరయ్యారు.

స్త్రీలకు విద్య

ఈనాడు ఇరాన్‌లో ప్రధమంగా స్త్రీలలో నిరక్షరాస్యతా నిర్మూలన ప్రధాన కర్తవ్యంగా వారు భావించుచున్నారు. అనేక పట్టణాలలో విద్యావంతులైన స్త్రీలు రాత్రిబడులు నడిపి స్త్రీలకు విద్యగరపుతున్నారు. స్త్రీల హక్కుల గురించి బోధిస్తున్నారు. ఆరోగ్యం, శిశుపోషణ, తదితర విజ్ఞానాన్ని కల్గిస్తున్నారు.

టెహరాన్ నుండి స్త్రీల పత్రిక ఒకటి వెలువడుతూంది. ఈ పత్రికకు ప్రత్యేక క్లబ్ ఉంది. వంట, సంగీతం, కుట్టుపని, ఇలాంటి అనేకవిషయాలలోఅక్కడశిక్షణ యిస్తారు. సౌహార్దత, సమానత్వం ఈ క్లబ్ ఆశయాలు. ఈ క్లబ్‌లో కలవారు లేనివారికి అనేక విధాలుగా ప్రోత్సహిస్తారు.

కాని ఇరాన్ దేశంలో స్త్రీల అసమానత్వం అనేక రూపాలలో కొనసాగుతూనే ఉంది. సమాన హక్కుల కోసం వారు ఇంకా ఆందోళన సాగించవలసి ఉంది. సంపదను సమానంగా అందరకూ పంచే ఉద్యమంలో భాగంగా ఇంకా ఎక్కువ స్వేచ్ఛకోసం జరిగే ఉద్యమంలో భాగంగా స్త్రీలఉద్యమం సాగాల్సిఉంది.

నేను ఇస్ఫాహాన్‌లో ఒక జవుళి మిల్లును చూశాను. ఇందులో ఉన్న 3500 మంది పని వారిలో 800 మంది స్త్రీలు. "నీ జీతం ఎంత" అని ఒకామెను అడిగాను, "రోజుకి 35 నాణెములు ఒక కిలోన్నర రొట్టె అని చెప్పింది. నాకూడావచ్చినఫోర్మన్ "అదిఅబద్ధంఅంతకంటె ఆమెకు ఎక్కువ కూలీ ముడుతుంది" అని అన్నాడు. ఆ ఫోర్మన్‌కు చాలా కోపం వచ్చింది. "నీవు ఆ కూలీదాన్ని సరాసరి ఎందుకు అడగాలి? ముందు నన్ను అడగక?" అని నాతో అన్నాడు.

నేను ఒక తివాసీ ఫ్యాక్టరీ చూడాలని షిరాజ్‌లో రేడియో సమాచారశాఖ అధికారులను అడిగాను. వారు చాలా తటపటాయించి పెర్సెపోలిస్ అనే గ్రామానికి తీసుకొనివెళ్ళారు. ఒక దొడ్డిలో కొంతమంది స్త్రీలు, ఒక యువతి తివాసీ నేస్తున్నారు. కాని వీరి జీవితాలు చాలా నికృష్టంగా ఉన్నాయి. వారి ఫోటోలు తీసుకోడానికి నాకు అనుమతి యిచ్చాడు. ఫోటోలు తీయడానికి ముందు ఆ పిల్లను పని నిలిపి వేయవలసిందని అన్నాడు.

దేశంలో ఎక్కడ పడితే అక్కడ ఇరాన్ రాజా సైనికులు, పోలీసులు ఉన్నారు. ఎక్కడా స్వేచ్ఛలేదు, జనాంతికం లేదు. నిరంకుశ ప్రభుత్వాలు నిలబడటానికి అవలంబించే విధానాలు ఇవే. ఇలా ఎన్నాళ్ళు సాగుతుంది? అందుకు ఇరాన్ ప్రజలే సమాధానం చెప్పాలి.

సైకిల్ మీద భారతదేశానికి వచ్చిన ఐరిష్ యువతి

32 సంవత్సరాల వయస్సు గల ఐరిష్ యువతి డెర్వ్లా మర్ఫీ సైకిల్ మీద భారత దేశానికి వచ్చినది. దోవలో ఆయా ప్రాంతాలలోనివారు చేసిన సహాయానికి కృతజ్ఞతగా ధర్మశాల [పంజాబ్]లో పిల్లల పోషణ కేంద్రంలో ఉండి అక్కడి ఇంగ్లీషు నర్సుకు సహాయపడినది.

ధర్మశాలలోని వందలాది టిబెట్ కాందిశీకుల పిల్లల హోమ్‌లో మిస్ మర్ఫీ నాలుగు నెలలు పనిచేసినది. ఈ పిల్లల పోషణ భారత ప్రభుత్వానికి పెద్ద సమస్య అన్నది మిస్ మర్ఫీ. ఐర్లెండుకు తిరిగి వెళ్ళిన తరువాత తన సాహసంగురించి గ్రంథం వ్రాయాలని సంకల్పించినది.

టిబెట్ కాందిశీకులకు సహాయంగా పని చేయడానికి భారత దేశానికి మళ్ళీ రావాలని ఆమె కోరిక అవసరమైతే మళ్ళీ సైకిల్ మీద రావడానికి ఆమె సిద్ధమే దేశాన్ని చూడడానికి ప్రజలతో పరిచయ మేర్పరచు కొనడానికి అదే ఉత్తమ పద్ధతి అంటుంది ఆమె.

సైకిల్‌మీద భారత దేశానికి తన ప్రయాణం, శిశు సంక్షేమ నిధి అధ్వర్యాన తను చేసిన పని వివరాలనూ లండన్‌లో ఆమె వివరించినది.

ఇండియాకు వెళ్ళి రావాలనే కోరిక పది సంవత్సరాల వయస్సప్పటి నుంచీ ఉన్నది ఆమెకు. చాలా సంవత్సరాలకుగానీ నెరవేర లేదు ఆ కోరిక. సైకిల్‌మీద బయలుదేరినది. ఫ్రాన్స్, ఇటలీ, యుగోస్లావియా, బల్గేరియా, టర్కీ, పర్షియా, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్‌ల మీదుగా ఇండియాకు వచ్చినది.

దేశపటాలనూ, సైకిల్ చక్రాలకు చిల్లులు పడితే బాగుచేసుకునేందుకు అవసరమయ్యే సరంజామా, రెండువైపులా రెండు సంచులతో దుస్తులతో బయలుదేరినది. జేబులో ఒక రివాల్వర్ ఉన్నది. అదివరకెప్పుడూ దానిని ఆమె ఉపయోగించి ఉండలేదు. బెల్‌గ్రేడ్ చేరువలో తోడేళ్ళను భయపెట్టడానికని మొదటిసారిగా రివాల్వర్‌ను పేల్చి ఆ శబ్దానికి తోడేళ్ళ కంటే తనే ఎక్కువగా భయపడినది.

ప్రయాణం పొడవునా అందరూ తనను ఆదరించారని మిస్ మర్ఫీ చెప్పింది.

ఢిల్లీలో మిస్ మర్ఫీకి వడదెబ్బ తగిలినది. కోలుకోగానే సిమ్లాలోని సేవ్‌ది చిల్డ్రన్ ఫండ్ తాలూకు కేంద్రాలలో పనిచేస్తానన్నది. ఇట్టి సేవకురాలి అవసరం ధర్మశాలలో ఎక్కువగా ఉన్నందున అక్కడికి వెళ్ళినది. నాలుగునెలలు అక్కడ వుండి జూలియట్ మాస్కెర్‌తో కలసి వందలాది టిబెట్ కాందిశీకుల బిడ్డల సంరక్షణ పని నిర్వహించినది.

మిస్ మర్ఫీ రాక పర్యవసానంగా ఇండియాలో శిశుసంరక్షణ నిధి కృషి ప్రాముఖ్యం లోనికి వచ్చినది.

డా॥ రాజారావు ఆర్ట్ థియేటర్స్

రాజమండ్రి, మే 15

రాజమండ్రిలో డా॥ రాజారావు ఆర్ట్‌థియేటర్స్ ప్రారంభోత్సవం విక్రంహాలులో మే 31 న రాత్రి 8 గంటలకు జరుగుతుంది.

ఆ సందర్భంగా జరుగు బహిరంగసభకు శ్రీ కందుల వీరభద్రస్వామి (మునిసిపల్ కౌన్సిలర్,) అధ్యక్షత వహిస్తారు. వక్తలు శ్రీ అంకరాజు శంకరరావు (ప్రముఖ రంగస్థల నటులు), శ్రీ పోకల నరసింహారావు (ఎడిటర్: మహాప్రస్థానం, పాలకొల్లు) దృశ్యకావ్య ధురీణ శ్రీ భమిడిపాటి రాధాకృష్ణ, శ్రీ శ్రీపాద పట్టాభి (సంగీత నాటక ఎకాడమి సభ్యులు). సభానంతరం థియేటర్స్ వారిచే "విధివశం" (నాటిక) ప్రదర్శింపబడుతుంది.

పరిస్థితులు కొత్తవి; పద్ధతులు పాతవి!

అమ్మాయి బి. ఎస్. సి. చదువుతుంది. 22 ఏళ్ల పైబడ్డాయి. కుటుంబంలో అందరూ ఉన్నత విద్యావంతులే.

పిల్లకు వివాహం చేయాలి. కాబోయే వరునికి ఈ వధువును పరిచయం చేయాలి. ఎట్లాగ?

వరుని ఆహ్వానించారు. వరునితో పాటు ఆతరపు ఎవరో పెద్దలుకూడా వచ్చారు. కాఫీలు, మర్యాదలు అయ్యాయి. తెర నుండి వచ్చి వధువు వారి ఎదట కూచోవాలి, వారు చూడాలి, ఆమెను పల్కరించాలి.

వధువు రోజూ కాలేజీకి వెళ్ళి వస్తూనే ఉంటుంది. ఆమెకు ఘోషా లేదు. వధువు అక్కగారు ఉన్నత విద్యావతే. లెక్చరర్ కూడాను. అందుచే ఒకనాటి తల్లి తండ్రులచాటు బిడ్డలవలె వారు బిడియపడి మగవారి ఎదుటకు రావడానికే ఒక "పెద్ద ప్రయత్నం"గా ఏమీ చేయనవసరం లేదు. తోటి విద్యార్థులతో లెక్చరర్లతో మర్యాదకు భంగంలేని విధంగా మామూలుగా మాట్లాడినట్లు మాట్లాడవచ్చు ఎదుట పడవచ్చు కాని అలా జరగలేదు. ఎంతసేపటికీ వధువు తెరచాటునుండి రాదు. తండ్రి, అన్న దమ్ములు లోనికివెళ్ళి రమ్మని బుజ్జగించి, ధైర్యమిచ్చి తీసుకుని వచ్చి చివరకు కూచోబెట్టారు.

అమ్మాయి ఒంటరిగాకూచోవాలేగాని, వివాహిత అయిన ఆ పిల్ల (లెక్చరర్) అక్కగారు కూడా వచ్చి ఆ పిల్లతోసహా కూచోవచ్చుగదా! పరిచయం చేయవచ్చుగదా. ఊహూ, రాదు.

ఏమో, ఏమనుకుంటారో వచ్చిన పెళ్ళివారు! ఏమీ బిడియ లేకుండా వచ్చి కూచుందనుకుంటారేమో, నిర్లజ్జగా, నిర్భీతిగా, అతి చనువుగా ఉంటారని అనుకుంటారేమో! అన్నీ శంకలే, భయాలే!

ఇంతకీ పిల్లవాడూ పిల్లా మాట్లాడుకున్నదీ లేదు; ఒకరినొకరు పరిచయం చేసుకున్నదీ లేదు! పెద్దవారు లోకాభిరామాయణం చెప్పుకుంటారు, మధ్యమధ్యలో పిల్లవాడు ఏదో అన్నాడు, వచ్చిన పెద్దలు పిల్లను ఏదో ఒకటి రెండుసార్లు పల్కరించారు.

ఇక వెళ్ళివస్తామని పెళ్ళివారు అనడం "అమ్మయ్యా!"అని వధువు లోపలికి గెంతడం అన్నీ జరిగిపోయాయి.

ఇది ఒకసారి, ఒకచోట, జరిగిన విషయం కాదు, ఈ వేసవి పెళ్ళిళ్ళ హడావుడిలో ప్రతీ పూరా ప్రతిపట్నంలో జరుగుతున్నవిషయాలే.

ఈ 15 నిముషాలు, లేక అర్ధగంట "ఇంటర్వ్యూ"మీదే ఆ పిల్ల భావిజీవితం అంతా ఆధారపడి ఉంది, ఎదుకంటె పిల్లవాడికేమి? ఎన్ని సంబంధాలైనా ఆ పిల్లవాడు చూడగలడు. కాని తీసుకొని వచ్చిన ప్రతీ వరుని ముందు ఆ పిల్లవచ్చి ముళ్ళమీద కూచున్నట్లుకూచుని పడే అవస్థ వర్ణనాతీతం.

స్వేచ్ఛగా అమ్మాయి రూపు రేఖలుచూస్తే ఏమో! చుట్టూఉన్నవారు ఏమనుకుంటారో అబ్బాయి అమ్మాయికేసీ చూడగల ధైర్యం కలవాడేగాని ఆ అమ్మాయి పరిస్థితి అది కాదుగదా ఈ అసమానమైన అవకాశాలు అంతస్తులు, అసహజమైన పెళ్ళిచూపులు ఒకనాడు సరిపడితే కావచ్చు, కాని ఈనాడు కాలేజీలకు వెళ్లే చదువుకుంటున్న పిల్లలకు, పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులు పూర్తిచేసి లెక్చరర్లుగా ఉన్న వధువులకు ఉద్యోగినులకు తగినది కాదేమో!

కనీసం ఆ తల్లి దండ్రులు, వచ్చిన పెద్దలు వధూవరుల నిద్దరిని పరిచయంచేసి ఒక అరగంటసేపు వారిని ఒంటరిగా వదలి, స్వేచ్ఛగా మాట్లాడుకోనీయరాదా? అది మర్యాదకు, గౌరవాలకు భంగమా? కనీసం ఒకరితో నొకరు మాట్లాడుకోవడంద్వారా కొంత వరకైనా స్వేచ్ఛగా వూపిరిపీల్చుకుంటూ ఒకరితో ఇంకొకరు పరిచయు లవుతారు కదా?

వధూవరులు ఒకరినొకరు వారంతట వారే పరిచయంచేసుకొని, అర్థం చేసుకొని వివాహం నిర్ణయించుకొనే సమాజ పరిస్థితులు ఏర్పడలేదని అంటూ కనీసం పెళ్ళి చూపుల తతంగంలోనైనా అందుకు స్వల్పావకాశం కల్పించ కూడదా?

"ప్రదర్శనవస్తువు" మాదిరి, బుట్టబొమ్మవలె రు 100 పట్టు చీరకట్టి, తెరవేనుక నుండి "కత్తెరబోనులోకి" నెట్టబడుస్థితి చదువుకున్న అమ్మాయికికూడ తప్పదా? అసహజ వాతావరణంలోను, భీతి ఆందోళన జంట ముప్పిరి గొంటూన్న స్థితిలోనువిజ్ఞానవతులను ఈవిధంగా నెట్టటం తగునా? పరిస్థితులు కొత్తవి; పద్ధతులు పాతవి; ఇంకా యెన్నాళ్ళు?

కుమారీ...// పిన్ని

వేసవి సెలవులు నీవు ఎల్లాగడుపుతున్నావు? బహుశా బంధువుల యిళ్ళల్లో పెళ్ళిళ్ళ హడావుడిలో ఉండి ఉంటావు. లేదా పల్లెటూళ్ళలో మీ తాతగారింటికివెళ్ళి ఉంటావు ఏదో విధంగా కొంత కాలక్షేపం, విశ్రాంతి, తీరికగా చదువుకోవడం, స్నేహితులకు ఉత్తరాలు ఎన్నడైనా వ్రాస్తూండడం మొదలైనవి చేస్తూ వుంటావు.

పట్నవాస జీవితానికి, పల్లెటూరు జీవితానికి తేడా ఏమిటో పుస్తకాలలోను నీవు చదివి ఉండవచ్చు, స్కూలులోనో, కాలేజీలోనో డిబేట్లలో మాట్లాడి ఉండవచ్చు. కాని పుస్తకంలో చదివినదానికి ప్రత్యక్షంగాచూసిన దానికి చాలా తేడా ఉంటుంది.

పల్లెటూరు అనే సరికి "పెట్టు గేదెపెరుగు పెట్టమ్మీ" గిరీశానికి జ్ఞాపకం వస్తాయి. పట్నాలలో గాలి, వెలుతురు రాని అద్దె కొంపల్లో కూచుని, సైడ్‌కాల్వల దుర్గంధంతో ముక్కు మూసుకుని కవితాగానం చేసే కవికుమారులు "పల్లెటూళ్ళు స్వర్గసీమలు"గా వీటిని గని సంతృప్తిపడుతూ ఉంటారు. రైతులు, కూలీలు నిర్మలంగా హాయిగా, ఏ దావర బందీలు లేకుండా జీవితాలు గడుపుతూన్నట్టు; పల్లెపడుచులు పసుపుపచ్చ ఆకాశంలో మబ్బుల్లా, చెట్టుమీద పిట్టల్లా హాయిగా పరుగులు పెడుతూ, పాటలు పాడుతూ విహరించుచున్నట్లు సినిమా చిత్రాలలో చిత్రిస్తారు.

దూరపుకొండలు నునుపు; పల్లెటూళ్ళ జీవితానినేనుగాచూస్తే కాని అందులో ఉన్న అంతులేనికష్టాలూ, ఆందోళనలు బోధపడవు, అంతేకాదు జీవితం ఎంత అసంతృప్తికరంగా ఉంటుందో, పల్లెటూళ్ళలో ఎల్లా జీవిస్తున్నారో అప్పుడే తెలుస్తుంది.

పల్లెటూళ్ళ జీవితాన్ని కొద్దిమంది భూస్వాములూ, వాళ్ళ హంగుదార్లూ, శాసిస్తారు వారుచేసే అక్రమాలకు, అన్యాయాలకు అంతు పులేదు, ఒక వైపున గుప్పెడు ధనవంతుల, ఉత్సవాలు జరుగుతూనే ఉంటాయి. మరో వైపున అవినీతి, దుర్వ్యసనాలు సాగుతూనే ఉంటాయి. ఒకవైపున ధర్మకార్యాలంటూనే ఉంటాయి. మరొక వైపున హత్యలూ, దౌర్జన్యాలూ జరుగుతూనే ఉంటాయి. న్యాయమూ ధర్మమూ కాక, డబ్బు, పెత్తనమూ అన్నీ నిర్ణయిస్తాయి. ఎన్నికలంటూవస్తే సీట్లకోసం ప్రాకులాట తప్పదే ప్రజలకు సౌకర్యాలు కల్పించడానికి ఆ సీట్లు అని తెలియదు పేద ప్రజలనుమోసంచేసి, అదర గొట్టి, డబ్బు ఇచ్చి ఓట్లుకాజేస్తారు పైకి అంతాస్వేచ్ఛగానే ఎన్నికలు జరిగినట్లు ఉంటాయి కాని నిజమైన స్వేచ్ఛ ఉండదు. ఇదిపల్లెటూళ్ళ రాజకీయాలూ, ప్రజాస్వామ్యమూను. పేదప్రజలు చైతన్యవంతులుగా, ఐక్యంగా ఉంటే ఆనాడు వీరి పెత్తనం సాగదు.

ఇక అక్కడ సాంఘిక జీవనం ఎట్లావుంటుందో చూశావా? చదువుకున్నవారే తక్కువ. అందులో కష్టించి పనిచేసే కూలీలు, పేదరైతులు వారి పిల్లలకు చదువు చెప్పించలేరు, వారి పిల్లలను చిన్నప్పటినుండి పొలాల్లో పశువులవద్ద పనులు చేయిస్తారు, రైతులకుటుంబాలలోఆడపిల్లలకుఎక్కువచదువుచెప్పించరు. నగలు, చీరలు, సినిమాలు మొదలైన డబ్బుతో కొనే నాగరికత తప్ప, విద్యతో అబ్బే సంస్కారమూ, విజ్ఞానమూ అలవడవు. దర్పాలూ, డాబులు, మాత్రం బాగా వెళ్ళబోస్తారు. ఘోషాలు పాటిస్తారు. పెళ్ళిళ్ళు ఆస్తులకోసం చేస్తారుకాని వధూవరుల అనుకూల దాంపత్యం చూడరు, కాకిముక్కుకు దొండపండుసామెతగా పెళ్ళిళ్ళు చేస్తారు. ఆస్తుల తగవులు వచ్చి మగవారు, పెళ్ళాలను విడదీస్తారు. బాల్యంలో వితంతువులైనా పునర్వివాహాలు చేయరు పునర్వివాహం చేయడం అకార్యంగా చూస్తారు. కాని జరిగే దురాచారాలు మాత్రం జరుగుతూనే ఉంటాయి. ఇక మూఢ నమ్మకాలకు అంతే వుండదు. స్పుత్నిక్ యుగం వచ్చినా మానవుడు గ్రహాంతర యానం చేసే దశ వచ్చినా అన్నిటికీ ఏదో పిచ్చి ఊహలు, పిచ్చి నమ్మకాలు పట్టుకొని వేళ్ళాడతారు. శాస్త్రీయ విజ్ఞానమూ, హేతుబద్ధమైన దృష్టీ ఉండదు.

ఇక పెళ్ళిళ్లు, కట్నాలు, లాంఛనాలు వీటి దగ్గర, పెట్టుపోతల దగ్గర ఎన్నెన్ని తగవులు పడతారో చెప్పనక్కరలేదు.

అయితే పల్లెటూళ్ళలో చదువు తక్కువైనా మంచి సంస్కారమూ, పరోపకార దృష్టికల్గి గ్రామ శ్రేయస్సుకోసం పాటుపడేవారుకూడా ఉంటారు. వారు ఎన్ని కష్టాలు వచ్చినా, ఎన్ని బాధలు పడవలసివచ్చినా వెనుదీయక ఒకవైపున గ్రామంలో వ్యాపించిన పార్టీల కక్షలూ, మరోవైపున ప్రజల అజ్ఞానమూతట్టుకుంటూ త్యాగదీక్ష ప్రదర్శిస్తారు.

గ్రామానికి చిహ్నం-వంటినిండా బట్టలేని, కడుపునిండా తిండిలేని, ఉంటానికి సరియైన యిల్లులేని రాత్రింబగళ్ళు పనిచేసే పేదసాదే. వీరివిషయాల్లో ఇంకా వెలుగురాలేదు గౌహాతి ఎ. ఐ. సి. సి. సమావేశంలో శ్రీ కృష్ణమీనన్ చెప్పినట్లు కొద్దిమంది చేతుల్లో భూమి కేంద్రీకరించ బడివుంది. అందుకే ధనం, పెత్తనం స్వైర విహారం చేస్తూంటాయి. గ్రామాలు ఈ పెత్తందార్లనుండి విముక్తి పొందిననాడే గ్రామప్రజలకు ముక్తి. అప్పుడే అందరికి పాడిపంట అందరికి చదువుసంధ్యా అబ్బుతాయి!

చిమ్మపూడిలో అగ్ని ప్రమాదం: రు. 2 లక్షల నష్టం

ఖమ్మం, మే 18

ఖమ్మంతాలూకా చిమ్మపూడిగ్రామంలో గత ఆదివారం పగలు అకస్మాత్తుగా నిప్పంటుకొని ఒకగంటలోనే 64ఇండ్లు కాలిపోయినవి, కాలిన యిండ్లలో పూరిండ్లతోపాటుగా భవంతులు, డాబాలుకూడా వున్నవి, ఎర్రని ఎండ, విపరీతమైన గాలి వుండటంవల్ల ప్రజలంతా మంటలను అదుపులో పెట్టజాలక కట్టుగుడ్డలతో బయటకు వచ్చారు. ఇండ్లలోవున్న ధాన్యం, సామాను, డబ్బు, పశువులమేత సర్వమూ అగ్నిపాలై పోయింది. ఆరు పశువులు, బండ్లు కాలిపోయాయి. రెండు, మూడు లక్షల రూపాయలవరకు నష్టం జరిగివుంటుందని అంచనా వేయబడింది, ఖమ్మంనుండి ఫైర్ యింజను వెళ్ళేవరకే పూర్తిగా కాలిపోయింది.

ఖమ్మం తహసీల్దారు, బి.డి.వో ప్రమాదస్థలానికి వెళ్ళారు. ఇలాంటి ఘోరమైన అగ్నిప్రమాదం జరగడం యీ జిల్లాలో ఇదివరకెన్నడూ లేదని చెపుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఆస్పత్రుల పనివారి సంఘం

గుంటూరు, మే 15

ఆంధ్రప్రదేశ్ ప్రయివేటు హాస్పిటల్ పనివారల మూడవ వార్షిక సమావేశం శ్రీ యం. కె. మోహన్‌రావుగారి అధ్యక్షతన ఈనెల 9 వ తేదీన నిడుదవోలులో జరిగింది. శ్రీ కె. ప్రసాదరావుగారు ప్రవేశపెట్టిన కార్యదర్శి నివేదికను కొన్ని సవరణలతో ఆమోదించారు. ప్రయివేటు ఆసుపత్రులలో పనిచేయు కార్మికులు, తమ జీవిత పరిస్థితులను ప్రభుత్వ దృష్టికితెచ్చి తగినసహాయం పొందేందుకై అందరూ సంఘంలో సభ్యులుగా చేరాలని కార్మికులకు విజ్ఞప్తిచేస్తూ తీర్మానించారు. తదనంతరం శ్రీ యం. కె. మోహన్‌రావు (అధ్యక్షులు), శ్రీ కె. ప్రసాదరావు (ప్రధాన కార్యదర్శి), శ్రీ వి. ఏలియా (ఉపాధ్యక్షులు) శ్రీ జి. శాంసన్ (సహాయ కార్యదర్శి), శ్రీ డి. రాయప్ప (కోశాధికారి) మరొక అరుగురు సభ్యులతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు.

నిర్మలమౌతున్న ఆకాశం

మాస్కో అణుపరీక్షల నిషేధపు ఒడంబడిక వల్ల కలిగిన సత్ఫలితాలు

ఎన్. ఎన్. బ్లోఖిన్

సోవియట్ వైద్యశాస్త్ర పరిషత్తు అధ్యక్షుడు

హిరోషిమాపై పేల్చబడిన అటంబాంబు ఫలితంగా మొలిచిన విషపు కుక్కగొడుగు యీ 20 వ శతాబ్దపు అత్యంత ఘోర ప్రమాదమైన థెర్మో న్యూక్లియర్ యుద్ధానికి చిహ్నం అయింది. మాస్కోలో జరిగిన అణుపరీక్ష నిషేధపు ఒడంబడిక ఆ యుద్ధ ప్రమాదాన్ని ఇంకా తొలగించలేదు. కాని, ఆ ప్రయత్నంలో తీసుకోబడిన అతి ముఖ్యమైన తొలి చర్య అని చెప్పవచ్చును. ఇదివరకు లాగనే ఇప్పుడుకూడ "అయితే అణు ఆయుధాలను పూర్తిగా నిషేధించాలి లేకపోతే ఏమీ అక్కరలేదు" అని వాదించేవారు తమరాజకీయ హ్రస్వదృష్టిని మాత్రమేగాక, రేడియో యాక్టివ్ ధూళివల్ల వాతావరణం విషపూరితమయ్యే ప్రమాదం ఎంత పెద్దదో గుర్తించలేక పోవడంలో తమ పూర్తి అసమర్థతనుకూడా ప్రదర్శించు కుంటున్నారు. వాతావరణం విషపూరితమైతే అది మనిషినికూడా విషపూరితం చేస్తుంది. మనిషిశరీరంలో తీరని దీర్ఘవ్యాధులకు దారితీస్తుంది, ఆ ప్రమాదం ఎటువంటిదో వైద్యులమైన మాకు బాగా తెలుసు. అంకొలాజికల్ సంస్థలో జంతువుల శరీరంలోకి రేడియో యాక్టివ్ ఐసోటోపులను ఎక్కువ కాలం ప్రవేశపెట్టడంద్వారా కృత్రిమ కేన్సరు ట్యూమర్లను కల్పిస్తున్నారు. హిరోషిమా, నాగసాకీలలో అణుబాంబులు ప్రేలిన వాతావరణంలో నివసించే వారికి పుట్టిన పిల్లలలో అంగవైకల్యం గలవారి సంఖ్య రెట్టింపు అవుతోంది, రేడియో యాక్టివ్ పదార్థం దీర్ఘకాలం పేరుకుని వుండటం వల్ల జన్మ సంబంధమైన దుష్ఫలితాలు ఎక్కువ అవుతాయని గుర్తించాలి. యాటంబాంబులు పేల్చినందువల్ల వంశపారంపర్యంగా సంభవించే ప్రమాదాలే అణుపరీక్షల మూలంగా వాతావరణంలో ఎక్కువ అయ్యే రేడియో యాక్టివ్‌పదార్థం వల్లకూడా సంభవిస్తాయి.

వాతావరణంలోను, నీటి క్రింద, రోదసిలోను అణు పరీక్షలు, ఇంతకుముందు సంవత్సరాలలో జరిగినంత తరచుగాను, తీవ్రంగాను కనక కొనసాగివుంటే, మానవులకు ముఖ్యంగా పిల్లలకు ప్రమాదం కలిగించేటంత ఎక్కువగా రేడియో యాక్టివ్ పదార్థాలతో వాతావరణం కలుషితమై వుండేది. ఉదాహరణకు, వాతావరణంలో రేడియోయాక్టివ్ బొగ్గు-14 అనేది 1954 నుంచి సాలుకి 2 శాతం వంతున క్రమంగా ఎక్కువ అవుతూ, మామూలుగా ప్రకృతిలో ఆ పదార్థం వుండవలసిన దానికంటే 16-19 శాతం అధికమయింది అణుపేలుళ్ళులేకుండావుండేరోజులలో కంటే అవి జరగడం ప్రారంభమైన తరువాత అణుధూళి కొన్నివేల రెట్లు ఎక్కువ అయినట్లు పరిశోధనలు తెల్పుతున్నాయి.

మాస్కో ఒడంబడికవల్ల కలిగిన మంచి ఫలితాలు

మన భూగోళాన్ని విషపూరితం చేసే ఈ వినాశకరమైన విధానాన్ని మాస్కో ఒడంబడిక అరికట్టింది. అణు పరీక్షలు జరుగుతూవున్న రోజులలోకంటే ఇప్పుడు రేడియో యాక్టివ్‌ధూళి కొన్ని వందల రెట్లు తగ్గిపోయింది. గత 6 నెలలలోను అయోడిన్-131 బేరియం-140 లాంటి అల్ప కాలం వుండే ఐసోటోపులు నశించి పోయాయి. మానవ శరీరంమీద వాటి రేడియో యాక్టివ్ ప్రభావం ఏమీ లేకుండా పోయింది. చాలా కొద్దికాలం మాత్రమే వుండేవి అయినా పైన చెప్పిన ఐసోటోపులు అణు ప్రేలుడు జరిగిన వెంటనే మనిషికి చాలా ప్రమాదం కలిగిస్తాయి. గాలిలో "వేడి" రేడియో యాక్టివ్ రేణువులు బాగా తగ్గిపోయిన విషయాన్ని కూడా మనం గుర్తించాలి. అవి చాలా చురుకైనవి. మానవ శరీరంలో కనక ప్రవేశించాయంటే చాలాతీవ్రమైన ప్రమాదాన్ని కలిగిస్తాయి. ఇలాగే కొంతకాలం అణుపరీక్షలు జరగకుండా వుంటే, కొద్దిరోజులలోనే దీర్ఘకాలం వుండే స్ట్రాన్షియం - 90, సీసియమ్-137 లాంటి ఐసోటోపులు, మానవ శరీరంలో ప్రోగవడం కూడ తగ్గిపోతుంది.

క్లుప్తంగా చెప్పాలంటే, మాస్కో ఒడంబడిక ఫలితంగా మన భూగోళంమీద రేడియేషన్ ప్రభావం తగ్గిపోతూవుంది. ఆవిధంగా మానవుల ఆరోగ్యంమీద వాటి ప్రభావం తగ్గుతూవుంది. కాని అణుపరీక్షలను కొనసాగించాలనే ఫ్రెంచి మిలిటరీవాదుల పిచ్చి కోరికలే కనక కొనసాగితే మనం ప్రమాదకరమైన రేడియేషన్ ప్రభావాలను తిరిగి ఎదుర్కోవలసివస్తుంది, దాన్నేమాత్రం సహించ కూడదు. —నోవోస్తీవార్తాసంస్థ

పశ్చిమగోదావరిజిల్లా యువజనమహాసభ

తణుకులో జరపడానికి సన్నాహాలు

భీమవరం, మే 17

రాబోయే పంచాయతీ ఎన్నికలలో కుల, మత, గ్రామకక్షలకు అతీతంగా ఉండే, గ్రామపురోభివృద్ధికి తోడ్పడే అభ్యుదయ కాముకులను గెలిపించటానికి కృషి చేయవలసిందిగా యువజనులందరికి విజ్ఞప్తిచేస్తూ పశ్చిమగోదావరి జిల్లాయువజనసంఘకార్యవర్గంతీర్మానించింది.

పశ్చిమగోదావరి జిల్లా యువజనసంఘ కార్యవర్గ సమావేశం శ్రీ చింతకాయల చంద్రరావుగారి అధ్యక్షతన నిడదవోలులో నిన్న జరిగింది.

జిల్లాలో ప్రముఖ జాతీయవాది, భీమవరం కళాశాల స్థాపనలో ప్రముఖపాత్ర వహించిన విద్యాభిమాని శ్రీ దంతులూరి నారాయణరాజుగారి మృతికి సంతాపం తెలుపుతూ తీర్మానించారు. అభ్యుదయ రచయిత శ్రీ అవసరాల సూర్యారావుగారి అకాల మృతికి కూడా ఈ సమావేశం సంతాపం తెలిపింది.

జూన్ 13, 14 తేదీలలో జిల్లాయువజన సదస్సును తణుకులో జరపటానికినిర్ణయించడమైనది. ఈ సదస్సును దిగ్విజయం చేయుటకు జిల్లాలో యువజనసంఘ కార్యకర్తలందరు చురుగ్గాకదిలి ఎక్కువమందిని సమీకరించటానికి పూనుకోవలసిందిగా కోరింది.

సత్యాగ్రహ శిక్షణా శిబిరం

చీరాల, మే 18

మే నెల 11, 12, 13 తేదీలలో ఇక్కడ సత్యాగ్రహ సమాజ్ కార్యకర్తల శిక్షణ శిబిరం జరిగింది. నెల్లూరు, గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి, నల్లగొండ జిల్లాలనుంచి 17 మంది కార్యకర్తలు పాల్గొన్నారు. పార్టీ రాహిత్యం, నిరాడంబరత గురించి శ్రీ గోరా వివరించారు. కార్యక్రమ అంశంపైన చర్చ జరిగినప్పుడు తిరిగి జూన్‌లో మంత్రుల ఆడంబర వ్యతిరేక సత్యాగ్రహం ప్రారంభించాలని ఏకగ్రీవంగా సూచించారు. అందువివరాలు నిర్ణయించుటకు గోరాగారికి అధికారం యిచ్చారు.

ఇదే సందర్భంగా ఆఖరు రోజున బహిరంగసభ జరిగింది. ఈ సభలో శ్రీ గోరా మంత్రుల ఆడంబరత్వాన్ని ఖండిస్తూ ప్రసంగించారు. స్వాతంత్ర్యోద్యమ కాలంనాటి ధైర్యసాహసాలు, అన్యాయ ప్రతిఘటనా శక్తి ఏమయిపోయాయని ప్రశ్నించారు.

తర్వాత శ్రీయుతులు లవణం, కానా, పల్లపోలు సాంబయ్య, బందా రామయ్య, వై. వెంకట్రామయ్య, శ్రీమతి గోపరాజు సరస్వతి గార్లు మంత్రుల ఆడంబరాలకు వ్యతిరేకంగా సత్యాగ్రహాన్ని సమర్థిస్తూ ప్రసంగించారు.

రేడియో

గురువారం, మే 21
శక 1886 వైశాఖ 31

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉదయం: 6-30 శుభోదయం; 6-40 ఆం. వా. 6-45 నారాయణదాస్ కృతులు; 6-55 సూక్తిముక్తావళి; 7-00 తె. వా; 7-15 ప్రచార విశేషాలు; 7-20 చతురంగం; 7-30 వి. బి. కనకదుర్గ; 8-00 ఆం. వా; 8-15 ప్రాంతీయ; 8-30 క్లారినెట్; 9-00 సమాప్తి.

మధ్యాహ్నం: 12-30 హై. రిలే; 1-00 వి. బి. కనకదుర్గ; 1-30 వాద్య సంగీతం; 1-40 హిం. వా; 1-50 తె. వా; 2-00 వాతావరణ సూచన, సమాప్తి.

సాయంత్రం: 6-00 స్థానిక ప్రకటనలు; 6-05 ప్రాం. వా; 6-15 నేటి విశేషం; 6-20 మొల్ల- బుర్రకథ; 7-0 తె. వా; 7-15 గ్రామస్థులకు; 7-30 హై. రిలే; 7-40 విరామ సంగీతం; 7-45 రాగం, తానం, పల్లవి-మ. రిలే; 8-30 రేడియో న్యూస్‌రీల్ - ఢి. రిలే; 8-40 ఫిల్మ్ సంగీతం; 8-55 ప్రస్తుతాంశం; 9-00 ఆం. వా; 9-15 ఆంగ్లమున; 9-25 లలిత సంగీతం; 9-30 కవి గోష్ఠి; 10-00 సంగీత రూపకములనుండి పాటలు; 10-30 ఆం. వా; 10-35 సమాప్తి - జన గణ మన.

హైద్రాబాద్ - ఏ

405.4 మీ (740 కిలోసై)

ఉదయం: 6-30 సుప్రభాతం; కార్యక్రమ వివరణ; 6-40 ఆం. వా; 6-45 ఏ. రిలే; 6-55 సూక్తిముక్తావళి; 7-00 తె. వా; 7-15 సంకీర్తనం; 7-30 లలిత సంగీతం; 7-45 సంగీతశిక్షణ; 8-0 ఆం. వా; 8-15 వి. వలె; 8-30 వి. వలె. 9-00 సమాప్తి.

మధ్యాహ్నం: 12-30 కార్మికులకు: కుటుంబ నియంత్రణ రూపకం; 1-00 స్త్రీలకు- ఉర్దూ; 1-30 లలితసంగీతం; 1-40 హిం. వా; 1-50 తె. వా; 2-00 హై. వి. వలె; 2-10 ఉ. వా; 2-30 సమాప్తి.

6-00 స్థానిక ప్రకటనలు; 6-05 ప్రాం. వా; 6-15 ప్రస్తుతాంశం; 6-20 ఉర్దూలో కార్యక్రమం; 7-00 తె. వా; 7-15 మరాటీ శ్రోతలకు; 7-30 హై. వి. వలె; 7-45 రాగం, తానం, పల్లవి- మ. రిలే; 8-30 రేడియో న్యూస్‌రీల్ - ఢి. రిలే; 8-40 విరామ సంగీతం; 8-45 భీమసేన్‌జోషి; 8-55 ప్రస్తుతాంశం; 9-00 ఆం.వా; 9-15 ఉ. వా; 9-30 వి. రిలే; 10-10 ఖయాల్; 10-30 ఆం. వా, 10-35 సమాప్తి - జన గణ మన.

హైద్రాబాద్ - బి

కడప

252.1 మీ (1190 కిలోసై)

విశాఖపట్నం

322.6 మీ (930 కిలోసై)

సాయంత్రం 6-00 నుండి రాత్రి 9-30 వరకు

88.42 మీ (3355 కిలోసై)
(హైదరాబాద్ మాత్రమే)

ఉదయం: 6-30 హై.ఎ.వలె; 7-45 సమాప్తి.

49.02 మీ (6120 కిలోసై.)

8-00 హై. ఎ. వలె; 9-00 సమాప్తి.

42.02 మీ (7140 కిలోసై)

మధ్యాహ్నం: 12-30 హై. ఎ. వలె; 1-00 వీణ; 1-30 హై. ఎ వలె; 2-00 వీణ; 2-30 సమాప్తి.

సాయంత్రం: 6-00 హై. ఎ. వలె; 6-20 గ్రామస్థులకు; 7-00 తె. వా; 7-15 గ్రామస్థులకు; 7-30 ఆంధ్ర ప్రదేశ్ లో వేసవి విశ్రాంతి స్థలాలు - ప్రసంగం; 7-40 విరామ సంగీతం; 7-45 హై. ఎ. వలె; 8-45 ఈ మాసపు పాట; 8-50 విరామ సంగీతం; 8-55 హై. ఎ. వలె; 9-15 ఆంగ్లమున; 9-25 విరామ సంగీతం; 9-30 హై.ఎ.వలె; 10-35 సమాప్తి - జన గణ మన.

మద్రాస్ - బి

211.3 మీ (1420 కిలోసై)
60.98 మీ (4920 కిలోసై)

ఉదయం: 6-40 ఆం. వా; 6-45 మంగళ గానం; 7-00 తె. వా; 7-15 సంగీతమంజరి; 7-30 పమోలిన్; 8-00 ఆం. వా; 8-15 సమాప్తి.

211.3 మీ 1420 కిలోసై
41.90 మీ. 7160 కిలోసై

మధ్యాహ్నం: 12-00 కార్మికులకు; 12-30 సమాప్తి.

1-00 సేలం జి. దేశికన్; 1-30 ఆం. వా; 1-40 గీతమంజరి; 1-50 తె. వా; 2-00 సమాప్తి.

211.3 మీ (1420 కిలోసై)
60.98 మీ (4920 కిలోసై)

సాయంత్రం: 5-30 పాశ్చాత్య సంగీతం; 6-00 ఆం. వా; 6-05 మ. ఎ. వలె; 6-20 వాతావరణసూచన, స్థానిక ప్రకటనలు, వాణిజ్య వార్తలు (ఆంగ్లం); 6-30 కార్యక్రమ వివరణ (తమిళం); 6-35 పమోలిన్; 7-00 తె. వా; 7-15 వీణ-వేణువు- నిలయ విద్వాంసులు; 7-30 ఎమ్. ఎస్. పద్మ; 7-45 రాగం, తానం, పల్లవి - ఢి. రిలే; 8-30 శ్రోతలు కోరిన పాటలు; 8-55 ప్రస్తుతాంశం; 9-00 ఆం. వా; 9-15 ఆంగ్లమున; 9-30 కవిగోష్ఠి తెలుగు; 10-35 మ. ఎ. వలె 10-00 సమాప్తి జన గణ మన.

విజయనగరం మున్సిపల్ యింజనీరుగా ఇంతకాలం నుంచి సమర్థవంతంగా పని చేస్తూయున్న శ్రీ డి. వెన్నెలనాయుడుగారు గుడివాడ మున్సిపల్ యింజనీయరుగాను, శ్రీ కె. సత్యనారాయణగారు పాలకొల్లు మున్సిపాలిటీ యింజనీయరుగాను బదిలీ అయిన సందర్భంలో మున్సిపల్ ఉద్యోగుల సంఘం 12 వ తేదీన విందునిచ్చినారు.

జాతీయ సమితి నిర్ణయాలకు కర్నూలుజిల్లా కమ్యూనిస్టు కార్యకర్తల సభ ఆమోదం

శ్రీ పూల సుబ్బయ్య కార్యదర్శిగా నూతన జిల్లా కమ్యూనిస్టు కార్యవర్గం ఎన్నిక

కర్నూలు, మే 17

కర్నూలుజిల్లా కమ్యూనిస్టు కార్యకర్తల విస్తృత సమావేశం. జాతీయ నిర్ణయాలను ఆమోదించి పోటీపార్టీ నిర్మాణాన్ని ఖండిస్తూ తీర్మానించింది. ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి నిర్ణయానుసారం. మొత్తం జిల్లాకు, శ్రీ పూలసుబ్బయ్య ఎం. ఎల్. ఎ. గారు కార్యదర్శిగా నూతన కార్యవర్గాన్ని కూడా ఎన్నుకొన్నారు.

కర్నూలుజిల్లా కమ్యూనిస్టు కార్యకర్తల విస్తృత సమావేశం ఈనెల 12,13 తేదీలలో జరిగింది. ఈ సమావేశానికి జిల్లాలోని అన్ని ప్రాంతాలనుండి సుమారు 75 మంది ముఖ్య కార్యకర్తలు హాజరైనారు. శ్రీ పులిమెట్ల వెంకట రామప్ప, శ్రీ పూల సుబ్బయ్య ఎం. ఎల్. ఏ., శ్రీ ఆంజనేయులుగార్లు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ నీలం రాజశేఖర రెడ్డిగారు జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు, డాంగే లేఖలు మున్నగు సమస్యలపై నివేదిక ఇచ్చారు. తరువాత జాతీయ సమితి నిర్ణయాలను ఉల్లంఘించి పోటీ పార్టీ నిర్మాణానికి పిలుపిచ్చిన విచ్ఛిన్నకుల చర్యలను, రాష్ట్రంలో పోటీపార్టీ నిర్మాణానికి పూనుకొన్న శ్రీ సుందరయ్య ప్రభృతులపై రాష్ట్ర సమితి నిర్ణయాలను చర్చించి. ఈ క్రింది తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు.

"పార్టీలో ఏర్పడే రాజకీయ సిద్ధాంత విభేదాలను, అవి ఎంత పెద్దవైనా పార్టీనిర్మాణ సూత్రాల ననుసరించి పరిష్కరించుకోడానికి తిరస్కరించి, బహిరంగంగా పత్రికా ప్రకటనలుచేసి, పార్టీ అత్యున్నతాధికార సంస్థయైన జాతీయ సమితినుండి వాకౌట్ జరిపి, పార్టీ నాయకత్వంపై హీనమైన అభాండాలువేసి,పోటీ పార్టీ నిర్మాణానికి పిలుపు యిచ్చిన 32 మంది పార్టీ విచ్ఛిన్నకులపై జాతీయసమితి తీసుకున్న శిక్షణాచర్యలను ఈ సమావేశం ఆమోదిస్తూ వున్నది.

పోటీపార్టీ నిర్మాణానికి పూనుకొని పార్టీని చీల్చటానికి, అప్రతిష్ఠపాలు చెయ్యడానికి ఆంధ్రలో శ్రీ సుందరయ్య వగైరా నాయకులు చేస్తున్న ప్రయత్నాలను ఈ సమావేశం తీవ్రంగా ఖండిస్తూవున్నది. వీరిపై ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి తీసుకున్న శిక్షణా చర్యలను ఈ సమావేశం బలపరుస్తూ వున్నది."

అనంతరం జాతీయ సమితి నిర్ణయాలను ఆమోదించే మార్కాపురం ప్రాంతీయ కమ్యూనిస్టు సమితి సభ్యులు, కర్నూలు జిల్లా కమ్యూనిస్టు సమితి సభ్యులు, రాష్ట్ర సమితి నిర్ణయం మేరకు సమావేశమైనారు. శ్రీ పూల సుబ్బయ్య (శ్రీ టి.బసవయ్య, శ్రీ కోదండ రామిరెడ్డి, శ్రీ కె. ఆంజనేయులు శ్రీ పులిమెట్ల వెంకటరామప్ప, శ్రీయస్. ఎం. ఖాశిం,శ్రీరంగప్పగార్లతో కార్యవర్గం ఎన్నుకొనబడింది. ఇంకా ఇద్దరిని కార్యవర్గంలోకి తీసుకొనుటకు నిర్ణయించారు.

వరంగల్ జిల్లా సమితి ఆమోదం

వరంగల్, మే 18

వరంగల్‌జిల్లా కమ్యూనిస్టు సమితి విస్తృత సమావేశం మానుకోటలో మే 11,12, తేదీలలో జరిగింది.ఇందులో వందమందిపార్టీ ముఖ్యులు పాల్గొన్నారు. సమావేశానికి పెండ్యాల రాఘవరావు శ్రీ తమ్మెర వెంకట్రామయ్యగారలు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ప్రదేశ్ కమ్యూనిస్టు నాయకులు శ్రీ వై.వి. కృష్ణారావు గారుజాతీయ,రాష్ట్రసమితుల నిర్ణయాలపై వివరించారు. తదుపరి శ్రీ రావి నారాయణరెడ్డిగారు శ్రీ డాంగే వ్రాశాడనే లేఖలు గురించి, విచ్ఛిన్నకారులను గురించి, అంతర్జాతీయ సిద్ధాంత రాజకీయ విభేదాలను గురించి వివరించారు.

చర్చల తదుపరి విచ్ఛిన్నకారులపై జాతీయ సమితి క్రమశిక్షణాచర్య తీసుకొనటం సరైనదని జిల్లాసమితి ఏకగ్రీవంగా ఆమోదించింది. అదేవిధంగా పోటీపార్టీనిర్మించిన శ్రీ సుందరయ్య వగైరాలను 11 మందిని బహిష్కరిస్తూ 44 మందిని సస్పెండ్‌చేస్తూ ప్రదేశ్ సమితి చేసిన తీర్మానాన్ని జిల్లా సమితి ఏకగ్రీవంగా ఆమోదించింది.

వరంగల్ జిల్లాలో ఒకటిన్నర సంవత్సరకాలంనుంచి విచ్ఛిన్నకారులు జరిపేకార్యకలాపాలనుగురించిశ్రీటీగలసత్యనారాయణరావుగారు ఒక నివేదికను ప్రవేశపెట్టారు. చర్చల తదుపరి జిల్లాపార్టీని కాపాడేటందుకు కఠిన క్రమశిక్షణాచర్యలు(క్రిందివారిపై తీసుకోవాలని నిర్ణయించారు.

శ్రీయుతులు ఓంకార్, నల్లా నర్సింహులు, యల్. వెంకట్రామయ్య, రాఘవులు, జెజెడ చెన్నయ్యగార్లను, పోటీపార్టీ నిర్మాణంకోసం కృషిచేస్తున్నందుకుగాను పార్టీనుంచి బహిష్కరిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు.

12వ తేదీ రాత్రి గాంధిపార్కులో బహిరంగసభ జరిగింది. సభకు శ్రీ కొండపల్లి గోపాల్‌రావు అధ్యక్షతవహించారు,శ్రీ వై. వి. కృష్ణారావు, శ్రీ నారాయణరెడ్డిగార్లు ఉపన్యసించారు. శ్రీ సుందరయ్య పోటీపార్టీని నిర్మించి కార్మికులకు, కర్షకులకు మధ్యతరగతి ప్రజలకు ద్రోహం చేస్తున్నారని వారు వివరించారు.

తదుపరి శ్రీ టీగల సత్యనారాయణ జిల్లా సమితిలో తీసుకున్న నిర్ణయాలపై మాట్లాడారు తదుపరి శ్రీ రామనాథం, శ్రీ పెండ్యాలరాఘవరావుగార్లు మాట్లాడారు. శ్రీ గోపాలరావు గారి అధ్యక్షఉపన్యాసం తదుపరి తమ్మడపల్లి బుర్రకథ వారిచే గొల్లసుద్దులు చెప్పబడింది.

పొదిలితాలూకా కమిటీకి నూతనకార్యదర్శిఎన్నిక

పొదిలి, మే 18

నెల్లూరుజిల్లా పొదిలి తాలూకా కమ్యూనిస్టు కమిటీ సమావేశం పొదిలిలో శ్రీ గట్టుపల్లి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగింది. పార్టీ నిర్మాణ సమస్యలు, పంచాయితీ ఎన్నికలపై చర్చించి నిర్ణయించడమైనది.

ఉత్తర నెల్లూరుజిల్లా పోటీపార్టీ కమిటీలో సభ్యునిగా పొదిలితాలూకా కమిటీ కార్యదర్శిని తీసుకున్నందున, శ్రీ దాదం వీరారెడ్డిని, పార్టీ సభ్యత్వం నుండి తొలగిస్తూ, ఏకగ్రీవంగా తీర్మానించడమైనది.

తాలూకా కమిటీకి యస్. వీరాస్వామిరెడ్డిని కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడమైనది.

పల్నాడు తాలూకా కమ్యూనిస్టు కమిటీ పునర్నిర్మాణం

నడికుడె, మే 18

గుంటూరుజిల్లా, పల్నాడు తాలూకాలోని రెండు బ్లాకు కమిటీ సభ్యుల సంయుక్త సమావేశం మే 11 న జరిగింది. సమావేశానికి జిల్లా సమితి సభ్యులు, బ్లాకు కమిటీ సభ్యులు అయిన శ్రీ బండ్ల అదాం అధ్యక్షత వహించారు. రాష్ట్ర సమితి జిల్లా విస్తృత సమావేశ చర్చలను, నిర్ణయాలను గురించి శ్రీ మందపాటి నాగిరెడ్డి వివరించారు. తర్వాత జిల్లా సమావేశ నిర్ణయానుసారం రెండు బ్లాకులను కలిపి తాలూకా కమిటీగా ఏర్పర్చుటకు ఏకగ్రీవంగా ఆమోదించారు. నూతన మహాసభ జరిగేవరకు రెండు బ్లాకులకు చెందిన బ్లాకు కమిటీసభ్యులే తాలూకా కమిటీగా వ్యవహరించ నిర్ణయించారు. ఈ తాలూకా కమిటీకి కార్యదర్శిగా నాగిరెడ్డిగారిని ఎన్నుకొన్నారు.

తదుపరి దిగువ తీర్మానములను ఏకగ్రీవంగా ఆమోదించారు.

"32 మందిపై జాతీయ సమితి తీసుకున్న క్రమ శిక్షణా చర్యలను రాష్ట్ర సమితి పోటీ కమిటీ వారిపై తీసుకున్న క్రమశిక్షణా చర్యలను తాలూకా కమిటీ బలపరుస్తోంది. పార్టీ విచ్ఛిన్నానికి పోటీ పార్టీ కమిటీల నిర్మాణానికి పూనుకుంటున్నవారి యెడల తగు జాగ్రత్త వహించాలని, వారు చేసే దుష్ప్రచారానికి లోను గాకుండా పార్టీ ఐక్యతను కాపాడి ప్రజా ఉద్యమాన్ని, వర్గ పోరాటాలను ముందుకు తీసుకొని వెళ్ళవలసినదిగా తాలూకా పార్టీ సభ్యు లందరికి విజ్ఞప్తి చేయడమైనది.

పిడుగురాళ్ళ బ్లాకు కమిటీ సభ్యుడైన శ్రీ కోలా సుబ్బారెడ్డి గత సంవత్సరకాలంగా పార్టీ విచ్ఛిన్న కార్యకలాపాల్లో పాల్గొంటున్నారు. రహస్య సర్క్యులర్లను పంచడం, పార్టీ నాయకత్వంపై బహిరంగంగాను, రహస్యంగాను నీచమైన ఆరోపణలు చేయడం జరుగుతోంది. మెజారిటీ బ్లాకు కమిటీ సభ్యులచే ఎన్నికైన కార్యదర్శి శ్రీ పరబ్రహ్మారాజు గారిని కార్యదర్శి కాదంటూ తానే స్వయంగా కార్యదర్శినంటూ ప్రచరిస్తున్నారు. ఎ. ఐ. టి. యు. సి. ఆధ్వర్యాన పనిచేస్తున్న తాలూకాలోని ట్రేడ్‌యూనియన్లను చీల్చడానికి కృషి చేస్తున్నారు. పంచాయితీఎన్నికల్లో పోటీచేస్తున్న పార్టీ సభ్యులకు వ్యతిరేకంగా పార్టీ వ్యతిరేకులతో కలిసి పనిచేస్తున్నారు. పోటీ పార్టీ కమిటీల నిర్మాణానికి పూనుకుంటూ నాయకులపై తీవ్రమైన నిందారోపణలు చేస్తూ ప్రచారం కావిస్తున్నారు. కాన శ్రీకోలా సుబ్బారెడ్డిగారిని పార్టీ నుండి బహిష్కరిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించడమైనది."

తర్వాత శ్రీ ఆళ్ళగడ్డ కోటంరాజుగారి అకాలమృతికి సంతాపం తెలుపుతూ తీర్మానించారు.

సామర్లకోట కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శి తొలగింపు

సామర్లకోట, మే 16

తూర్పుగోదావరిజిల్లా సామర్లకోట పట్టణ కమ్యూనిస్టుపార్టీ జనరల్‌బాడీ సమావేశం మొన్న శ్రీ పాగా సీతారామయ్య గారి అధ్యక్షతన జరిగింది. సమావేశమునకు సూరుగురు సభ్యులు హాజరైనారు. జిల్లా కమ్యూనిస్టు నాయకులు శ్రీ చిట్టూరి ప్రభాకర చౌదరిగారు జాతీయ సమితి తీర్మానమును, ప్రస్తుత రాజకీయ పరిస్థితులను వివరించారు.

తరువాత పట్టణకమ్యూనిస్టుకమిటీ కార్యదర్శి శ్రీయం. సోమరాజి జాతీయసమితిచే సస్పెండ్ చేయబడిన 32మంది చేసిన ప్రకటనను ఆమోదించుచున్నానని తెలిపారు. మే 3 వ తేదీన పట్టణ కమిటీ సమావేశములో జాతీయ సమితి తీర్మానమును బలపరుస్తూను, పోటీపార్టీ చర్యలను ఖండిస్తూను చేసిన తీర్మానమును ఆయన కూడ ఆమోదించి, యున్నారు. ఇప్పుడు దానికి విరుద్ధముగా, జనరల్ బాడీ సమావేశములో జాతీయసమితి తీర్మానముచేత 32 మంది చేసిన తీర్మానమేనని తాను బలపర్చినానని చెప్పినారు. శ్రీ సోమరాజి పరికొంతనుంచి జనరల్ బాడీ సమావేశమునుండి వెళ్ళిపోయినారు.

తరువాత శ్రీ సోమరాజి చర్యను ఖండిస్తూ వారిని పార్టీసభ్యత్వం నుండి తొలగించి, కార్యదర్శిగా శ్రీ పాగా సీతారామయ్యను, సహాయ కార్యదర్శిగా శ్రీ సిర్రా వెంకటరావును ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

తణుకు తాలూకా గ్రామ కమ్యూనిస్టు శాఖల ఆమోదం

తణుకు, మే 18

తణుకు తాలూకాలోని వేలివెన్ను, ఖండవల్లి, మల్లేశ్వరం, అన్నవరప్పాడు, పెనుగొండ, పెరవలి, కొత్తపల్లి గ్రామ కమ్యూనిస్టు శాఖలు అన్నీ జాతీయ సమితి, 32 మంది సమితి సభ్యులపై తీసుకొన్న నిర్ణయాలను, ప్రదేశ్ సమితి పోటీపార్టీ వారిపై తీసుకొన్న చర్యలను ఆమోదిస్తూ తీర్మానించారు.

వేలివెన్ను గ్రామశాఖ ఇటీవల సమావేశమైనది. 25 మంది హాజరైనారు. జాతీయ సమితి తీర్మానాన్ని ఏక గ్రీవంగా అంగీకరించారు.

ఖండవల్లి గ్రామశాఖ ఇటీవల సమావేశమయింది. 15 గురు హాజరయ్యారు. జాతీయ సమితి తీర్మానం పూర్తిమెజారిటీతో అంగీకరించారు. ఒకరు తటస్థం.

మల్లేశ్వరం, అన్నవరప్పాడు శాఖల సంయుక్త సమావేశము ఇటీవల జరిగింది. 14గురు హాజరైనారు. జాతీయసమితి తీర్మానం ఏకగ్రీవంగా అంగీకరించినారు.

పెనుగొండ పట్టణకమిటీ సాధారణ సమావేశం ఇటీవల 20మందితో జరిగినది. జాతీయ సమితి తీర్మానం ఒకరు వ్యతిరేకించగా మిగతా వారంతా ఏకగ్రీవంగా అంగీకరించారు. అయితే పార్టీ చీలికకు అతనుకూడా వ్యతిరేకించాడు.

పెరవలి గ్రామశాఖ 12 మందితో సమావేశమయ్యింది. జాతీయ సమితి తీర్మానాన్ని ఏకగ్రీవంగా అంగీకరించారు.

ముక్కామల గ్రామశాఖ 11 గురితో సమావేశమయ్యింది, జాతీయసమితి తీర్మానం ఏకగ్రీవంగా అంగీకరించారు.

కొత్తపల్లి శాఖ సమావేశములో జాతీయ సమితి తీర్మానం ఏకగ్రీవంగా అంగీకరించారు.

ప్రతి శాఖకు తాలూకా సమన్వయ కమిటీ తరపున శ్రీ కోటిపల్లి అప్పన్న హాజరయి నివేదికను యిచ్చారు. ప్రతి శాఖలోను పూర్తి చర్చలు జరిగాయి సందేహాలు ప్రశ్నలు సమాధానాలు విన్న తర్వాత తీర్మానాలు చేశారు.

అమలాపురం తాలూకాలో కమ్యూనిస్టు పార్టీ జనరల్ బాడీలు

అమలాపురం, మే 17

తూర్పు గోదావరిజిల్లా అమలాపురం తాలూకా శిరిపల్లిగ్రామ కమ్యూనిస్టుపార్టీ జనరల్‌బాడీ సమావేశం మే 8 వ తేదీన శ్రీ జి. హరికృష్ణగారి అధ్యక్షతన జరిగినది. సమావేశంలో తాలూకాసమితికార్యదర్శి శ్రీచింతపల్లి కృష్ణమూర్తిగారు, జాతీయ సమితి, ప్రదేశ్ సమితులు చేసిన తీర్మానాలను వివరించారు: విచ్ఛిన్నచర్యలు సాగిస్తున్న 32 గురిపైన జాతీయ సమితి చేసిన తీర్మానాన్ని, మన రాష్ట్రంలో పోటీ పార్టీ ఏర్పర్చి పార్టీ విచ్ఛిన్నానికి పూనుకున్నవారిపై ప్రదేశ్ సమితి, తాలూకా కమిటీ చేసిన నిర్ణయాలను ఆమోదిస్తూ తీర్మానించారు. పార్టీ ఐక్యతను, క్రమశిక్షణను కాపాడ వలసినదిగా అన్ని శాఖలను, సభ్యులను కోరారు.

గ్రామ సమస్యలపై శ్రీ జనార్దనరావుగారు మాట్లాడినతర్వాత పంచాయితీ ఎన్నికలపై చర్చించి నిర్ణయం చేయబడింది.

అమలాపురం తాలూకా తాణేలంక గ్రామ కమ్యూనిస్టుశాఖ జనరల్‌బాడీ సమావేశం 10 వ తేదీన మాజీ పంచాయితీ అధ్యక్షులు శ్రీ మసిని నరసింహారావుగారి అధ్యక్షతను జరిగింది. సమావేశములో తాలూకా సెక్రటేరియట్ సభ్యులు శ్రీ రామకృష్ణారావు గారు జాతీయసమితి, ప్రదేశ్ సమితుల తీర్మానాలు వివరించారు. వాటిని ఆమోదిస్తూ తీర్మానించారు పంచాయితీ ఎన్నికలుగూర్చి చర్చించి నిర్ణయాలు తీసుకోబడినవి.

అమలాపురం తాలూకా అనాతవరం గ్రామ కమ్యూనిస్టుశాఖ జనరల్‌బాడీ సమావేశం 11వ తేదీన మాజీ పంచాయితీ అధ్యక్షులు శ్రీ నరసింహమూర్తిగారి అధ్యక్షతను జరిగింది. శ్రీ చింతపల్లి కృష్ణమూర్తిగారు జాతీయసమితి, రాష్ట్రసమితి, తాలూకా సమితుల తీర్మానాలు వివరించారు. వీటిని ఆమోదిస్తూ తీర్మానించారు.

పంచాయితీ ఎన్నికలుగూర్చి చర్చించి ఒక కమిటీని ఏర్పరచారు. (వి. వి.)

రాజమండ్రి 25వ వార్డు కమ్యూనిస్టు పార్టీ శాఖ ఆమోదం

రాజమండ్రి, మే 18

రాజమండ్రి కొత్తపేట యువజనసంఘం ఆఫీసులో శ్రీ మీసాల లక్ష్మణస్వామి అధ్యక్షతను రాజమండ్రి 25వ వార్డు కమ్యూనిస్టు శాఖ సమావేశం జరిగింది.

సమావేశం ప్రారంభంలో ప్రముఖ అభ్యుదయకవి శ్రీ అవసరాల సూర్యారావు అకస్మిక మరణానికి సంతాపం తెలుపుతూ తీర్మానించారు.

శాఖకార్యదర్శి శ్రీబోటుగు సూర్యనారాయణ ఈ మధ్య శాఖనిర్వహించిన కార్యక్రమాలను నివేదించారు, జిల్లాకమ్యూనిస్టుపార్టీ నాయకులు శ్రీ చిట్టూరి ప్రభాకరచౌదరిగారు మాట్లాడుతూ, ప్రపంచ పరిస్థితులపైన జాతీ రాజకీయ పరిణామాలపైన వివరమైన నివేదికనిచ్చారు.

తర్వాత భారత కమ్యూనిస్టుపార్టీ జాతీయ సమితి 32 మందిపై తీసుకున్న శిక్షణచర్యను, ఆంధ్రప్రదేశ్ సమితి 57 మందిపై తీసుకున్న క్రమశిక్షణా చర్యను బలపరుస్తూ తీర్మానించడమైనది. (వి.వి)

జంక్షన్‌లో వడగండ్ల వర్షం

హనుమాన్ జంక్షన్, మే 14

నిన్న మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇక్కడ గాలితో వడగండ్ల వర్షం పడింది. షుమారు ఒక ముప్పావుగంటవరకు పడిందని చెప్పుచున్నారు.

అకస్మాత్తుగా వచ్చిన ఈ వానతో ఆ ప్రాంతాలలో సమీపంలోని తోటలలో కాయలు పూర్తిగా అసగాపెక్కువ భాగం రాలిపోయి ఈ ఘోరంగా విపరీతమైననష్టం కలిగినట్లుగా వార్తలు అందాయి. ఈ వర్షం మూలంగా ఈ ప్రాంత ఎండ వేడిమి కొంత తగ్గిందని నిశ్చింత నున్న ట్లుగా రైతుల అభిప్రాయ పడుచున్నారు.

లేఖలు

గుడ్డ ఎగుమతిలో నష్టాలు: ఆగ్నేయ రైల్వేవారి జవాబు

ఆర్యా,

నెల్లూరు, పరిసర ప్రాంతాలనుండి గత మార్చి 7 వ తేదీ మద్రాసు - హౌరా ఎక్స్‌ప్రెస్‌లో రవాణా చేయబడిన బట్టల(గుడ్డల)బంగీలు బేదపూర్ ప్రమాదంలో చిక్కుపడి ధ్వంసమైన పక్షంలో వాటి ఖరీదును వాపసు చేయాలని కోరుతూ 'విశాలాంధ్ర' దినపత్రిక (మార్చి 24, 1964,లో ఆంధ్రరాష్ట్ర గుడ్డ ఉత్పత్తి-ఎగుమతిదార్ల సంఘ అధ్యక్షులు, శ్రీ ఆసిరెడ్డి అప్పారావుగారు వ్రాసిన ఉత్తరం ప్రచురించబడింది. ఈ ఉత్తరంలో బంగీలు పంపినవ్యక్తులు వారి బంగీలు ధ్వంసమైనందుకుగాను పరిహారాన్ని కోరుతూ రైల్వే యాజమాన్యానికి దరఖాస్తులు పంపినది, లేనిదీ తెలియ చెయ్యకపోవడంవలన యీ విషయానికి సంబంధించిన వివరాలు యిక్కడ సేకరించ లేకపోయినాము. (అంతేకాక ప్రచురించబడిన ఉత్తరంలో సంఘాధ్యక్షుని పూర్తి చిరునామాకూడా యివ్వలేదు.)

ఈ బంగీలు పంపిన వ్యక్తులు రైల్వే నిబంధనల ప్రకారం వారి బంగీలు పోయినందుకుగాని, ధ్వంసమైనందుకుగాని, చెడిపోయినందుకుగాని పరిహారాన్నికోరుతూ దరఖాస్తుపంపేటట్లుగా (మీ దినపత్రికద్వారా) వారికి తెలియ పర్చినట్లయితే ప్రస్తుతం అమలులో వున్న రైల్వే చట్టం ప్రకారం ఆ దరఖాస్తులను విచారించడం జరుగుతుందని విన్నవిస్తున్నాను.

(శ్రీ అప్పారావుగారి చిరునామా,
వీరవాసరం, పశ్చిమగోదావరిజిల్లా, సం.)
ఆర్. దయాల్,
ప్రజా సంబంధాల శాఖాధికారి,
ఆగ్నేయ రైల్వే, కలకత్తా.

బయటికివస్తే మాకు మంత్రులు పనిచూపిస్తారా?

ఆర్యా,

ఇటీవల పక్కవిపక్ష మంత్రి శ్రీ పి. వి. సుబ్బారెడ్డిగారు విజయనగరంలో మాట్లాడిన తీరు, ఉపయోగించిన పదజాలం ఎన్.జి.వో.ల భార్యలకు చాలకష్టంగా వుంది. రోజుకి మూడు అణాలు తెచ్చుకొంటున్న కూలీలగూర్చి ఈ ఎన్. జి. ఓలు? ఆలోచించరేం, అని ప్రశ్నించారు. పదిహేను సంవత్సరాల స్వాతంత్ర్యము తరువాత ఈనాడు ఈ దేశంలో రోజుకి మూడు అణాలు కూలి ఆర్జించేవారు ఉంటారని ఊహించలేక పోయారేమో ఈ ఉద్యోగస్తులు. కాని ఈ నాటికి ఒక మంత్రి దాగివున్న సత్యాన్ని బహిర్గతం చేశాడు. నిజంగా నిరక్షరాస్యులు, డబ్బుతో మంత్రిత్వాన్ని కొనగలిగే ఈమంత్రులలాంటివారు ఉన్నంతకాలం మూడు అణాలు కూలీలు ఉండక ఏమౌతారు? దేశం శ్రేయోరాజ్యం ఎట్లా అవుతుంది?

"ఎన్. జి. ఓ. ల భార్యలు దొరసానుల వలె బయటికిరారు"అని అన్నారు మంత్రి గారు. బయటికిరాలేని పరిస్థితులలో ఉంచిన దెవరు? మా జీవితాలను గూర్చి ఆలోచించిందెవరు? ఉదయం 9 గంటలకి ఇల్లువదలిన ఎన్: జి. ఓ., భర్త రాత్రి 9 గంటలకు ఇల్లు చేరితే-చాలని జీతాలతో, పెరిగే ధరలతో సతమతమవుతూ సమాజంలో తీరని అవమానాలకు గురిఅవుతుండే మాగోడు విన్నదెవరు? కష్టాలను సంతోషంగా స్వీకరించి, బాధలను దిగమ్రింగుకొని, భర్తలకు ధైర్యం చెప్తూ ఇంట్లో ఉండబట్టే నిరాశానిస్పృహలకు గురి అయినా, మా భర్తలు తమ విద్యుక్తధర్మాన్ని చాలు నెరవేర్చగలుగుతున్నారు. ఇట్టివారిని పలకరించే మాట్లాడటం తగదు. నిరుద్యోగ ప్రశ్నని నివారించలేని ఈ మంత్రులు బయటికి వస్తే మాకు తగిన ఉద్యోగాలు చూపించగలరా?

విశాలాక్షి, విశాఖ.

సాలూరులో పోటీపార్టీ

ఆర్యా,

మే 9 వ తేదీ 'జనశక్తి'లో శ్రీకాకుళం జిల్లాలో పార్టీ జనరల్‌బాడీ సమావేశాలు అన్న వార్త చదివాను. ఇతర కేంద్రాలలో సంగతి నాకు తెలియదు. కాని నారాయణపురం సమావేశానికి మూడు తాలూకాలనుండి 103 మంది హాజరైనారు అని వుంది. కాని వచ్చినవారు 32 మంది. ఓటింగు సమయంలో గ్రామంలో వున్న అనేకమంది పార్టీసభ్యులు కానివారు వచ్చినందున జనరల్‌బాడీ గందరగోళము అయింది. అప్పుడు శ్రీ సుందరయ్యగారు కూడా రెండు మూడు పర్యాయాలు చాలా కష్టపెట్టుకొని శ్రీ రామలింగాచారి గారిని హెచ్చరించారు. ముగ్గురు తటస్థులు వున్నారు. అందులో నేను ఒకడిని. నాతో కూడా చాలా సీనియర్ కామ్రేడ్ ప్రజాశక్తి రోజులనుంచి పనిచేసి పార్టీ నిషేధం రోజుల్లో కూడా పార్టీలో పనిచేసిన శ్రీ నారాయణరావు గారూ వున్నారు. మేమిద్దరం సాలూరు తాలూకాకు సంబంధించిన వారం. మాతో ఒక బొబ్బిలి కామ్రేడు పాల్గొన్నాడు.

జాతీయ, అంతర్జాతీయ విషయాలపై శ్రీ సుందరయ్యగారు మాట్లాడిన తరువాత రెండవపైపు వాదనలు కూడా విని మరీ నిర్ణయానికి రాదలచి వ్యతిరేకంగాగాని, అనుకూలంగాగాని ఓటు చేయక మధ్యస్థంగా వున్నాము.

బాధాకరమైన విషయమేమంటే 1955 లో ప్ర. సో. పార్టీలో చీలికలువచ్చి డాక్టరు లోహియావర్గం మాకే పార్టీలో అత్యధిక మెజార్టీవుంది అంటూ పార్టీనుండి విడిపోయి పోటీపార్టీని స్థాపించారు. ఫలితం విడిపోయిన ముఖ్యులు శ్రీ సంజీవరెడ్డిగారికి జోలపాటపాడుతున్నారు. తరువాత జరిగిందేమిటి? ఆంధ్రదేశంలో ప్రజాసోషలిస్టుపార్టీ, సోషలిస్టుపార్టీలు నామరూపాలులేకుండా పోయాయి. అప్పట్లో ఈ వివాదాలు అసహ్యించుకొన్న నన్ను, క్రమశిక్షణతో పని చేస్తున్న కమ్యూనిస్టు పార్టీ ఆకర్షించింది. చేరాను. అప్పట్లో ప్ర. సో. పార్టీకి ఏమి జరిగిందో యిప్పుడు పోటీ కమ్యూనిస్టు పార్టీకికూడా అదే జరుగుతుంది.

బొర్రా వెంకటరాజు, ట్రేడ్ యూనియన్
కార్యకర్త, సాలూరు చిన్నమైన్ రోడ్.

పోటీపార్టీ నాయకులకు కావలసిం దేమిటి?

ఆర్యా,

ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టుపార్టీని చీల్చి, పోటీపార్టీని స్థాపించిన నాయకులకు నిజంగా కావలసిం దేమిటో దురూహ్యంగా వుంది.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన ప్రతిపక్షంగావున్న కమ్యూనిస్టుపార్టీని చీల్చటంద్వారా వీరు కాంగ్రెసుకు సహాయపడినవారు అవుతున్నారు. కమ్యూనిస్టుపార్టీని చీల్చుతున్న ఈ నాయకుల చర్యలుచూసి అభివృద్ధినిరోధకులు సంబరపడుతూ పండుగ చేసుకొంటున్నారు.

పోటీపార్టీ నాయకుల మనస్తత్వాన్ని అర్థం చేసుకొనడానికి వారు గత పది, పన్నెండు సంవత్సరాలుగా ఏ రంగాన్ని ఎంచుకొని పని చేస్తూ వచ్చారో పరిశీలిస్తే, కొంతవరకు ఉపకరిస్తుందని భావిస్తున్నాను.

శ్రీ పుచ్చలపల్లి సుందరయ్యగారు 1952 నుంచి ఇప్పటివరకు అటు రాజ్యసభలోనూ, ఇటు శాసనసభలోను, సభ్యులుగా వుంటున్నారు. శ్రీ మాకినేని బసవపున్నయ్యగారు 1952 నుంచి ఈనాటివరకు ఏకధాటిగా రాజ్యసభ సభ్యులుగా వుంటున్నారు. కాని ఎందు చేతనోగాని వీరి వాణి రాజ్యసభలో మనకు విన్పించడములేదు. శ్రీ తరిమెల నాగిరెడ్డిగారు, శ్రీ గుంటూరు బాపనయ్యగారు 1952 నుంచి ఇప్పటివరకూ - మధ్యలో రెండేళ్ళు మినహాయిస్తే శాసనసభా రంగంలో వుంటున్నారు. శ్రీ నందూరు ప్రసాదరావుగారు ఐదేళ్ళపాటు రాజ్యసభ సభ్యులుగా వున్నారు. శ్రీ మోటూరు హనుమంతరావుగారు1952నుంచి 1955 వరకు శాసనసభ సభ్యులు. ఈమధ్య రాజ్యసభకు జరిగిన ఎన్నికలలో పార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా పోటీచేసి, పార్టీ క్రమశిక్షణను అతిక్రమించిన తీరునుబట్టి చూస్తే, వీరికి రాజ్యసభ సభ్యత్వం మీద ఎంత మమకారం వుందో బోధపడుతుంది.

ప్రజాఉద్యమాలను నిర్మించకుండా, శాసనసభలోను, పార్లమెంటులోను కూర్చుంటూ, కాంగ్రెసు గుత్తాధికారాన్ని వీరు దెబ్బ తీస్తారా? కష్టజీవుల బ్రతుకులను ఉద్ధరించే మార్గం ఇదేనా?

మహా విశాలాంధ్రోద్యమం వంటి ఆందోళనోద్యమాలను కమ్యూనిస్టుపార్టీ నిర్మిస్తుంటే. "మంత్రాలకు చింతకాయలు రాలుతాయా" అంటూ ఈసడించటం తప్ప ఈ నాయకులకు వేరే కార్యక్రమం వుందా? వేదికెక్కి ఉపన్యసించే కాలం గడిపిస్తే విప్లవం పుట్టుకొస్తుందా?

ప్రభుత్వం నియమించిన వేతన సంఘంలో ఎన్. జి. వో.ల తరఫున పోరాడమని పంపిస్తే శ్రీ సుందరయ్యగారు ఆ పని చేయడానికి మారు ప్రభుత్వ ప్రతినిధులు చెప్పిందానికి తలూపి, సంతకం పెట్టారు. ప్రజల ప్రతినిధి ప్రవర్తించవలసిన తీరు ఇదేనా? ప్రభుత్వ పరిశ్రమల నిర్వహణ సరిగా జరిగేటట్లు చూడమని పరిశ్రమల సంఘంలోకి పంపిస్తే శ్రీ సుందరయ్యగారు, ఆ పని చేయడానికి బదులు, రాజమండ్రి పేపరుమిల్లు సప్లై కర్మాగారంలోని వ్యవహారాలను పోరాటానికి బదులు, ప్రయివేటు పెట్టుబడిదారులచేతుల్లో మొత్తానికి కాక ఎక్కువ మొత్తానికి అమ్మవలసినదని ముఖ్యమంత్రికి ఉత్తరం వ్రాశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రతిఘటించేది ఇదేనా? ఈ మధ్య రాష్ట్రవ్యాపితంగా జరిగిన సత్యాగ్రహ పోరాటంలో శ్రీ సుందరయ్యగారు నిర్వహించిన పాత్ర ఎలాంటిది?'ప్రజలు సిద్ధంగాలేరు' అనేసాకుతో ఆయన అదిలో సత్యాగ్రహ పోరాటాన్ని ప్రారంభించరాదని వాదించాడు. తీరా ఉద్యమం ప్రారంభమైన వేల సంఖ్యలో ప్రజలు సత్యాగ్రహ పోరాటంలో ఉత్సాహంగా పాల్గొంటున్న సమయంలో, ప్రభుత్వంతో రాజీ పడదామంటూ వాదించారు. ఉద్యమం విస్తృత పడుతుంటే, ఆందోళన చెందిన ప్రభుత్వం రాజీకి ఆతురత చెందుటంలో అర్థం వుంది. కాని ఉద్యమానికి నాయకత్వం వహించవలసిన శ్రీ సుందరయ్యగారు కూడా ప్రభుత్వంతోపాటు, రాజీకి ఎందుకు అంతగా తహతహలాడారు? కమ్యూనిస్టుపార్టీలో చీలిక తేవడానికి తన పక్షం పాటుపడుతున్నదని ప్రభుత్వ బజెనికి బాహాటంగా తెలియచేస్తూ, తన ముఖా అభ్యర్థిని రాజ్యసభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థికి ప్రతిరేకంగా పోటీ పెట్టించారు. దాంతో ప్రభుత్వపక్షం కొండెక్కి కూర్చున్నదంటే, తప్పు దానిదా? శ్రీసుందరయ్యగారిదా? పెద్దయెత్తున జరుగుతున్న సత్యాగ్రహోద్యమం వ్యర్థమైన దిగజారిపోయిందంటే. దానికి బాధ్యులు ప్రజలా? లేక శ్రీ సుందరయ్యగారు సాగించిన విచ్ఛిన్నకర పర్యటనలా? ప్రజోద్యమాలను తీసుకుపోయే మార్గమేనా ఇది? శ్రీ సుందరయ్యగారికి కావలసింది ప్రజాఉద్యమాభివృద్ధా? తనమతాభివృద్ధా?

ఈ విషయాలన్నింటిని కమ్యూనిస్టుపార్టీ సభ్యులు, సానుభూతిపరులు, ప్రజలు ప్రశాంతంగా ఆలోచించవలసిన అగత్యం ఎంతైనా వుంది.

పరుచూరి కోటేశ్వరరావు,
విజయవాడ.

పోటీ యువజన సంఘం

ఆర్యా,

1957 సం॥ నుండి విజయవాడ హనుమాన్‌పేటలో పట్టణ యువజనసంఘ అనుబంధ సంస్థగా యువజనసంఘం ఏర్పడి పని చేస్తూ ఉన్నది. 1957 నుండి 1961 వరకు శ్రీ పొక్కానం ప్రభాకరరావు, శ్రీ గుండిమెడ తిరుమలేశ్వరరావుగార్లు అధ్యక్ష, కార్యదర్శులుగాను, 1961 నుండి 64 వరకు శ్రీ కె. దాబులాల్, శ్రీ జి. తిరుమలేశ్వరరావుగార్లు అధ్యక్ష, కార్యదర్శులుగా నూతన కమిటీ ఏర్పడి పని చేసింది.

1964 సంవత్సరంలో నూతన కమిటీ ఏర్పడి పని చేస్తూ ఉంది. యువజన సంఘ నిబంధనావళి ప్రకారం ఎలాంటి రాజకీయ సంస్థలతోను యువజనసంఘానికి నిమిత్తం లేకుండా అనేక ప్రజాహిత కార్యక్రమాలలో ప్రజలకు సేవచేస్తూ ఐక్యంగాఉన్న యువజన సంఘాన్ని యువజనసంఘకమిటీకి సంబంధం లేకుండా ది 6-5-64 న కమ్యూనిస్టుపార్టీ గుర్తుగల కరపత్రంలో విజయవాడ 2 టౌన్‌లోని ఆంధ్రప్రభ ఆఫీసుకు ఎదురుగా కమ్యూనిస్టుపార్టీ బహిరంగసభను ఏర్పరచి హనుమాన్‌పేట యువజనసంఘం పేరుతో ఎవరో అధ్యక్ష, కార్యదర్శులు గాను కరపత్రం వేయటం జరిగింది.

మా హనుమాన్‌పేట యువజన సంఘానికి, మా అధ్యక్ష, కార్యదర్శులకు ఆ కరపత్రంలో ఉదహరించిన యువజన సంఘానికి నాట్టి బహిరంగసభ కార్యకలాపాలకు ఎలాంటి సంబంధం లేదని తెలియజేస్తున్నాము.

అధ్యక్షుడు: యస్. కోటయ్య
కార్యదర్శి: ఎ. వెంకటేశ్వర్లు
హనుమాన్‌పేట యువజన సంఘం
15-5-64, విజయవాడ

పంచాయతీ ఎన్నికలు: ఓటర్లలిస్టులు

ఆర్యా,

ఈ నెల 18 వ తేదీతో రాష్ట్రంలో గ్రామ పంచాయితీ ఎన్నికల సంరంభం ప్రారంభమయ్యాయి.

ఈ ఎన్నికల నిర్వహణలో కొన్ని లోపాలు వున్నవి. గ్రామ పంచాయితీల ఎన్నికల నిర్వహణ ఆ పంచాయితీ సమితి ఉద్యోగులకే అప్పగించటం జరిగింది. ఇందువల్ల లోగడే సమితి అధికారులతో సంబంధాలు వున్న పంచాయితీ ప్రెసిడెంట్లుగాని గ్రామ పెత్తందార్లు కాని తమ పరిచయాన్ని ఉపయోగించి అధికారులను మొహమాటపెట్టి ఎన్నికల ఫలితాలు తమ కనుకూలంగా చేసుకొనే ప్రమాదం వున్నది. (ఉదాహరణకు ఉండవల్లి) గ్రామ పంచాయితీలో యిప్పుడు పెత్తనం వహించుతున్నవారు తమ ప్రత్యర్థులకు సీటు దక్కకుండా చేసే దురుద్దేశ్యంతో షెడ్యూల్‌కులాలకు సంబంధించిన సీటును అసలు ఆ కులాలవారు లేనివార్డుకు కేటాయించుతూ నిర్ణయించారు. ప్రత్యర్థులు ఈ మోసాన్ని సకాలంలో తెలుసుకొని వాస్తవ పరిస్థితిని నిరూపించి ఆ సీటు మార్పించుకొన గలిగారు. ఇటువంటిమోసాలే మరికొన్ని జరిగటానికి అవకాశం వున్నది. కాబట్టి ప్రభుత్వం ఒకపంచాయతీసమితిఏరియాలో ఎన్నికల బాధ్యతను నిర్వహించటానికి వేరొక పంచాయతీ సమితి ఉద్యోగులను నియమించాలి. అట్లా నియమించితే గ్రామ పెత్తందార్లను తంత్రాలనుంచి ఓటర్లను దూరంగా వుంచినట్లువుతుంది. అందువల్ల కొన్ని అక్రమ చర్యలు అరికట్ట వీలుకలుగుతుంది.

అలాగే ఓటర్లలిస్టులు. మొత్తం నియోజకవర్గం లిస్టులను ఖరీదు చేస్తేనే యిస్తాము అని చెప్పటం పంచాయితీ ఎన్నికలు ఆవరణలో ధనవంతులకు, పెత్తందార్లకు వినియోగించటమే జరుగుతుంది. కాబట్టి పార్టీ ప్రాతిపదికగా ఓటర్లలిస్టులు అమ్మకానికి ఏర్పాటు చేయవలసినదిగా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

చిమ్మని నాగభూషణం,
కార్యదర్శి, పట్టణ చేనేత సంఘం,
మంగళగిరి.

మే 14 న మధ్యాహ్నం వర్షం, వరిగడ్డి ఎక్కించుకొని ప్రయాణము చేయుచున్న ఒక లారీ కంచికచర్ల గ్రామంలో పోస్టుమంగా ప్రమాదవశాత్తు నిప్పంటుకుని కాలిపోయినది. లారీ మొత్తం, అందులో యున్న వస్తు-గడ్డిపూర్తిగా కాలిపోయినది. పీనెపల్లి సంఘమైనం దూరాయల నష్టము కలిగినది.

ఆంధ్ర బాల్ బాడ్మింటన్ సంఘ కార్యవర్గం

గుడివాడ, మే 18

డాక్టర్ చంద్రమౌళి సత్యనారాయణగారి అధ్యక్షతన మే 14 వ జరిగిన ఆంధ్రా బాల్ బాడ్మింటన్ సంఘమువారి జనరల్‌బాడీలో క్రింది నూతన కార్యవర్గం ఎన్నికయింది.

అధ్యక్షుడు: శ్రీ ముప్పన రామారావు (పెద్దాపురం), ఉపాధ్యక్షులు: డాక్టరు చంద్రమౌళి సత్యనారాయణరావు, (తెనాలి.) శ్రీ పెదసింగు నాగేశ్వరరావు (బందరు), శ్రీ పి. బాలకృష్ణ (నూజివీడు), శ్రీ పి. ఎస్. శాస్త్రి (గూడూరు), శ్రీ ఎస్. రామచంద్రరాజు (రామచంద్రపురం), కార్యదర్శి, కోశాధికారి; శ్రీ అడుసుమిల్లి రామమోహనరావు (గుడివాడ) సంయుక్త కార్యదర్శులు; శ్రీ కె. ఎ. శర్మ (గుడివాడ), శ్రీ టి. అవధాని (తెనాలి).

శ్రీ ఆళ్లగడ్డ కోటంరాజు మృతి

కాట్రపాడు, మే 17

గుంటూరు జిల్లా, పల్నాడు తాలూకా కాట్రపాడు గ్రామ కమ్యూనిస్టుశాఖ కార్యదర్శి శ్రీ ఆళ్ళగడ్డ కోటంరాజుగారు మే 10వ తేదీన మృతిచెందారు. వీరి వయస్సు 73 సం॥లు. వీరు 1942 లో పార్టీ సభ్యునిగా చేరారు. చనిపోయేవరకు గ్రామ శాఖా కార్యదర్శిగా పనిచేస్తూ వచ్చారు. మధ్యతరగతి కుటుంబానికి చెందినప్పటికి గ్రామంలో పెత్తందారులకు వ్యతిరేకంగా రైతు కూలీపక్ష పోరాటాల్లో పేదల తరఫున నిలబడి పని చేశారు. 1948 - 50 సం॥ల నిర్బంధ కాలంలో అనేక మార్లు అరెస్టు అయి జైలులో నిర్బంధింపబడ్డారు. మొక్కవోని ధైర్యంతో పని చేసిన కారణాన ఆయనతోపాటు ఆ గ్రామంలోని వృద్ధులుపిల్లలుకూడా నిర్బంధ కాలంలో అరెస్టులు అనేక చిత్రహింసలకు గురి చేయబడ్డారు. ఆ గ్రామ పంచాయితీకి పేద ఇరువై అయిదు సంవత్సరాలు ప్రెసిడెంటుగా పనిచేశారు. పేదకి ముగ్గురు అబ్బాయిలు. పార్టీ సభ్యురాలైన సతీమణి మొదలైన వున్నారు. వీరిమృతికి ఆ గ్రామశాఖ, తాలూకా కమ్యూనిస్టుకమిటీ సానుభూతి సంతాపాలను తెలియచేస్తూ తీర్మానించాయి.

సభలు - సమావేశాలు

హైదరాబాద్ మహాసభ అర్గనైజింగ్ కమిటీ తరఫున ఢిల్లీ వెళ్ళిన రాయబారవర్గ సభ్యులు అచట జరిపిన కృషిని వివరించుటకు మే నెల 20 వ తేదీ సాయంత్రం 5 గంటలకు గుంటూరులో నరహరి అండ్ చౌదరి కంపెనీ ఆవరణలో పొగాకు రైతుల, వ్యాపారస్థుల సమావేశం జరుగుతుంది.

* * *

విజయవాడ శ్రీ లక్ష్మి అష్టవినోద క్లబ్ తృతీయ వార్షికోత్సవం మే 24 న 5 గంటలకు శ్రీ రామమోహన్ లైబ్రరీహాలులో జరుగుతుంది. శ్రీ బందా కనకలింగేశ్వరరావుగారు అధ్యక్షత వహిస్తారు. 7 గంటలకు కుమారి విజయమూరి లక్ష్మీ లలిత సంగీతం; 7-45 గంటలకు "మహాపల్లియం"అనే చారిత్రాత్మక నాటక ప్రదర్శన వుంటుంది.

* * *

గుంటూరు జిల్లా వేటపాలెం బండ్లమాయమ్మ హిందూహయ్యర్ ఎలిమెంటరీస్కూలు పాత విద్యార్థి సంఘవార్షికోత్సవము ఈ నెల 24 వ తేదీ జరుగుతుంది.

వ్యవసాయ వస్తు ధరలు

విజయవాడ, మే 19

విజయవాడ రీజనల్ అసిస్టెంట్ డైరెక్టర్ మార్కెటులో నేడు అందజేసిన ఉత్పత్తిదారులనుండి కొనుగోలుచేయుబోవు ధరలు. (ఒక క్వింటాల్ 100 కిలోగ్రాములు. లేక 220½ పౌనులు)

ధాన్యం

సంబర్లు:	విజయవాడ	రు. 44 67	33 50
„	కాకినాడ	45 33	34 00
„	చిత్తూరు	50 66	33 00
అక్కుళ్లు:	విజయవాడ	38 67	25 00
„	తాడేపల్లిగూడెం	—	—
„	కాకినాడ	39 33	29 88
„	ఆముదాలవలస	—	—
నన్నకృష్ణకాటుకలు:	తాడేపల్లిగూడెం	40 66	31 75
నన్నాలు:	ఆముదాలవలస	—	—
మొలకొలుకులు:	నెల్లూరు	—	—

మిల్లు బియ్యం

సంబర్లు:	విజయవాడ	రు. 74 00
„	కాకినాడ	72 14
అక్కుళ్లు:	విజయవాడ	62 00
„	తాడేపల్లిగూడెం	—
„	కాకినాడ	63 68
„	ఆముదాలవలస	—
నన్నకృష్ణ కాటుకలు:	తాడేపల్లిగూడెం	—
సంబర్లు:	చిత్తూరు	80 64
నన్నాలు:	ఆముదాలవలస	—
మొలకొలుకులు:	నెల్లూరు	69 35

వేరుశనగ

కాయలు	విజయవాడ	63 67
„	నంద్యాల	81 25
„	ఆదోని	82-00
„	విజయనగరం	73 32
పప్పు	విజయవాడ	97 25
„	నంద్యాల	106 25
„	ఆదోని	107 00
„	విజయనగరం	114 66
నూనె	విజయవాడ	212 50
„	నంద్యాల	202 50
„	ఆదోని	202 00
„	విజయనగరం	217-68

అపరాలు

కందులు:	విజయవాడ	రు. 77 50
„	గుంటూరు	78 00
„	ఆముదాలవలస	67-74
మినుములు:	విజయవాడ	65 50
„	గుంటూరు	71 00
„	ఆముదాలవలస	59-16
పెసలు:	విజయవాడ	80 00
„	గుంటూరు	76 00
„	ఆముదాలవలస	74-19
శనగలు:	విజయవాడ	63 22

జొన్నలు

అనంతపురం:	తెల్లవి	48 00
నంద్యాల:	పచ్చవి	42 00

బెల్లం

అనకాపల్లి:	మొదటిరకం	—
„	మూడవరకం	—
చిత్తూరు	మొదటిరకం	76 66
„	మూడవరకం	58 66

జీడిపప్పు

మోరి:	అమెరికన్‌రకం	రు. 563 00
„	దేశవాళి	514 00
„	బద్దలు	477 00
„	ముక్కలు	418 00

మిర్చి

22 ఒకటవ రకం గుంటూరు	184 00
జి రెండు 2వ రకం „	172 00
జి2 తర్ల రకం „	—

నెయ్యి

	పల్నాడు	దేశవాళి
గుంటూరులో	555 00	565 00

కొబ్బరికాయలు

(వెయ్యింటికి ధరలు)	కొత్తవి:	పాతవి
విజయవాడ:	165 00	215 00
రాజమండ్రి	140 00	190 00
పాలకొల్లు	165 00	205 00

పసుపు

దుగ్గిరాలలో:	కొమ్ములు	రు. 132 00
„	కాయ్పారు	145 50
„	దుంపలు	100 00
కడపలో	కొమ్ములు	120 00
„	దుంపలు	100 00

జనపనార

విజయనగరం:	మొదటిరకం	66 98
	రెండవరకం	61 62
	మూడవరకం	54 93
ఆముదాలవలస	మొదటిరకం	60 68
	రెండవరకం	58 00
	మూడవరకం	55 33

జగ్గయ్యపేటలో పంచాయితీ అధ్యక్షుని ముఠా దౌర్జన్యాలు

పంచాయతీ ఎన్నికల సందర్భంలో గ్రామ సేవాసంఘం అభ్యర్థిపై దాడి

జగ్గయ్యపేట, మే 18

జగ్గయ్యపేట తాలూకాలో పంచాయతీ ఎన్నికలు సమీపించే కొలది కమ్యూనిస్టు తదితర అభ్యుదయవాదులపై దౌర్జన్యకాండ మితిమీరుతున్నది.

జగ్గయ్యపేట పంచాయతీ ఎన్నికలలో కాంగ్రెసు, కమ్యూనిస్టు, తదితర గ్రామాభివృద్ధిని కాంక్షించే పెద్దలందరూ గ్రామ సేవా సంఘంగా ఏర్పడి పోటీచేస్తున్నారు. ఈ సందర్భంలో ఎన్నికలు శాంతియుతంగాసాగితే తాము గెలవలేమనే భయంతో ప్రస్తుత పంచాయతీ అధ్యక్షుడైన సామినేని విశ్వనాథం ముఠా దౌర్జన్య చర్యలకు దిగింది. పంచాయతీ బోర్డు మెంబరు పి. మా. కోటేశ్వరరావు డ్యూటీలోవున్న సమయంలోనే శ్రీ పోలకం రాముడు అనే వ్యక్తిని కొట్టారు. ఈ సమయంలో అధ్యక్షుడు సామినేని విశ్వనాథం ఆ సమీపంలోనే వుండి కొట్టించాడు.

స్థానికుడైన మువ్వాల నరసింహారావు డిప్యూటీ పంచాయతీ ఆఫీసరు ఉద్యోగం చేస్తూ కూడా తన ఉద్యోగానికి శలవు పెట్టి ఇక్కడ విశ్వనాథం ముఠాకు బాహాటంగా ఎన్నికల కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

అంతేగాక, అతని కొంతమందితో కలిసి ఈనెల 16 వ తేదీన సాయంత్రం గ్రామ సేవా సంఘం అభ్యర్థి శ్రీ సామినేని సర్వయ్యగారిని కొట్టారు.

వీరి దౌర్జన్యకాండ ఈ విధంగా సాగితే పంచాయతీ ఎన్నికలు శాంతియుతంగా జరగవని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అంతేగాక చిల్లకల్లువద్ద శాసనసభ్యులు శ్రీ పిల్లలమర్రి వెంకటేశ్వర్లుపై హత్యా ప్రయత్నం, ప్రస్తుతం సాగిస్తున్న దౌర్జన్యకాండ చూస్తే ఇదంతా ముందుగానే ఆలోచించి నిర్ణయించుకున్న ఒక పథకం ప్రకారం జరుగుతున్నట్లు ప్రజలు సందేహిస్తున్నారు.

ముత్తినేని నాగయ్య ముఠా చర్యలు

శాసన సభ్యులు శ్రీ పిల్లలమర్రి వెంకటేశ్వర్లుపై జరిగిన హత్యాప్రయత్నం కేసులో అరెస్టు చేయబడిన ముత్తినేని నాగయ్య ముఠాకు చెందినవారు తమ మామిడితోటలను తామే నరుక్కొని ప్రత్యర్థులపై కేసులు పెట్టటానికి ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది.

శ్రీ పిల్లలమర్రి ఆరోగ్యం

శ్రీ పిల్లలమర్రి ఆరోగ్యం గురించి తెలుపవలసిందిగా కోరుతూ అనేక మంది ఉత్తరాలు, టెలిగ్రాములు వ్రాస్తున్నారు. శ్రీ పిల్లలమర్రి ఆస్పత్రిలో క్రమంగా కోలుకొంటున్నారు.

(వి. వి.)

శ్రీ పిల్లలమర్రిపై హత్యాప్రయత్నానికి బాధ్యుల్ని శిక్షించాలి

శ్రీ జోస్యభట్లసత్యనారాయణ ప్రకటన

హైదరాబాద్, మే 17

కార్మిక నాయకుడు, ప్రముఖ కమ్యూనిస్టు శాసన సభ్యుడూ అయిన శ్రీ పిల్లలమర్రి వెంకటేశ్వర్లుపై జరిగిన హత్యా ప్రయత్నం దారుణ సంఘటనని ఖండిస్తూ, ఆంధ్ర ప్రదేశ్ ట్రేడ్‌యూనియన్ కౌన్సిల్ కార్యదర్శి శ్రీ జోస్యభట్ల సత్యనారాయణ ఈ దిగువ ప్రకటన చేస్తున్నారు:

"శ్రీ పిల్లలమర్రిపై హత్యాప్రయత్నం జరిగి ఆయన హాస్పిటల్‌లో ఉన్నారన్నవార్త కార్మికవర్గాన్ని కలవరపరచింది. కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాన్ని అమలు జరపడం, ఆయన కార్మిక సంఘాలను నిర్మించడం కార్మికుల అభివృద్ధికి కృషిచేయడం ద్వారానే ప్రారంభించారు. చాల కాలం ప్రదేశ్ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ నాయకుడుగా పని చేశారు. ఇప్పుడు శాసన సభ ద్వారా కార్మికుల కోర్కెలను ప్రతిబింబిస్తున్నారు. అటువంటి ప్రజాసేవకుడుగా, కార్మిక సేవకుడుగా పనిచేయడానికి జీవితాన్ని అంకితం చేసిన శ్రీ పిల్లలమర్రి తన కార్మిక సేవను కొనసాగించడానికి త్వరలో కోలుకుంటారని ఆశిస్తున్నాను, యీ దారుణం జరిపిన వారందరిపైనా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను."

బర్మాలో భారత రాయబారిగా శ్రీ కటారి నియామకం

న్యూఢిల్లీ, మే 18

భారత మాజీ నావికాదళ అధిపతి శ్రీ కటారిని బర్మాలో భారత రాయబారిగా నియమించారు. త్వరలోనే ఆయన తన నూతన బాధ్యతలను స్వీకరిస్తారని తెలుస్తోంది.

కాశ్మీర్ విషయంలో స్వతంత్రపార్టీ వైఖరి

కార్యవర్గం నిర్ణయిస్తుందట

మద్రాసు, మే 18

కాశ్మీర్ సమస్యపై స్వతంత్రపార్టీ అవలంబించే నిర్దిష్ట వైఖరిని జూన్ 29, 30 తేదీలలో బొంబాయిలో జరిగే పార్టీ కేంద్ర కార్యవర్గం నిర్ణయిస్తుందని పార్టీ ప్రధాన కార్యదర్శి ఎమ్. ఆర్. మసానీ నేడు పత్రికలవారితో అన్నారు.

కేరళ కాంగ్రెసు అధ్యక్ష ఎన్నిక

జూన్ 14 వ తేదీ జరపాలని శ్రీ కామరాజ్ ఆదేశం

బొంబాయి, మే 18

కేరళప్రదేశ్ కాంగ్రెసు కమిటీ అధ్యక్షుణ్ణి ఎన్నుకొనేందుకు జూన్ 14 వ తేదీన సమావేశం జరపవలసిందిగా కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ కామరాజ్ కేరళ కాంగ్రెసును ఆదేశించారు.

కొంతకాలం క్రితం కేరళ కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడు శ్రీ కె. పి. మాధవన్ నాయర్ రాజీనామా సమర్పించిన విషయం పాఠకులకు విదితమే.

జూన్ 14 వ తారీఖున రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్ష ఎన్నికను పర్యవేక్షించడానికి అఖిల భారత కాంగ్రెసు కమిటీ ఒక పరిశీలకుని పంపుతుంది. ఈ సమావేశానికి కేరళ కాంగ్రెసు ఉపాధ్యక్షులు అధ్యక్షత వహిస్తారు.

సింహళంలో మిశ్రమ ప్రభుత్వ స్థాపన

వచ్చే రెండు వారాలలోనే జరగనున్నట్లు పెరీరా వెల్లడి

కొలంబో, మే 18

వచ్చే రెండు వారాలలోనే సింహళంలో మిశ్రమ ప్రభుత్వం యేర్పడనున్నట్లు లంక సమసమాజపార్టీ నాయకుడు పెరీరా ఉపన్యాసంవల్ల తెలుస్తూవుంది.

సింహళంలో మిశ్రమ ప్రభుత్వ యేర్పాటును గురించి ప్రభుత్వ పార్టీ అయిన లంక ఫ్రీడంపార్టీకి వామపక్ష ఐక్య సంఘటనకూ మధ్య గత రెండు నెలలుగా సాగుతున్న సంభాషణలు బహుశా ఈ వారంలో ముగియవచ్చునని మహాజన ఏకసత్తా పెరమున పార్టీ పత్రికద్వారా తెలుస్తూవుంది.

వామపక్ష ఐక్యసంఘటనను స్థాపించిన వాటిలో ఈ పార్టీకూడా ఒకటి.

కాటరగామానుండి సింహళ ప్రధానమంత్రి శ్రీమతి బండారనాయకే తిరిగివచ్చినప్పటి నుండి రాజకీయ పరిస్థితిపై సంభాషణలు కొనసాగుతాయని ఈ పత్రికద్వారా తెలుస్తూవుంది.

వచ్చే రెండు వారాలలోనే సింహళంలో మిశ్రమ ప్రభుత్వం యేర్పడనున్నట్లు లంక సమసమాజపార్టీ నాయకుడు పెరీరా ఉపన్యాస ప్రకటన మూలంగా తెలుస్తున్నది.

మంచి జీవిత పరిస్థితులను తాము కల్పించగలమని ప్రజలకు తాము రుజువు చేయగలమని కూడా ఆయన తన ఉపన్యాసంలో పేర్కొన్నారు. వామపక్ష ప్రభుత్వ స్థాపనకు ఇది ఒక హేతుబద్ధమైన చర్యగా ఆయన పేర్కొన్నారు.

పెల్మదుల్లా ప్రాంతంలో లంక సమసమాజ పార్టీకి చెందిన యువజనసంఘం కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తూ పెరీరా పై విధంగా చెప్పారు.

శ్రీ పి. వి. జి. రాజు ఆరోగ్య పరిస్థితి

ఆందోళన చెందనవసరం లేదని వైద్యుల ప్రకటన

చండీఘర్, మే 18

శ్రీ పి. వి. జి. రాజు ఆరోగ్యాన్ని గురించి నేటుదయం ఒక వైద్య ప్రకటన చేస్తూ ఆయన నాడి, శ్వాస, రక్తపుపోటు, శరీర ఉష్ణోగ్రత సంతృప్తికరంగా వున్నాయని తక్షణమే ఆందోళన పడవలసిన అవసరం లేదని డాక్టర్లు ప్రకటించారు.

ఆయనకు తగిలిన దెబ్బయొక్క తీవ్రతను దృష్టిలోకి తీసుకుంటే ప్రస్తుత అభివృద్ధి సంతృప్తికరమైనదేనని కూడా ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

శ్రీ రాజుకు యింతవరకూ స్పృహరాలేదు. పంజాబు ముఖ్యమంత్రి నేడు ఉదయం కూడ ఆస్పత్రికి వెళ్లి శ్రీ రాజు ఆరోగ్య పరిస్థితిని గురించి తెలుసుకున్నారు.

శ్రీ బ్రహ్మానందరెడ్డి చండీఘర్ పయనం

హైదరాబాద్, మే 18

ఆంధ్ర ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి శ్రీ పి. వి. జి. రాజును చూడటానికి రేపు చండీఘర్ బయలుదేరి వెళుతున్నారు. మే 20 తేదీవరకు శ్రీ బ్రహ్మానందరెడ్డి చండీఘర్‌లో ఉంటారు. శ్రీ బ్రహ్మానందరెడ్డి ఎ. ఐ. సి. సి. సమావేశానికి హాజరై నేడే హైదరాబాద్ వచ్చారు.

నేపాల్ రాజుతో నెహ్రూ సంభాషణ

న్యూఢిల్లీ, మే 18

ప్రధాని నెహ్రూ ఈవేళ సాయంత్రం ఢిల్లీలోని నేపాల్ రాయబార కార్యాలయానికి వెళ్ళి నేపాల్‌రాజు మహేంద్రను కలుసుకొని మాట్లాడారు. ఈ సంభాషణలు సుమారు ముప్పావు గంటసేపు జరిగాయి.

ఏ. ఐ. సి. సి. సమావేశంలో పాల్గొని ప్రధాని నెహ్రూ బొంబాయినుండి ఈవేళే ఢిల్లీ తిరిగి వచ్చారు.

కేరళ పోస్టు, టెలిగ్రాఫ్ ఉద్యోగుల మహాసభ

త్రిచూర్, మే 18

జూన్ 1 వ తేదీన వేతనాల సమ్మెను జరపాలని పోస్టు అండ్ టెలిగ్రాఫ్ ఉద్యోగుల సమాఖ్య నిర్ణయాన్ని కేరళ రాష్ట్ర మహాసభ బలపరిచింది.

మూలవిధానాలను బలపరుస్తున్నామంటూనే చీలికతేవడం ఎందుకు?

పోటీ పార్టీవారికి శ్రీ భూపేష్ ప్రశ్న

తిరువనంతపురం, మే 18

భారత కమ్యూనిస్టుపార్టీలో బహిరంగ వాదప్రవాదాలు ఆపివేయాలని, పార్టీ కేంద్ర కార్యవర్గసభ్యుడు శ్రీ భూపేష్‌గుప్త నేడు ఒక పత్రికా గోష్ఠిలో ప్రసంగిస్తూ విజ్ఞప్తిచేశారు.

పార్టీలో అభిప్రాయ భేదాలుంటే, వాటిని పార్టీ నిబంధనావళి పరిధిలోనే పరిష్కరించుకోవాలని ఆయనే నొక్కి చెప్పారు.

శ్రీ భూపేష్‌గుప్త నేడు శ్రీ ఇ. యమ్. యస్. నంబూద్రిపాద్‌తోనూ, ఇతర ముఖ్యులతోనూ గూడా సంభాషణలు జరిపారు.

విభేదాలకు నిజంగా భౌతిక ఆధారం ఏదీ లేదని ఆయన పత్రికాగోష్ఠిలో అన్నారు. తాము 1957-1960 మాస్కో ప్రకటనలకూ, విజయవాడ మహాసభలో ఆమోదించిన విధానానికీ, ఆ విధానాన్ననుసరించి నిర్ణయించుకొన్న ఎన్నికల వ్యూహానికీ, తాము కట్టుబడి ఉన్నామనే పార్టీలోని ప్రతిపక్షంవారూ అంటున్నారని ఆయన అన్నారు. ఈ మూల విధానాలను అంగీకరించినప్పుడు, ఇక చీలిక ఎందుకని ఆయన ప్రశ్నించారు.

"విభేదాలున్నట్లయితే, చర్చించుకొని పరిష్కరించుకోవచ్చు. వాటిలో కొన్నిటిని పరిష్కరించుకోలేకపోయినప్పటికీ, నిత్య జీవితంలోనూ, ఆచరణలోనూ వాటిని పరీక్షించిపెట్టి తేల్చుకోవచ్చు" నని ఆయన అన్నారు.

పార్టీ జాతీయసమితి కాంగ్రెస్‌లో "సాధారణ ఐక్యసంఘటన" పంథాను సూచిస్తూ ఉందని శ్రీ నంబూద్రిపాద్, శ్రీ జ్యోతిబాసు చేసిన విమర్శ "చాల అన్యాయమైనదని" ఆయన ఖండించారు. అటువంటి పంథాను జాతీయసమితి ఏనాడూ సూచించలేదన్నారు.

విజయవాడలో బహిరంగ సభలు

21-5-64 న సాహూరంగంచౌక్‌లో

ఉపన్యాసకులు:

సాయంత్రం 7 గంటలకు

శ్రీ చండ్ర రాజేశ్వరరావు.
(భారత కమ్యూనిస్టుపార్టీ నాయకులు)
శ్రీ అప్పలాధి సర్వేశ్వరరావు, (యం.ఎల్.ఏ.)
శ్రీ వేములపల్లి శ్రీకృష్ణ (యం. ఎల్. ఏ.)

23-5-64 గాంధీనగరంలో

(న్యూ ఇండియా సెంటర్‌లో)

సాయంత్రం 7 గంటలకు

ఉపన్యాసకులు:

శ్రీ రాజ బహదూర్‌గౌడ్, (ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యదర్శివర్గ సభ్యులు)
శ్రీ వేములపల్లి శ్రీకృష్ణ (ఎం. ఎల్. ఎ.)
శ్రీ టి. వెంకటేశ్వరరావు

మూడేండ్ల డిగ్రీకోర్సు విద్యాస్థాయి పెరగడానికి తోడ్పడిందట!

న్యూఢిల్లీ, మే 18

మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సు పథకం డిగ్రీ కోర్సులలో విద్యావిధాన స్థాయిని పెంపొందించడానికి తోడ్పడినట్లు కొన్ని విశ్వవిద్యాలయాలు తమ అభిప్రాయాన్ని వెల్లడించాయి.

కాగా కొన్ని విశ్వవిద్యాలయాలు మాత్రం ఈ అభిప్రాయాన్ని నిరాకరించాయి. దీనిపై ఇప్పుడే ఒక అభిప్రాయానికి రావడం మంచిదికాదని మరికొన్ని విశ్వవిద్యాలయాలు భావిస్తున్నాయి.

డిగ్రీకోర్సుపై తమ అభిప్రాయాలను తెలుపవలసినదిగా విశ్వవిద్యాలయ గ్రాంట్సు కమిషన్ చేసిన విజ్ఞప్తి ననుసరించి దేశంలోని 25 విశ్వవిద్యాలయాలు పై అభిప్రాయాలను తెలియ చేశాయి. మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సును, ప్రవేశ పెట్టిన 45 విశ్వవిద్యాలయాల అభిప్రాయాలను గ్రాంట్స్ కమిషన్ కోరింది.

మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సును బొంబాయి విశ్వవిద్యాలయం ప్రవేశ పెట్టి నిరాకరించింది. ఉత్తర ప్రదేశ్‌లోని ఆగ్రా, అలహాబాద్, గోరఖ్‌పూర్, లక్నో విశ్వవిద్యాలయాలు కూడా ఈ పథకాన్ని ప్రవేశ పెట్టలేదు.

క్రుశ్చేవ్ - నాజర్ చర్చలు

కైరో, మే 18

క్రుశ్చేవ్, నాజర్‌లు ఈవేళ కైరోలోని కుబ్బా భవనంలో చర్చలు ప్రారంభించారు. ఈజిప్టు ఉపాధ్యక్షుడయిన హకీమ్‌అమర్ కూడా ఈ చర్చల్లో పాల్గొంటున్నారు.

ఉన్నతప్రదేశమైన అస్వాన్‌డామ్ ప్రాంతంలో నాలుగు రోజులు గడపడం వల్ల క్రుశ్చేవ్ చాల అలసటగా ఉన్నారు. ఆ కారణంచేత ఆయన కార్యక్రమంలో కొన్ని మార్పులు జరిగాయని అభిజ్ఞ వర్గాలు తెలిపాయి. క్రుశ్చేవ్ రేపు పోర్ట్ సయీద్ వెళ్తారని మొదట అనుకున్నారనీ, కాని అక్కడికి వెళ్ళేదీ లేనిదీ తాము చెప్పలేమనీ సోవియట్‌రాయబార కార్యాలయంవారు తెలిపారు. ఈవేళ ఒక ఉక్కు ఫ్యాక్టరీని, మరొక ఫ్యాక్టరీని చూడవలసిన కార్యక్రమాన్ని రద్దుచేశారు.

అయూబ్ ఖాన్ అతిథిగా అబ్దుల్లా

ఈనెల24నుండిపాకిస్తాన్‌లో పర్యటన

రావల్పిండి, మే 18

షేక్‌అబ్దుల్లా ఈనెల 24 వ తేదీన పాకిస్తాన్‌కు వస్తారని, ఆయన పాక్ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ అతిథిగా వుంటారని నేడిక్కడ అధికార వర్గాలద్వారా తెలుస్తూ వుంది.

అబ్దుల్లా భారతదేశం గుండా లాహోరు వెళ్ళి, అక్కడనుంచి రావల్పిండికి చేరుతారు.

అబ్దుల్లా పాకిస్తాన్ పర్యటన సందర్భంలో ఒక పెద్ద బృందం ఆయన వెంట వెళుతుంది. వీరిలో మీర్జా అఫ్జల్‌బేగ్, మౌలానా మసూదీ, అబ్దుల్లా పెద్ద కుమారుడు డా. ఫరూక్ అబ్దుల్లా కూడా వుంటారు.

షేక్ అబ్దుల్లా రావల్పిండి రాక

ఈ నెల 24 న

రావల్పిండి, మే 18

షేక్ అబ్దుల్లా ఈనెల 24 ఉదయం గం.8 లకు లాహోరు చేరుకొని, గంట పిమ్మట రావల్పిండికి బయలుదేరుతారని నేడిక్కడ ప్రకటించబడింది.

లాహోర్‌లో పాకిస్తాన్ ప్రభుత్వ ప్రతినిధి ఒకరు ఆయనకు స్వాగతం ఇస్తారు. ఇక్కడున్న స్వల్ప వ్యవధిలో ఆయనకు పౌర సన్మానం జరుగుతుంది.

ప్రెసిడెంట్ అయూబ్‌ఖాన్ ఆహ్వానంపై అబ్దుల్లా పాకిస్తాన్ సందర్శిస్తున్నారు. ఆయన పాకిస్తాన్‌లో నాలుగు రోజులుంటారు. అటు పిమ్మట పాకిస్తాన్ ఆక్రమణ క్రింద వున్న ప్రాంతంలో నాలుగు రోజులపాటు పర్యటించి ఆ తరువాత ఒకరోజుపాటు కరాచి సందర్శిస్తారు.

షేక్ అబ్దుల్లా తూర్పు పాకిస్తాన్‌లో రెండు రోజులు పర్యటించి, అటుపిమ్మట ఢాకానుండి విమానంలో కలకత్తా చేరుకొంటారు.

నాగపూర్ ప్యాసింజర్ ప్రమాదం

27 గురికి గాయాలు

కలకత్తా, మే 17

దుర్గ్ - నాగపూర్ సెక్షన్‌లో చక్రధర్‌పూర్ - నాగపూర్ ప్యాసింజరు రాజనందగాం స్టేషన్‌వద్ద నేటిరాత్రి ప్రమాదానికి లోనైన కారణంగా 27 గురికి గాయాలు తగిలాయి.

పట్టాలపైనున్న మరో ఖాళీ ఇంజన్‌తో ప్యాసింజర్ గుద్దుకొన్న ఫలితంగా ఈ ప్రమాదం జరిగింది.

ముగ్గురికి మాత్రం తీవ్రమయిన గాయాలు తగిలాయి.

బర్మాలో కరెన్సీ నోట్లచలామణి రద్దు

దొంగకరెన్సీని అరికట్టడానికి తీసుకొన్న చర్య

రంగూన్, మే 18

బర్మా విప్లవ ప్రభుత్వం దేశంలోని నూరు, యాభై క్యాట్ల కరెన్సీనోట్ల చలామణీని తక్షణమే రద్దుచేసింది. (ఒక బర్మా క్యాట్ భారత రూపాయికి సమానం).

బర్మాలోని స్వదేశీ విదేశీ ధనికవర్గాలు సాగిస్తున్న దొంగనోట్ల చలామణీని రద్దు చేయడానికి ఈ చర్య అవసరమైనదని గత రాత్రి బర్మా రేడియోలో ప్రభుత్వఉత్తర్వును ప్రసారంచేస్తూ పేర్కొన్నారు.

నూరు, యాభై క్యాట్ల దొంగకరెన్సీని దేశంలోని కొన్ని ధనిక వర్గాలు నిల్వ చేశాయని దాని మూలంగా ధరలను అదుపులోకి తీసుకు రావాలనే ప్రభుత్వ విధానానికి దెబ్బ తగులుతూ వుందని కూడా ఆ ప్రకటన చెప్పింది.

చలామణీనుండి రద్దు చేసిన ఈ కరెన్సీని ఏడు రోజుల లోపల ప్రభుత్వానికి స్వాధీనం చేయాలని, ఈ ఉత్తరువును ఉల్లంఘించినవారికి కనీసం పది సంవత్సరాల కఠిన శిక్షవిధింపబడుతుందనికూడా ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ నెల 24 వ తేదీ సాయంత్రం 4 గంటల లోపల, విదేశీ రాయబార వర్గాలతో సహా ప్రజలందరూ ఈ నోట్లను ప్రభుత్వ ఖజానాలకు స్వాధీనం చేయాలని బర్మా విప్లవ సమితి అధ్యక్షుడు నెవిన్ ఈ ఉత్తర్వులో కోరారు.

న్యాయంగా ఈ నోట్లను ప్రభుత్వ ఖజానాలలో డిపాజిట్ చేసిన వారికి 5 వందల క్యాట్ల సొమ్ము ఇచ్చివేయడం జరుగుతుందని, మిగతా సొమ్మును సమీపంలోని వ్యాపార బ్యాంకులో ఆ డిపాజిటర్ పేరుతోనే ఫిక్సెడ్ డిపాజిట్ చేస్తారని ఈ ఉత్తర్వులో పేర్కొన్నారు.

బర్మా దేశం మొత్తంలో ఉన్న డబ్బు చలామణీలో నూరు, యాభై క్యాట్ల నోట్లు సగం ఉన్నాయి. బ్యాంకులు జాతీయం చేసినప్పుడు పెట్టుబడి దార్లు ఈ డబ్బును బ్యాంకుల నుండి తీసికొని, వ్యాపారాన్ని జాతీయం చేసినపుడు ఈ డబ్బుతో చట్టా వ్యాపారాన్ని సాగించారనీ ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

సోవియట్‌చే నూతన ఉపగ్రహ ప్రయోగం

మాస్కో, మే 18

సోవియట్ నేడొక నూతన సౌరమండల పరిశోధన ఉపగ్రహాన్ని ప్రయోగించిందని 'టాస్' వార్తాసంస్థ ప్రకటించింది.

అంతరిక్ష పరిస్థితులను పరిశోధించేందుకు అవసరమైన శాస్త్రీయ పరికరాలు ఉపగ్రహంలో వున్నాయని ఈ పరికరాలు బాగా పనిచేస్తున్నాయని కూడా తెలియజేసింది.

నెహ్రూ ఇంటర్వ్యూ

(1 వ పేజీ తరువాయి)

కోవాలి. ఎందువల్లనంటే చరిత్రంతా పరిశీలించినప్పటికీ ఇప్పుడు పాకిస్తాన్ వున్న ప్రాంతంలో చాలా భాగం ప్రత్యేకమైన దేశంగా వుండి వుండలేదు. దక్షిణ భారతదేశం ఒకప్పుడు ప్రత్యేకరాజ్యాలుగా వుంది. కాని ఉత్తర భారతం భౌగోళికంగా, చారిత్రకంగా, భాష రీత్యా ఒక విధంగానే వుంది. అందువలన భారత - పాకిస్తాన్‌లమధ్య ఉద్రిక్తత పెరగడం కేవలం వైరితనంఅనిపించు కొంటుంది. ఈ ఉద్రిక్తత సడలి పోక తప్పదు.

తనకూ ఆయూబ్‌ఖాన్‌కు వ్యక్తిగతంగా విద్వేష భావమేమీ లేదని శ్రీ నెహ్రూ చెప్పారు.

'నాకు అలాంటి వ్యక్తిగతమైన ద్వేషభావమేమీ లేదుగాని, ఇటీవల అనేకసార్లు అయూబ్‌ఖాన్ భారత - పాకిస్తాన్‌లు సన్నిహితం కావడానికి నేనే అడ్డుపడుతున్నానని చెప్పారు.'

చైనా సమస్య

చైనాతో భారత్ ఎలా వ్యవహరింపగలదు అని అడిగిన ప్రశ్నకు శ్రీ నెహ్రూ జవాబిస్తూ "మళ్ళీ ఘర్షణ జరగకుండా వుండేందుకు మమ్ములను మేము బలపరచుకోవడం ఒక్కటే మార్గమనుకొంటున్నాం. అలాగే ఒకవేళ మరల ఘర్షణ జరిగితే ఆ బలంతో ఎదుర్కోవాలి"

ఆయన యింకా ఇలా చెప్పారు.

భారతదేశంతో చైనాకు సుదీర్ఘమైన సరిహద్దువుండటం వలన, అందులోనూ టిబెట్, మధ్య చైనాద్వారా ఈసరిహద్దు వుండుటవలన యుద్ధ తంత్రం రీత్యా చైనాకు అనుకూలమైన స్థితి వుంది.

భారత దేశానికిమాత్రం క్లిష్టమైన పర్వతప్రాంతం వుంది. అయితే అంత ఎక్కువగా వెళ్ళనవసరంలేదు. అందువలన మేము రక్షణచేసుకోగలం. చైనాపై దాడి చేయాలనే ఉద్దేశ్యం మాకులేదు. మా ఆలోచన విధానానికే అది వ్యతిరేకం. అయితే వారు భారతదేశంలోకి రాకుండా మేము ఆపివేయగలం.

భారతదేశంతో కలిసి అమెరికా, సోవియట్ యూనియన్‌లు చైనాను అటకట్టించగలవని మీరు అనుకొంటున్నారా అని టెలివిజన్ ప్రతినిధి శ్రీనెహ్రూను ప్రశ్నించగా ఆయన యిలా సమాధానం చెప్పారు:

"నేను చెప్పలేను. భవిష్యత్తులో ఏముందో నేను వూహించలేను.

అయితే ఆ దృక్పథంతో చూడటం ప్రమాదకరం.

చైనాకు సత్వర సమస్య ఆహారమని నేను భావిస్తున్నాను.

ఆస్ట్రేలియా, కెనడా, తదితర దేశాలనుండి తమ ప్రజలకు ఆహారధాన్యాలు సంపాదించుకోవలసివుంది. వారి జనాభా మాజనాభాకంటే త్వరితగతిని పెరిగిపోతోంది. జనాభా పెరుగుదల మాకూ సమస్యయే. అయితే మాకంటే వారికే అది పెద్దసమస్య. అందువలన ఈ ఇబ్బందులన్నింటి వలన వారు నానాటికి శాంతి వాదులు కావచ్చు.

చైనాతో తగాదా వున్నప్పటికీ దానిని ఐరాసలో చేర్చుకోవాలని భారత్ కోరుతున్నది. ఐరాసలో చైనా లేకపోతే నిరాయుధీకరణవంటి తదితర ప్రధాన సమస్యలపైనా జరిగే ఎలాంటి ఒప్పందం దానికి వర్తింపచేయడం కష్టం. ఐరాసలో వుంటే భవిష్యత్తులో వారు చాలావరకు తగ్గుతారని నేను ఊహించుతున్నాను.

ఈ సందర్భంలోనే ప్రధాని నెహ్రూ, ఇంగ్లాండు, ఫ్రాన్సు లాంటి పశ్చిమ రాజ్యాలు చైనాతో వాణిజ్యసంబంధాలను పెంపొందించు కొంటున్నాయని అన్నారు.

అది మీకు ఇష్టమేనా అని ప్రశ్నించగా "నిజం చెప్పాలంటే అవి చైనాను అభిమానించడం నాకు ఇష్టంలేదు. అయితే చైనా ప్రజలు ఆహారంలేక ఆకలితో చచ్చిపోవాలని నేను కోరడంలేదు ... కాని వారికి ఎలాంటి సరుకులూ - ముఖ్యంగా యుద్ధానికి ఉపయోగపడే సరుకులు ఇతర దేశాలనుండి సరఫరాకావడం నాకు ఇష్టంలేదు" అని అన్నారు.

అణ్వాస్త్ర సాంకేతిక విజ్ఞానంలో చైనాకంటే భారతదేశమే అభివృద్ధిలో వుందని నెహ్రూ అభిప్రాయం వెలిబుచ్చారు. అయితే భారత్ అణ్వాస్త్రాలను తయారు చేయదలచుకోలేదన్నారు.

చైనాకు అణ్వాస్త్రాలు వుంటే ఏమి జరుగుతుందో ఎవరైనా వూహించుకో వచ్చునని శ్రీ నెహ్రూ అన్నారు.

"ఏమైనప్పటికీ అణ్వాస్త్రాలను తయారు చేసుకోవడానికి వారికి చాలాకాలం పడుతుంది. అందులో తగినన్ని వారికి కావలసివుంది. అలా వృద్ధిగా అణ్వాస్త్రాల కలిగివుండాలంటే చైనాకు చాలా చాలా కాలంపడుతుంది."

శ్రీ నెహ్రూ ద్వితీయ బాండుంగ్ మహాసభ జరపడంపై ఈ క్రింది అభిప్రాయాలు వెలిబుచ్చారు:

అలాంటి మహాసభ ఇప్పుడు జరిగితే మొదటి మహాసభవలె అది జయప్రదం కాజాలదు. ఎందువల్లనంటే అక్కడ సమావేశం కాబోయే వివిధ దేశాలమధ్య అభిప్రాయ భేదాలు ఎక్కువగా వుంటాయి.

మహారాష్ట్రకు కేంద్రం కొత్త సూచన

నదీజలాలమళ్ళింపు సమస్యపై

బొంబాయి, మే 18

కృష్ణానదీ జలాల వినియోగ సమస్యపై కేంద్రప్రభుత్వ ప్రతిపాదనను తన ప్రభుత్వం పరిశీలిస్తున్నదని మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వి. పి. నాయక్ నేడిక్కడ పత్రికల ప్రతినిధులతో వెల్లడించారు.

వ్యవసాయ, విద్యుత్ సౌకర్యాల కల్పనకై కృష్ణానదీ జలాలను పశ్చిమంగా మళ్లింపడం కంటే, కొంకన్‌లో పశ్చిమంగా ప్రవహిస్తున్న నదీ జలాలను నిల్వచేసి వాటిని వినియోగించుకొనడం సముచితమేమో పరిశీలింపవలసిందిగా కేంద్ర ప్రభుత్వం సూచించినదని శ్రీ నాయక్ తెలియచేశారు.

1961-76 మధ్య నివాస గృహాల ఆవశ్యకత

బొంబాయి, మే 18

1961-76 సంవత్సరాలమధ్య దేశంమొత్తం మీద పట్టణ ప్రాంతాలలో 220 లక్షల యిండ్లు, గ్రామీణ ప్రాంతంలో 180 లక్షల యిండ్లు అవసరమనీ, వీటి నిర్మాణానికి రు॥ 17,500 కోట్లు అవసరమని ప్రణాళిక కమిషన్ ఉపసంఘం అంచనా వేసింది.

4, 5 ప్రణాళికల కాలంలో గృహనిర్మాణానికి 3,000 కోట్ల మేరకు లభించవచ్చునని అంచనా వేసింది.

దేశంలో గృహవసతి కొరత చాలా అధికంగా వుందనీ, దానిని తీర్చడానికి తీవ్రకృషి అవసరమని ఉపసంఘం తన నివేదికలో వెల్లడించింది.

స్వతంత్రపార్టీ పార్లమెంటరీ బోర్డు సమావేశం ముగింపు

మద్రాసు, మే 17

గత రెండు రోజులుగా ఇక్కడ జరుగుతున్న స్వతంత్రపార్టీ పార్లమెంటరీబోర్డు సమావేశం నేడు ముగిసింది.

సమావేశానికి బోర్డులోవున్న ఆరుగురు సభ్యులూ శ్రీ రాజగోపాలాచారి, శ్రీరంగా, మసానీ, దాహ్యాభాయి పటేల్, వి. వి. పాటిల్, కె. ఎస్. సింగులు హాజరయ్యారు. మహారాణి గాయత్రీదేవి, యం. రత్నస్వామి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు.

ఈ సమావేశ విశేషాలను రేపు మసాని పత్రికలవారికి తెలియచేస్తారు.

నెహ్రూ ప్రకటనపై షేక్ అబ్దుల్లా హర్షం

శ్రీనగర్, మే 18

న్యూఢిల్లీలో ప్రధాని నెహ్రూతో తాను జరిపిన చర్చల విషయమై బొంబాయి ఎ.ఐ.సి.సి. సమావేశంలో శ్రీ నెహ్రూ చేసిన ప్రకటనపట్ల షేక్ అబ్దుల్లా నేడిక్కడ హర్షం వెలిబుచ్చారు.

తనకు సన్నిహితంగా వుండే వర్గాలు శ్రీ నెహ్రూ ప్రకటనపట్ల హర్షం ప్రకటించ లేదంటూ పత్రికలలో వచ్చినవార్తలు విపరీతకరమని ఆయన అన్నారు.

"శ్రీ నెహ్రూ ఇంతకంటే మంచి ప్రకటన చేయలేరు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రధాని చేసిన ప్రకటన ప్రోత్సాహకరంగా ఉంది" అన్నారు షేక్ అబ్దుల్లా.

అణ్వాయుధాలపై చైనా మోజు

ఏమైనాసరే వాటిని తయారు చేసుకుంటామని చౌ-ఎన్-లై ప్రకటన

టోకియో, మే 18

చైనాకు అణ్వాయుధాలు ఉండి తీరాలనీ, ఏమైనాసరే చైనా తనసొంత అణ్వాయుధాలను తయారు చేసుకుంటుందని చైనాప్రధాని చౌ ఎన్ లై జపాను వార్తాసంస్థ క్యోడోకిఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తెలిపారు.

ఈ వార్తా సంస్థ అధిపతి కియోషి ఇవామోటో, చౌ-ఎన్‌లైని పెకింగ్‌లో ఇంటర్వ్యూ చేశారు.

ఈ ఇంటర్వ్యూలో చౌ-ఎన్‌లై ఇంకా ఈ దిగువ అభిప్రాయాలను తెలిపారు:

ఇతర దేశాలకు అణ్వాయుధాలు ఉండడం చైనాకూ, ప్రపంచానికంతటికీకూడా ఒక బెదరింపు. ఈ బెదరింపును ఎదుర్కోవాలంటే చైనా తన సొంత అణ్వాయుధాలను కలిగి ఉండాలి.

అణ్వాయుధాలను తయారు చేసుకొనే కార్యక్రమ మొకటి చైనా రూపొందించుకుంది. అయితే, మొదటి చైనా అణ్వాయుధం ఎప్పుడు తయారవుతుందీ తాను ఇప్పుడే చెప్పలేనని చౌ-ఎన్-లై అన్నారు.

రెండు చైనాల సిద్ధాంతాన్ని మనసులో పెట్టుకోవద్దని ఈ ఇంటర్వ్యూలో చౌఎన్‌లై జపాన్‌ను హెచ్చరించారు. (చాంగ్‌ముఠా ఆక్రమణక్రింద ఉన్న తైవాన్‌నికూడా స్వతంత్ర చైనా ప్రతిపత్తి నివ్వాలనేది కొన్ని పశ్చిమ దేశాల వారి వాదన.) చైనా ప్రజా రిపబ్లిక్‌ను ఒక్కదాన్నే జపాను గుర్తించాలనీ, తైవాన్ దీవిపైన కూడా దానికే సార్వభౌమాధికారం ఉన్నదనీ చౌఎన్‌లై నొక్కి చెప్పారు.

సామ్రాజ్యవాదులు గనుక సోవియట్‌పై దాడిచేసి, మరో ప్రపంచ యుద్ధాన్ని తెచ్చిపెట్టినట్లయితే, సోవియట్ సరసను చైనా నిలబడి పోరాడుతుందని ఆయన ఈ ఇంటర్వ్యూలో చెప్పారు.

చైనా, సోవియట్ దేశాలమధ్య సంబంధాలు ఇటీవల క్షీణించినప్పటికీ, 1950 లో రెండు దేశాలమధ్య కుదిరిన పరస్పర మైత్రి, సహకార సంధి నేటికీ అమలులో ఉందని చౌ-ఎన్-లై స్పష్టపరిచారని ఆయనను ఇంటర్వ్యూ చేసిన క్యోడో తెలిపారు.

భారత భూభాగం నుండి పాకిస్తాన్ వైదొలగాలి

కృష్ణమీనన్ ఉద్ఘాటన

మద్రాసు, మే 18

పాకిస్తాన్ ఆక్రమించి కూర్చున్న 42 వేల చదరపుమైళ్ళ భారత భూభాగాన్ని పాకిస్తాన్ ఖాళీ చేయనిదే కాశ్మీర్ సమస్య పరిష్కారం కాదని భారత మాజీ రక్షణమంత్రి శ్రీ కృష్ణమీనన్ నేడిక్కడ ఉద్ఘాటించారు.

"కాశ్మీర్ భారతదేశంలో అంతర్భాగం. ఏమి జరిగినప్పటికీ దండయాత్రను తలపెడిన శత్రువును ప్రతిఘటించడం మన స్వశక్తి మీద ఆధారపడి వుంది. ఈ దేశాన్ని విభజించాలన్న దుష్ప్రయత్నాలను మనం అధిగమించడానికి ప్రపంచ సహకారం. కానీ మనశక్తి తోడ్పడాలి" అని ఆయన అన్నారు.

మద్రాసులోని, కేరళ సమాజ్ ఆధ్వర్యాన నేడిక్కడ జరిగిన బహిరంగ సభలో శ్రీ కృష్ణమీనన్ ఉపన్యసించారు.

ఇతర రాష్ట్రాల విధంగానే కాశ్మీర్‌కూడ భారతదేశంలో చేరిందని చెబుతూ, భారత యూనియన్‌లోని భాగాన్ని ఇచ్చివేయడానికి ప్రజలకు గాని, పార్లమెంటుకుగాని మన రాజ్యాంగ పట్టంలో అధికారం లేదని చెప్పారు. "దేశసమైక్యత అమ్మకానికికాదు. మన గౌరవం బేరమాడే వస్తువుకాదు" అని ఆయన అన్నారు.

కాసరగోడ్ తాలూకాను మైసూర్ రాష్ట్రంలో చేర్చాలని డిమాండ్ చేస్తూ, కర్నాటక ప్రాంతీకరణ సమితి ఆధ్వర్యాన వెయ్యమంది నేడు మంగుళూరులో, మైసూర్ ప్రదేశ్ కాంగ్రెస్ రాజకీయ మహాసభ జరిగే భవనం యెదుట ప్రదర్శన చేశారు.

ఇండొనేసియాలో బ్రిటిష్ వారి తోటల స్వాధీనం:

మలేషియా వ్యతిరేక విధానంలో భాగంగా

జకార్తా, మే 18

పశ్చిమ జావాలోని బ్రహ్మాండమైన బ్రిటిష్ రబ్బరు, టీతోటలను ఇండొనేసియా ప్రభుత్వం నేడు స్వాధీనం చేసుకున్నదని ఇండొనేసియా వ్యవసాయమంత్రి సాద్జార్వో నేడిక్కడ ప్రకటించారని అంటారావార్తాసంస్థ తెలియజేసింది.

మలేషియాకు వ్యతిరేకంగా ఇండొనేసియా చేపట్టిన ప్రస్తుత విధానంలో ఈ బ్రిటిష్ అస్తుల స్వాధీనం ఒక భాగమని మంత్రి చెప్పారు. వీటి నిర్వహణకు నూతన మేనేజిమెంటును నియమించడం జరిగిందనికూడా తెలియజేశారు.

ఇండొనేసియా ప్రభుత్వం బ్రిటిష్ ఆస్తులను స్వాధీనం చేసుకోవడం యిదే ప్రథమం. ఇంతక్రితం ఇండొనేసియాలోని బ్రిటిష్ అస్తులన్నింటిని తనిఖీ చేయడానికి మాత్రమే ఇండొనేసియా ప్రభుత్వం నిర్ణయించుకున్నది.

మికోయాన్ - ఇకెడా సంభాషణలు

ఈనెల 25 నుండి తిరిగి కొనసాగింపు

టోకియో, మే 18

ప్రస్తుతం జపాన్‌లో ఒక వారంపాటు పర్యటించడానికి వచ్చిన సోవియట్ ప్రథమ ఉపప్రధాని నేడిక్కడనుండి బయలుదేరి ఇతర ప్రాంతాలు పర్యటించడానికి వెళ్ళారు. ఆయన మరల ఈ నెల 25 వతేదీన యిక్కడికి వచ్చి జపాన్ ప్రధానమంత్రి ఇకెడాతో తిరిగి సంభాషణలు కొనసాగిస్తారు.

శాంతిసంధి ప్రాతిపదికగా సోవియట్ - జపాన్ దేశాల మధ్య సంబంధాలను మరింత సన్నిహితం చేయడం; ఉభయ దేశాలమధ్య వాణిజ్య విస్తరణను గురించీ, భూగర్భంలో అణ్వాయుధ పాటవ పరీక్షలను తక్షణం నిషేధించాలనికోరుతూ సంయుక్త ప్రకటనచేయడం మున్నగు ప్రతిపాదనలపై సంభాషించడానికి మికోయాన్ పర్యటన ఉద్దేశింపబడిన విషయం పాఠకులకు విదితమే.

350 మిలియన్ల డాలర్లమేరకు జపాన్ సరుకులను కొనుగోలు చేయడానికి సోవియట్ చేసిన ప్రతిపాదనపట్ల జపాన్ పారిశ్రామిక వేత్తలు ఆసక్తి కనబరుచుతున్నారు.

పశ్చిమ యూరోపియన్ దేశాలకు యిస్తున్న విధంగానే వాయిదామీద చెల్లింపు పద్ధతిలో ఇచ్చే పక్షంలో జపాన్ ఎంత సరకును యివ్వడానికి సిద్ధపడితే అంత సరకునూ కొనడానికి సోవియట్ సంసిద్ధంగా వుందని మికోయాన్ తెలియజేశారు. సోవియట్ చేసిన ఈ ప్రతిపాదన ఆమోద యోగ్యంగా వుందని జపాన్ పారిశ్రామికవేత్తలు భావిస్తున్నారు.

మికోయాన్ ఇకెడాలతో జరిపిన సంభాషణలలో మాస్కో - టోకియోల మధ్య సరాసరి విమానసంయానం గురించికూడా ప్రస్తావించినట్లు తెలుస్తూవుంది.

కైరోలోని అమెరికా రాయబారి జాన్‌బడే తన పదవికి రాజీనామా ఇచ్చారని జూన్ 9 న ఇక్కడినుండి స్వదేశానికి బయలుదేరుతారని ఇక్కడ అమెరికా రాయబార కార్యాలయం నిన్న ఒక ప్రకటన ద్వారా తెలియజేసింది.

జాన్‌బడే రాజీనామా ఇక్కడ ఐక్యఅరబ్ రిపబ్లిక్ అధికార వర్గాలలో చాలా ఆశ్చర్యం కలిగించింది.

విముక్తి పోరాటాన్ని తీవ్రం చేసేందుకు ద. వియత్నాం ప్రజాసైన్యం నిర్ణయం

సైగాన్, మే 18

దక్షిణ వియత్నామ్‌లో జాతీయ విముక్తి పోరాటం రేపటినుండి తీవ్రతరమవుతుందని ప్రజావిముక్తిసేన ప్రచారక దళాలు, దక్షిణ వియత్నామ్ ప్రజలకు ముందుగానే తెలియచేశాయి. వియత్నామ్ ప్రజల ప్రియతమ నాయకుడు, ఉత్తర వియత్నామ్ ప్రజారిపబ్లిక్ అధ్యక్షుడూ అయిన డాక్టర్ హోచిమిన్ జన్మదినం రేపు.

పోరాటం తీవ్రంచేస్తున్నట్లు కిందటివారమే కరపత్రాలు పంచడమూ, బహిరంగసభల్లో ప్రసంగించడమూ జరిగిందని ఉత్తర - దక్షిణ వియత్నామ్ సరిహద్దు సమీపంలోని క్వాంగ్‌ట్రి నుండి వచ్చినవారు తెలిపారు.

హోచిమిన్ 72 వ జన్మదినోత్సవ సందర్భంగా సైగాన్‌లో గెరిల్లా చర్య లేవైనా జరుగుతాయేమో అనే భయంతోటే దక్షిణ వియత్నామ్ ప్రభుత్వమూ, అమెరికావాళ్లూ కలిసి ప్రత్యేక బందోబస్తు జరిపారు.

దక్షిణాది ప్రాంతాల్లో ప్రజావిముక్తి సైనిక దళాల విజృంభణ తిరిగి ప్రారంభం కాగలదని అక్కడి ప్రభుత్వ సైనికవర్గాలు అనుకుంటున్నాయి.

అరెస్టులు

ఈవేళ సైగాన్‌లో [illegible] పదిమందిని అరెస్టుచేశారు. అమెరికా రక్షణశాఖ మంత్రి రాబర్ట్ మెక్‌నమారా గతవారం దక్షిణ వియత్నామ్ వచ్చినప్పుడు ఆయనను హత్య చేయడానికి కుట్ర జరిగిందనీ, ఆ కుట్రతో సంబంధం ఉందనే అనుమానంతో వీరిని అరెస్టుచేశారని పోలీసులు అంటున్నారు.

అమెరికాకు కాంబోడియా హెచ్చరిక

పనోమ్‌పెన్, మే 18

కాంబోడియా సరిహద్దును అతిక్రమించి వచ్చే ఏ విమానాన్నయినాసరే కూల్చివేస్తామనీ, వాటిని అమెరికా వైమానికులు నడుపుతున్నా వదలిపెట్టేదిలేదనీ, కాంబోడియాప్రభుత్వం నేడు అమెరికా ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక అందచేసింది. కాంబోడియా రేడియోలో ప్రభుత్వ ప్రకటన రూపంలో ఈ హెచ్చరికను తెలిపారు.

కాంబోడియా దేశానికి, ఇక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రత్యక్షంగా గాని, పరోక్షంగాగాని జోక్యంకలిగించుకుంటే కలిగే ఫలితాలను గురించికూడా హెచ్చరించారు.

ప్రిన్స్ సిహనౌక్ కాంబోడియా ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకున్న నాయకుడనీ, ఆయనకు వ్యతిరేకంగా తీసుకున్న ఏ చర్యనయినా పరాయి ప్రజల స్వాతంత్ర్యానికీ, హక్కులకు భంగకరంగా తలపెట్టిన చర్యగానే పరిగణిస్తామనీ ఈ హెచ్చరిక తెలిపింది.

"సిహనౌక్ అనుసరిస్తున్న తటస్థ విధానాలను రూపుమాపడంకోసం కాంబోడియాలో ప్రత్యక్ష జోక్యానికి అమెరికా పూనుకోవాలని" కోరుతూ 'వాషింగ్టన్ పోస్టు' పత్రిక రాసిన వ్యాసాన్ని ఈ ప్రకటనలో ఉదహరించారు.

బరౌనీ నూనె శుద్ధి కర్మాగారం విస్తరణ

మాస్కో, మే 12

బరౌనీ నూనెశుద్ధి కర్మాగారం విస్తరణకు సంబంధించిన నమూనాను సోవియట్ ప్రవీణులు పూర్తి చేశారు.

ఈ విస్తరణ కార్యక్రమాన్ననుసరించి బరౌనీ కర్మాగారం ప్రమాణం 20-30 లక్షల టన్నులకు పెరుగుతుంది. నిర్మాణం పూర్తి అయిన తర్వాత యిప్పటి కంటే రెండింతలు ఎక్కువ ఉన్నత రకం కిరోసినూ, బిటుమెను ఎక్కువగా నాసిరకం కిరోసినూ ఉత్పత్తి అవుతాయి. ఇంకా 5 లక్షల టన్నుల డీసెల్ నూనె కూడా ఉత్పత్తి అవుతుంది.

ఈ కర్మాగార నిర్మాణం 1961 లో ప్రారంభమయింది, కొద్ది మాసాల్లో నిర్మాణం పని పూర్తి అవుతుంది.

ఈజిప్టులో ఔషధ కర్మాగారం
సోవియట్ సాయంతో నిర్మాణం

కైరో, మే 12

నికిటాక్రుశ్చేవ్ నేడు ఐక్యఅరబ్బురిపబ్లిక్ లో సోవియట్ సహాయంతో నిర్మింపబడుతున్న ఔషధకర్మాగారాన్ని సందర్శించారు. ఈ కర్మాగారంలో పని గత సంవత్సరం ప్రారంభమయింది. సోవియట్ ఆర్థిక, సాంకేతిక సహాయంతో యిది నిర్మింపబడుతున్నది.

కర్మాగారం అంతా నికిటా క్రుశ్చేవ్ కు చూపించబడింది. తర్వాత కర్మాగార ఆవరణలో ఒకసభ జరిగింది. ఐక్య అరబ్బు రిపబ్లిక్ ఆరోగ్యమంత్రి మహమ్మదీన్ సోవియట్ అతిథులకు స్వాగతం చెప్పారు.

పేడ నుండి గ్యాస్ ఉత్పత్తిచేసే యంత్రాల నిర్మాణం
వడ్డీ లేకుండా ఋణ సౌకర్యం

వారణాసి, మే 16

ఆవు పేడనుండి గ్యాసు ఉత్పత్తిచేసే 5 వేల యంత్రాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం వడ్డీ లేకుండా అప్పు యివ్వడానికి నిర్ణయించింది.

ప్రణాళికా సంఘం, సహాయ కార్యదర్శి శ్రీ డి. పి. సింగ్ ఈ విషయాన్ని నాకి యుగ్లాక్ రైతులకు తెలిపారు.

గ్రామీణ, పట్టణ కుటుంబాల ఆరోగ్య కార్యక్రమాలను తీవ్రంగా సాగించేందుకై కేంద్రం సూచించిన పథకాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది.

"ACCOUNT TEST: ANDHRA-PRADESH; Questions/Answers and Excellent Summaries Available for Subordinate Offices Parts I, II, Executive Officers & P. W. D. for Copies Apply: ACCOUNT TEST INSTITUTE - MADRAS-8."

ఫ్యాన్! ఫ్యాన్! ఫ్యాన్!
శ్రీ గిరిజాగైడ్
కొంటె ఫ్యాన్!
చూస్తే ఫస్టుమార్కు!
చదివితే బెస్టుమార్కు!
శ్రీ గిరిజా పబ్లికేషన్స్,
మెయిన్‌బజార్, విజయవాడ-1

తప్పిపోయినాడు

నాగావధ్యుల సుబ్రహ్మణ్యం, పదిసంవత్సరాల వయసు, కోలమొహం, బక్కపలచగా వుంటాడు. కోటేరువేసిన ముక్కు, పెద్దకళ్లు, నీలంగళ్ళ చొక్కా, కాకినిక్కరు, 3½ అడుగుల ఎత్తు మే 12 వ తేదీ ఉదయం తొమ్మిదిగంటల నుంచి కనుపించడంలేదు. ఈ కుర్రవాని ఆచూకీతెలిపినవారికి రు. 50. లు బహుమతి ఇవ్వబడును.

కుర్రవాని మేనమామ: లింగాల చుక్కయ్య,
వెంట్రప్రగడ, గుడివాడ తాలూకా
కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్.

"విదేశీచిత్రాలకు ఏమాత్రం తీసిపోదని నిరూపించిన భారతీయచిత్రం"
అని పత్రికలు పొగడుతున్నవి.
నేడేచూడండి
5 వ వారం
శ్రీనివాస - విజయవాడ
శ్రీకృష్ణా - రాజమండ్రి
2 వ వారం
న్యూటాకీ - నెల్లూరు
గీతాంజలివారి
కోహరా
వహీదా, విశ్వజిత్, లలితాపవార్ మొదలగువారు
సంగీతం: హేమంతకుమార్. • దర్శకత్వం: బిరేన్‌నాగ్.
పూర్ణా ప్రొడక్షన్స్ రిలీజ్.
SUVARNA

ఆఫ్రో-ఆసియా దేశాలలో నూతన రాజకీయ ధోరణులు
భారతదేశంపై కల్గించిన ప్రభావం

న్యూఢిల్లీ, మే 15

జకార్తాలో జరిగిన ఆఫ్రో - ఏషియన్ సన్నాహక సమావేశానికి భారత దేశం వెళ్ళి వచ్చిన అనంతరం అనేక ఉపయోగకర పరిణామాలు ఏర్పడుతున్నాయి.

భారత ప్రభుత్వ విదేశాంగ విధానం ఇదివరకటిలాగ సంశయాత్మకంగా, అసందర్భంగా వుండబోదనే విషయం జకార్తా సమావేశంతో స్పష్టపడింది. ప్రస్తుత ప్రపంచ పరిస్థితిపై ధైర్యంగా, సమన్వయ పూర్వక ధోరణిని అనుసరించి, ఆఫ్రో-ఆసియన్ రాజ్యాల కూటంలో తన ప్రాభవాన్ని నిలుపుకొనేటందుకు భారత ప్రభుత్వం గట్టిగా ప్రయత్నిస్తూంది.

జకార్తా సమావేశంలో ఈ విధానం విస్పష్టమయింది, దాని తొలి ఫలితాలు అప్పుడే కనిపించాయికూడా.

ఆఫ్రో-ఆసియా దేశాలతో సన్నిహితసంబంధాలను పెంచుకొనేటందుకు భారత ప్రభుత్వం కృషి చేస్తూంది. ఇండియా - సింహళాల ఏకాభిప్రాయం జకార్తాలో కనబడింది. తర్వాత అది మరింత దృఢపడుతూంది.

ఆఫ్రో - ఆశియన్ దేశాలను ఎదుర్కొంటున్న సమస్యలపై భారత ప్రభుత్వం సమన్వయ పూర్వక ధోరణి అవలంబించడంవలన సత్ఫలితాలు అప్పుడే కనబడుతున్నాయి. ఆఫ్రో - ఆశియన్ రాజ్యాల సమావేశంలో సోవియట్ యూనియన్ కూడా పాల్గొనాలన్న ప్రతిపాదనమీద అనేక దేశాల ప్రతినిధులు అక్కడికక్కడ మనస్సులు స్థిరం చేసుకోలేకపోయారు. కాని, తర్వాత ఆ దేశ ప్రభుత్వాలు ఆ సమస్యమీద పునరాలోచిస్తున్నట్లు కనబడుతూంది. ఈ మాసం ఆఫ్రో - ఆశియన్ విదేశాంగ మంత్రుల సమావేశం జరిగినప్పుడు ఈజిప్టు, అల్జీరియాల నాయకత్వాన అనేక అరబ్బు దేశాలు ఆప్రతిపాదనను బలపరుస్తూ ముందుకు రాగలవు.

ఈనూతన పరిణామాలుచూసి చైనానాయకులు ఆందోళన పొందడంలో అసహజంలేదు. వారు ఈమాదిరి పరిణామాన్ని ఊహించలేదు. క్రుశ్చేవ్ కైరో ప్రయాణం ఆఫ్రో ఆశియన్ దేశాలలోకెల్లా అభివృద్ధి పొందిన దేశాలలో కనిపిస్తున్న నూతన ధోరణులకు సూచిక. ఇది కొనసాగితే ఈమారు ఆఫ్రో - ఆశియన్ రాజ్యాలసమావేశం నాటికి చైనాకు మిత్రులుగా మిగిలేవి పాకిస్తానూ, తదితర సామ్రాజ్యవాద సైనిక కూటానికి చెందిన దేశాలు మాత్రమే.

సోవియటు యూనియనుకూ, ఇండియాకూ మధ్య సహకారం వృద్ధిపొందుతూండడాన్ని ఇక్కడ గమనించాలి. బొకారోకు సోవియటు సహాయం ప్రకటించడం, మరి ఏ ఇతర ప్రాజెక్టు ఇస్తానన్న ఎంత గొప్ప సహాయంకన్నా ఎంతో విలువగలది.

భిలాయికి సోవియటు సహాయం చేయడంతో ఇండో - సోవియటు సత్సంబంధాలలో నూతనాధ్యాయం ఆరంభమయింది. బొకారోతో అదొక నూతన స్థాయికే చేరుకొంది.

బొకారో సహాయ ప్రకటనకు వెనువెంటనే జెట్ఫ్లార్ క్షేత్రానికి సోవియట్ యంత్ర సరఫరాకై ఒప్పందం జరిగింది. దాని వెనువెంటనే శక్తివంతమైన ట్రాన్స్మిటర్ ఇవ్వడానికి ఒప్పందం జరిగింది. అమెరికనులు ఎంతో హడావిడిచేసి ఎన్నో అవమానకరమైన షరతులు పెట్టిన తర్వాత వాయిస్ ఆఫ్ అమెరికాతో ఒప్పందం రద్దు చేసుకొనడం, తర్వాత సోవియటు ఈ ట్రాన్స్మిటరు ఇస్తాననడం చాల ప్రాముఖ్యం గలవి.

వానికితోడు అమెరికా యిచ్చిన దానికన్న సోవియటు యూనియను ఇస్తున్న సైనిక సహాయం ఎన్నోరెట్లు మెరుగని న్యూయార్కు టైమ్సు పత్రిక వ్రాతలే చెప్తున్నాయి.

ఆఫ్రో - ఆశియన్ దేశాల మధ్య వృద్ధిపొందుతున్న ఈ నూతన సంబంధాలను గమనించి, పెకింగ్ విధాన నిర్ణేతలీమారు కొత్త ఉంకింపులకు దిగవలసి వుంటుంది.

"కాంగ్రెసుకు ముస్లింలు ఓటు వేయరాదు"
కేరళ ముస్లిం నాయకుని విజ్ఞప్తి

అలెప్పి, మే 13

ముస్లింలను కాంగ్రెస్‌పార్టీ మోసం చేసిన దృష్ట్యా, వచ్చే సంవత్సరం రాష్ట్రంలో జరిగే సాధారణ ఎన్నికలలో ముస్లింలీగ్ అభిమానులెవ్వరూ కాంగ్రెస్‌కు ఓటువేయరాదని కేరళ రాష్ట్ర ముస్లింలీగ్ అధ్యక్షులు శ్రీ బి. తంగాల్ నేడిక్కడొక బహిరంగసభలో విజ్ఞప్తి చేశారు.

తూర్పు పాకిస్తాన్ కాందిశీకులు

కలకత్తా, మే 18

గత జనవరిలో తూర్పు పాకిస్తాన్‌లో మత కలహాలు ప్రారంభమైన నాటినుండి చిటగాంగ్, నౌఖాలి, కొమిల్లా, సిల్హెట్, మిమెన్‌సింగ్ మొదలైన అనేక ప్రాంతాలనుండి త్రిపుర రాష్ట్రంలోనికి 45 వేల మంది కాందిశీకులు వచ్చినట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎస్.ఎల్. సింగ్ నేడిక్కడ పత్రికా విలేకరులకు తెలియజేశారు.

అగర్తాలా నుండి నేడిక్కడకు వచ్చిన శ్రీ సింగ్ పత్రికా విలేకరులతో మాట్లాడుతూ, ఈ కాందిశీకులకు పునరావాసం కల్పించటం రాష్ట్ర ప్రభుత్వానికి ఒక సమస్యగా తయారైందనీ, కేంద్ర ప్రభుత్వ, యితర రాష్ట్రాల సహకారంతో మాత్రమే యీ సమస్యను పరిష్కరించగలమని చెప్పారు.

ఇక్కడ ఉండే నాలుగురోజులలోనూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి శ్రీ పి. సి. సేన్‌ను కలుసుకుని ఉభయులకు సంబంధించిన సమస్యలపై చర్చలు జరుపుతామని శ్రీ సింగ్ తెలియజేశారు.

నేపాల్ రాజు మహేంద్ర పశ్చిమ జర్మనీకి ప్రయాణం

న్యూఢిల్లీ, మే 18

రాజు మహేంద్ర బృందం ఒక వారం రోజులు పశ్చిమ జర్మనీలో పర్యటించడానికి నేడిక్కడ నుండి బయలుదేరి వెళ్ళారు.

ఆయనతోపాటు మహారాణి రత్న, నేపాల్ విదేశాంగశాఖమంత్రి కె. యస్. బిష్ట్ ఉన్నారు.

నిన్న ఖాట్మండునుండి యిక్కడికి వచ్చిన నేపాల్ రాజుకు నేడు భారత రాష్ట్రపతి శ్రీ రాధాకృష్ణ విందుచేశారు.

తరువాత ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ, మహేంద్రను నేపాల్ రాయబార కార్యాలయంలో కలుసుకున్నారు.

ఐక్య ఆరబ్ రిపబ్లిక్కు ఆయుధాల సరఫరాకు సోవియట్ సంసిద్ధత
ప్రధాని క్రుశ్చేవ్ ప్రకటన

కైరో, మే 18

ఐక్యఆరబ్ రిపబ్లిక్‌కు ఆయుధాలవసరమని భావిస్తే వాటిని సప్లయి చేయటంలో ఎటువంటి జాప్యం ఉండదని సోవియట్ ప్రధాని క్రుశ్చేవ్ నేడు ఉద్ఘాటించారు.

క్రుశ్చేవ్‌తోపాటు ఐక్యఆరబ్ రిపబ్లిక్‌లో పర్యటిస్తున్న సోవియట్ ప్రథమ ఉప రక్షణ మంత్రిమార్షల్ ఆంద్రెగ్రెచికోకు ఈజిప్టుఉన్నత సైనిక గౌరవ పతకం బహూకరణ సందర్భంలో ప్రసంగిస్తూ క్రుశ్చేవ్ పై విధంగా అన్నారు.

ఐక్య ఆరబ్ రిపబ్లిక్ ప్రథమ ఉపాధ్యక్షుడు మార్షల్ అబ్దుల్ హకీమ్ అమీర్ ఈ పతకాన్ని అందచేస్తూ తమకు ఇంకా ఎక్కువ ఆయుధాలుకావాలని అన్నారు. దానిపైక్రుశ్చేవ్ నేటిరాత్రి జరిగిన విందులో ప్రసంగిస్తూ "మీకు ఆయుధాలు అవసరమయితే వాటిని అందచేయటంలో ఎటువంటి జాప్యం ఉండదు" అని నాజర్ తదితర నాయకులతో అన్నారు.

క్రుశ్చేవ్, నాజర్‌ల మధ్య నేడుకూడా సంభాషణలు సాగాయి. అధ్యక్ష ప్రతినిధి ఒకరు మాట్లాడుతూ ఉభయుల సంభాషణలు అంతర్జాతీయ పరిస్థితిపైన, ప్రపంచసమస్యలపైనా సాగాయని, అత్యంత స్నేహ పూర్వక వాతావరణంలో ఇవి జరిగాయని తెలియ చేశారు.

యువకుల సమస్యల పట్ల కర్తవ్యం
శ్రీ సంజీవయ్య ప్రసంగం

న్యూఢిల్లీ, మే 18

యువకుల సమస్యలను ఏ సమాజం నిర్లక్ష్యం చేయదనీ, అలా చేసినట్లయితే, ఆ సమాజ పతనానికి దారితీస్తుందని కేంద్ర కార్మిక శాఖామంత్రి శ్రీ డి. సంజీవయ్య నేడిక్కడ చెప్పారు.

ప్రపంచ యువజనసంస్థ భారతీయశాఖ ఆధ్వర్యాన "యువకులు - పని" అనే సమస్యపై ఏర్పాటుచేసిన చర్చను ప్రారంభోత్సవం చేస్తూ శ్రీ సంజీవయ్య, ఇతర వర్ధమానదేశాలలో మాదిరిగానే, ఉద్యోగ అవకాశాలు లేకపోవటమే భారతదేశంలోని యువకుల ప్రధాన సమస్య అని చెప్పారు. అందువలన యువకులకు పనులు చూపించే కార్యక్రమానికి అధికతర ప్రాధాన్యత యివ్వాలన్నారు.

ఈ కార్యక్రమం జయప్రదం కావటానికి యువకులు దేశభక్తితో ఆర్థికాభివృద్ధి కృషిని జయప్రదం చేయాలనీ, తద్వారా, పనిలేని వారికి కొత్త, తగినన్ని ఉద్యోగావకాశాలు పెరుగుతాయన్నారు.

నూతన సాంఘిక వ్యవస్థను నిర్మించడం ద్వారా రాజకీయ స్వాతంత్ర్య ప్రయోజనాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చే బాధ్యత కూడా ప్రధానంగా యువకులమీద ఉందన్నారు.

అనుభవించటానికి అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ, ఉన్నత సమాజంలోని యువకులు కూడా అసంతృప్తిగా ఉన్నట్లు తరచు వింటూ ఉంటామని, ఉద్యోగావకాశాలు మాత్రమే కాకుండా, యువకులకు తమ జీవిత ప్రయోజనమేమిటో తెలిసి ఉండాలన్నారు.

వారి సంతోషానికి, పనిచేయడానికి గొప్ప కారణం కూడా వారికి ఉండాలన్నారు.

పర్మనెంటు సిబ్బందిని మంజూరు చేయాలి
ప్రదేశ్ రోడ్‌ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్‌కు నగర యూనియన్ విజ్ఞప్తి

హైదరాబాద్, మే 17

రోడ్‌ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్‌లో మూడు దశాబ్దాలుగా అమల్లోవున్న పద్ధతి ననుసరించి రవాణా నిర్వహణకై అవసరమైనంత పర్మనెంటు సిబ్బందిని మంజూరు చేయకపోవడంపై ప్రదేశ్ రోడ్డు రవాణా కార్పొరేషను అనుసరిస్తున్న విధానాన్ని ఆర్. టి. సి. ఎంప్లాయీస్ యూనియన్ నగర కార్యదర్శి శ్రీ సి. రామమోహన్‌రావుగారు ఇటీవల ఇక్కడొక సమావేశంలో విమర్శించారు.

నగరంలో వివిధశాఖలలో పనిచేసే క్యాజువల్ వర్కర్ల సమావేశం ఈనెల 14న ఇక్కడ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో జరిగింది.

క్యాజువల్ డ్రైవర్లకూ, కండక్టర్లకూ ఇచ్చే వేతనాలు ఈ పరిశ్రమలో అమలులో ఉన్న వేతనాల స్కేళ్ళ కంటె చాలా తక్కువగా ఉన్నాయని, ఈ విధంగా వారు దుస్సహమైన దోపిడీకి గురిచేయబడుతున్నారని ఆయన అన్నారు. నగరంలో పని చేసే క్యాజువల్ డ్రైవర్‌కు రోజుకు మూడున్నర రూపాయలు మాత్రమే చెల్లింపబడుతోందని, పైగా వారికి నెలంతా పనులుండవని, ఇతర విభాగాలలో పని చేసే కార్మికుల పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉన్నదని ఆయన వెల్లడించారు.

మరోవైపు నగర రవాణా సర్వీసులో అనుభవహీనులైన వారిని నియమించటంవల్ల, అది అసమర్థతకు దారితీసి, ప్రయాణీకులకు అసౌకర్యమూ, అటు పరిశ్రమకు నష్టమూ కలిగిస్తోందని ఆయన పేర్కొన్నారు. వారినందరిని పరిశ్రమలోనికి పూర్తిగా తీసుకోవాలని తాము కార్పొరేషన్‌కువేసిన విజ్ఞాపనలన్నీ వృధా అయ్యాయనీ, అందువల్ల కార్మికులు ఆందోళన చెందుతున్నారని ఆయన అన్నారు.

పర్మనెంటు ఉద్యోగాలలో క్యాజువల్ సిబ్బందిని నియమించే పద్ధతిని రద్దుచేయాలని, ప్రస్తుతం ఉన్న సిబ్బందిని త్వరలోనే ఆ ఖాళీలలో నింపాలని సమావేశం ఒక తీర్మానంలో కార్పొరేషన్‌కు విజ్ఞప్తి చేసింది.

ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ ఛీఫ్ యింజనీర్ శ్రీ యం. జాఫర్ అలీ భారత ప్రభుత్వానికి ఇంజనీరింగు వ్యవహారాల సలహాదారుగా నియమించ బడ్డారు.

జూన్ 2వ తేదీన బొంబాయిహోటల్ పనివారి సమ్మె

బొంబాయి, మే 17

తమ ఇబ్బందులను ప్రభుత్వ దృష్టికి తీసుకు వచ్చేందుకు గాను జూన్ 2 వతేదీన నిరసన సమ్మె చేయాలని బొంబాయి హోటల్ పనివారు నిర్ణయించారు.

కాంగార్ మైదానంలో జరిగిన హోటల్ కార్మికుల సభలో ఈ నిర్ణయం జరిగింది.

ఈ సభలో బొంబాయి లేబర్ యూనియన్ అధ్యక్షులు జార్జి ఫెర్నాండెస్ ప్రసంగిస్తూ హోటల్ వర్కర్ల డిమాండ్ల విషయంలో కనీస వేతనాలకమిటీ అనేకసిఫారసులు చేసిందని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం వాటిని ఆమోదించినా, అమలు జరపకుండా యజమానులు కూర్చున్నారని అన్నారు.

హోటల్ యజమానుల ఈ ధోరణి పట్ల ప్రభుత్వం పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నదని అన్నారు.

సమ్మెచేస్తే, ఆహారంకోసం హోటళ్ళపై ఆధారపడే ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతారనే దృష్టితో హోటల్ కార్మికులు దాదాపు సంవత్సరకాలంగా ఓర్పు వహించారనీ, కాని యజమానులకుగానీ, ప్రభుత్వానికిగానీ, చీమ కుట్టినట్లయినా లేనందున నిరసన సమ్మెకు పూనుకోక తప్పటంలేదనీ అన్నారు.

నిరసనసమ్మెవల్ల ఫలితాలు లేకపోతే అప్పుడు నిరవధిక సమ్మెకు కార్మికులు సన్నద్ధం కావాలని ఆయన ఉద్బోధించారు.

యమునా ప్రాజెక్టు నిర్మాణం
రెండవదశ పూర్తిచేసేందుకు కెనడాతో ఒప్పందం

డెహ్రాడూన్, మే 17

యమునా - జలవిద్యుత్ ప్రాజెక్టు రెండవదశ నిర్మాణార్థం ఉత్తరప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ బోర్డు ఒక కెనడా కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నది.

ఈ దశ నిర్మాణానికి రు. 35 కోట్లు పైగా ఖర్చవుతున్నది.

ఈ ఒప్పందం నిర్మాణ పనులకు పరిమితమయి ఉంటుంది.

ఈ రెండవదశ పూర్తయితే 4 వ ప్రణాళికాంతానికి ఇక్కడ అదనంగా 3 లక్షల 40 వేల కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది.

ప్రస్తుతం నిర్మించబడుతున్న మొదటిదశ 1965 నాటికి పూర్తవుతుంది. మొదటిదశలో 14 వేల కిలోవాట్ల విద్యుచ్ఛక్తి ఉత్పత్తి అవుతుంది.

బజరంగా జూట్ మిల్ కార్మికులపట్ల ప్రభుత్వ వైఖరి
శాసనసభ్యులు శ్రీ కనపర్తి నాగయ్య ఖండన

గుంటూరు, మే 19

బజరంగా జూట్‌మిల్లు కార్మికుల న్యాయమైన కోర్కెలపట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న మొండివైఖరిని ఖండిస్తూ స్థానిక శాసన సభ్యులు శ్రీ కనపర్తి నాగయ్య ఈ క్రింది ప్రకటన చేశారు.

వారా ప్రకటనలో ఇలా అన్నారు.

గుంటూరు శ్రీ బజరంగ జూట్ మిల్లు కార్మికులు 1700 మంది 79 రోజుల నుండి సమ్మె చేస్తున్న విషయం విశాలాంధ్ర పాఠకులకు విదితమే. వేజ్ బోర్డు నిర్ణయాలను యథాతథంగా అమలు జరపాలనేది కార్మికుల కోర్కె. కేంద్ర ప్రభుత్వం 1963 అక్టోబరులో వేజ్‌బోర్డు నిర్ణయాలు ఆమోదించింది. అప్పటినుండి 5 మాసాలపాటు కార్మిక ప్రతినిధులు మేనేజిమెంటుతో సంప్రతించారు. లేబరు కమిషనరు కూడ మేనేజిమెంటుకు సలహాలు యిచ్చారు. ఎట్టి ఫలితం కలుగలేదు. వేరు మార్గం లేక చట్టబద్ధమైన నోటీసు యిచ్చి 2-3-64 నుండి కార్మికులు సమ్మె ప్రారంభించారు. త్రైపాక్షిక సభల నిర్ణయాలను ఉల్లంఘించి వేజ్‌బోర్డు నిర్ణయాలను అమలు జరపని మేనేజిమెంటుపై ప్రభుత్వం యే విధమైన ఒత్తిడి తీసుకొనిరాలేదు. సరికదా కార్మికులు సమ్మెకు ఉపక్రమించక పూర్వమే వివాదాన్ని ట్రిబ్యునలుకు నివేదించి కార్మికులు సమ్మెచేసిన 20 రోజులకు వివాదాన్ని ట్రిబ్యునలుకు నివేదించుట ద్వారా పరిష్కారానికి పూనుకొన్నది. ఆవిధంగా చేయుట వేజ్‌బోర్డు నిర్ణయాలను అమలు జరిపించు బాధ్యతనుండి తప్పుకొనుట తప్పేరుకాదు. అంతటితో ప్రభుత్వం ఆగలేదు. సమ్మెను నిషేధించి కార్మికుల సమ్మె హక్కును హరించుటద్వారా బాహాటంగా మేనేజిమెంటుకు తోడ్పడటానికి పూనుకున్నది, సంఘ కార్యకర్తలను ప్రాసిక్యూట్ చేయుటకు ఉత్తర్వులు జారీచేసింది.

ప్రభుత్వం యిస్తున్న సహకారాన్ని ఆసరాగా తీసికొని మేనేజిమెంటు కార్మికుల పోరాటంపై దాడి ప్రారంభించింది. కాలనీలో నివసిస్తున్న వారికి కరెంటుసప్లయి నిలుపుదల చేసింది, కార్మికులు తమ ప్రావిడెంటుఫండు నుండి అప్పు తెచ్చుకొనకుండా హైకోర్టునుండి స్టేఆర్డరు తెచ్చింది. చట్టవిరుద్ధమైన సమ్మెకొనసాగిస్తున్నారనే కారణంచూపి 1706 మంది కార్మికున్నిపనినుండి తొలగించుటకుట్రిబ్యునలు అనుమతి పొందింది. చట్టవిరుద్ధంగా అందరు కార్మికులను పనినుండి తొలగించింది. ఉద్యోగమునుండి తొలగించ బడ్డారుకనుక కాలనీలో నివసిస్తున్న కార్మికులను వెంటనే ఖాళీచేయాలని నోటీసు యిచ్చింది. అంతేకాకుండా మిల్లు త్రిప్పుటకు క్రొత్తకూలీలను దరఖాస్తులుపెట్టుకోమని పత్రికా ప్రకటనలు చేసింది. ఈ విధంగా పోటీకార్మికులనుతెచ్చి ప్రభుత్వ మద్దతుతో సమ్మె పోరాటాన్ని విచ్ఛిన్నం చేయుటకు మేనేజిమెంటు ప్రయత్నిస్తున్నది.

ఒకవైపు జీవన ప్రమాణం విపరీతంగా పెరుగుతుంది. కాని గతనాలుగు సంవత్సరాలలో జూట్‌మిల్లు కార్మికుల వేతనాలలో ఎట్టిమార్పు లేదు. వేజ్‌బోర్డు నిర్ణయాలకు ఎదురు చూస్తున్న కార్మికులు మేనేజిమెంటు మొండి వైఖరివల్ల, ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలవల్ల నిరాశచెందారు. వేజ్‌బోర్డు నిర్ణయాలు అమలుజరుపక వివాదం ట్రిబ్యునలుకు నివేదించినందున రానున్న రెండుమూడు సంవత్సరములలో తమ వేతనాలు పెరుగుతాయనే ఆశ లేకుండా పోయింది. వేజ్‌బోర్డు నిర్ణయం ప్రకారం నెలకు కనీస వేతనం రు. 72-83 న. పైలు. 1-7-63 నుండి రావలసియుండగా ప్రస్తుతం యిస్తున్న నెలకు కనీస వేతనం రు. 52-00 మాత్రమే.

భారతదేశంలో వున్న అన్ని మిల్లులలో నెలకు కనీసవేతనం రు. 81-00 నిర్ణయించగా గుంటూరు జూట్‌మిల్లు ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా రు. 72-83 న. పైలు నిర్ణయించబడింది. దేశంలో వున్న అన్ని మిల్లులు రు. 81-00 అమలు జరుపగా తక్కువవేతనం నిర్ణయించబడిన ఆ కనీసవేతనం సహితం గుంటూరు జూట్‌మిల్లు మేనేజిమెంటు అమలు జరుపలేదు. మేనేజిమెంటు ప్రభుత్వం తీసికొన్న వైఖరివల్ల వేజ్‌బోర్డుల నియామక వుద్దేశ్యం విఫలమౌతుంది. కార్మికుల సమ్మె హక్కు హరింపబడుతుంది. ఈ కారణాలవల్లనే గుంటూరు శ్రీ బజరంగ జూట్‌మిల్లు కార్మికులు తమ సమ్మెను కొనసాగిస్తున్నారు.

ఇప్పటికి 79 రోజులుగా సమ్మెచేస్తున్న కార్మికుల ఆర్థిక పరిస్థితులను అందరూ అర్థం చేసికొనగలరు. వేజ్‌బోర్డు నిర్ణయాలు అమలు జరిపించుకొనుటకు దీర్ఘకాల పోరాటాన్ని సాగించుటకు అందుకు అవసరమైన త్యాగాలు చేయుటకు కార్మికులు కృతనిశ్చయులై యున్నారు. అట్టి కార్మికుల పోరాటానికి సంపూర్ణ నైతికశక్తి చేకూర్చాలని, ఆర్థికంగా తోడ్పడాలని విజ్ఞప్తి చేస్తున్నాము. తోటి కార్మికులు, కార్మికసంఘాలు సభలు సమావేశాలు జరిపి తీర్మానాలుచేసి వివాద పరిష్కారానికి పూనుకొనేలా ప్రభుత్వంపై వత్తిడి తేవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఇప్పటివరకు నైతికంగా, ఆర్థికంగా ఎంతోమంది తోడ్పడ్డారు. వారందరకూ మా హృదయపూర్వక అభివందనాలు.

కాశ్మీర్ సరిహద్దులో ప్రశాంత పరిస్థితి
హోంమంత్రి శ్రీధార్ ప్రకటన

శ్రీనగర్, మే 18

కాశ్మీర్ సరిహద్దుల నానుకొని ఉన్న ప్రదేశమంతటా పరిస్థితి సంపూర్ణంగా ప్రశాంతంగా ఉన్నదని, అక్కడ వివిధ తెగలమధ్య ఐక్యత, మత సామరస్యం పూర్తిగా ఉన్నదని కాశ్మీర్ హోం మంత్రి శ్రీ డి. పి. ధార్ నేడిక్కడ పత్రికలవారితో చెప్పారు.

రాష్ట్ర ఆర్థికమంత్రి శ్రీ త్రిలోచన్ దత్తుతో కలసి ఆయన బరముల్లాజిల్లా, తదితర సరిహద్దు ప్రాంతాలలో నాలుగు రోజులపాటు పర్యటించివచ్చిన అనంతరం పత్రికలవారితో తమ పర్యటన అనుభవాలను వివరిస్తూ ఈ విషయం చెప్పారు.

రాష్ట్ర సరిహద్దుప్రాంతాలలోని ప్రజలచిత్త స్థయిర్యం చెక్కుచెదరలేదని దేశంలోని ఇతర ప్రాంతాలలోవలె ఆప్రాంతాల ప్రజలు అభివృద్ధి కార్యక్రమాలలో నిమగ్నులై ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

ఆప్రాంతాలప్రజలు రాష్ట్రనూతన ప్రభుత్వ విధానాలను సంపూర్ణంగా బలపరుస్తున్నారని శ్రీ ధార్ చెప్పారు.

కాశ్మీర్‌లో ఐరాస పరిశీలకుల కార్యకలాపాల విషయమై ప్రస్తావిస్తూ, భద్రతా సంఘానికి, ప్రదర్శకులకూ మధ్య తపాలా కార్యాలయంలాగా ఐరాస పరిశీలకులు ప్రవర్తించడం సవ్యంగాలేదని శ్రీ ధార్ పేర్కొన్నారు. అలాంటి చర్యలు వారి హోదాకు తగినట్టివికావన్న విషయాన్ని ఐరాస కేంద్ర కార్యాలయం దృష్టికి తేవలసి ఉన్నదని ఆయన అన్నారు.

నేషనల్ కాన్ఫరెన్స్ కార్యకర్తలపై కక్ష సాధింపు జరుగుతున్నట్లు కొన్ని పత్రికలలో వెలువడ్డ వార్తలను ఆయన ఖండించారు.

రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు రాజకీయాలలో పాల్గొంటున్నట్లు వెలువడ్డ వార్తలను ప్రస్తావిస్తూ, ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయాలకు అతీతంగా ఉండాలని, రాజకీయ కార్యకలాపాలలో పాల్గొనే ఏ ఉద్యోగియైనా కఠినంగా శిక్షింపబడతాడని శ్రీ ధార్ తెలియజేశారు.

శ్రీ హేమంతకుమార్ బోస్ విడుదల

కలకత్తా, మే 18

ఫార్వర్డ్ బ్లాక్ నాయకుడు, పాకిస్తాన్ మైనారిటీల రక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీ హేమంతకుమార్ బోస్‌ను నేడు విడుదల చేశారు. ఈయనను ఏప్రిల్ 19 వ తేదీన దేశ రక్షణ చట్ట నిబంధనల క్రింద అరెస్టు చేశారు.

లావోస్ పరిస్థితిపై సోవియట్‌తో బ్రిటన్ చర్చలు

లండన్, మే 18

లావోస్‌లోని రాజకీయపరిస్థితిపై సోవియట్ విదేశాంగమంత్రితో చర్చలు జరపవలసిందిగా మాస్కోలోని బ్రిటిష్ రాయబారి సర్ హంఫ్రే ట్రెవిలియన్‌ను బ్రిటిష్ ప్రభుత్వం నేడు కోరింది.

బ్రిటన్, రష్యాలు రెండూ లావోస్‌పై జరిగిన, జెనీవా మహాసభకు సహాధ్యక్షులు.

ఇటీవలి పరిణామాల ఫలితంగా లావోస్‌లోని తటస్థ వర్గాల బలము చాలా తగ్గిపోయిందని కనుక సంకీర్ణ ప్రభుత్వ స్థాపన మరింత క్లిష్టతరమైందని బ్రిటిష్ వర్గాలు భావిస్తున్నాయని తెలుస్తున్నది.

ఇదిలా ఉండగా లావోస్ కమిషన్‌లోని భారత కెనేడియన్ సభ్యులు, ఇటీవలనే పాథెట్‌లావో సేనల వశమైన పక్సానే ప్రాంతానికి వెళ్లారు. కమిషన్‌లోని పోలిష్ సభ్యుడు మాత్రం వెళ్ళలేదు.

లావోస్ పోరాటంలో ఉత్తర వియత్నాం సేనలు పాల్గొంటున్నాయని మితవాద శక్తులు ప్రచారం చేయటంలో ఉద్దేశ్యం, అమెరికా జోక్యాన్ని ఆహ్వానించేందుకని, అలా జరిగితే తీవ్ర పరిణామాలు సంభవించ వచ్చునని లావోస్‌లోని అంతర్జాతీయ పరిశీలకులు భావిస్తున్నారు.

ఎగుమతుల నాణ్యాం పరీక్ష అవసరమని శ్రీ మనూభాయి షా

న్యూఢిల్లీ, మే 18

అంతర్జాతీయ వాణిజ్యశాఖ కేంద్ర మంత్రి శ్రీ మనుభాయిషా, ఎగుమతి చేసే సరుకులకు ఎక్కువ రేట్లు వేసి, తక్కువ రేట్లు వేసి ఇబ్బందులు సృష్టించకుండా గట్టిగా పరీక్షించవలసి వుంటుందన్నారు.

ఎగుమతుల పర్యవేక్షణ సమితి సమావేశంలో ప్రసంగిస్తూ శ్రీ షా, ఎగుమతులను హెచ్చుచేయాలంటే సరుకుల నాణ్యం నిలుపుకొనాలని, ప్రధానమైన సరుకులను ఓడలకెక్కించేముందు విధిగా పరీక్ష చేయించడం అవసరమని ఆయన అన్నారు.

అతిముఖ్యమైన ఎగుమతి సరుకులను ఓడకెక్కించేముందే పర్యవేక్షించేపద్ధతి నతివేగంగా ప్రవేశపెట్టేటందుకు ఆమోదించాలని ఆయన అన్నారు.

◆◆◆

Andhra University Colleges
J. V. D. College of Science & Technology

NOTIFICATION

Reservation of seats to the students of 'Other States' in B. Tech and B. Pharm degree course of this institution regarding.

Application for admission into various courses of this institution in the prescribed printed forms supplied by the Principale A. U. College, Waltair on payment of one rupee, will be received upto 20th June 19 4

The number of seats reserved for students of 'Other States' for admission into the first year of the five year Integrated B. Tech Chemical Engineering and First year of the four year Integrated B. Pharm degree courses is mentioned below :

1. For the Ist year of 5 year Integrated B. Tech, Chemical Engineering degree course:

Name of State	No. of seats Reserved
Bihar	2 Seats
Orissa	2 Seats.
Madras	1 Seat.
Other States	1 Seat.

2. For the first year of the 4 year Integrated B. Pharm degree course :

Six (6) seats are jointly allotted to the following states :

Assam, west Bengal, Bihar, Orirssa, Mysore, Jammu & Kashmir, and Union Territories.

Minimum Educational qualifications required for admission to:

(i) 1st B. Tech, Chemical Engineering: A pass in the Pre-University/Higher Secondary examination or an examination recognised as equivalent thereto in I or II calss with Mathematics and Physical Science under Part III as optional subjects or a pass at the first appearance in that examintaion with a distinction at least in Physical science.

The duration of the course is five years.

(ii) First year of the 4 year Integrated B. Pharm degree Course:

A pass in the Pre-University/Higher secondary examination or an examination recognised as equivalent thereto with Physical Science as an optional and either Mathematics or Biological Science as the other optional in I or II class, or a pass at the first appearance in that examination with distinction at least in Physical Science.

(iii) Two Seats are reserved in each of the B. Tech and B. Pharm degree courses for the nominees of Industrial Establishments and the selection will be made on the basis of merit among the applications received from the Industrial concerns duly sponsored and Recommended by them.

If the requsite number of qualified students if not forthcoming from any state, the seats earmarked for it may be allotted to the students from the adjoining areas.

For the supply of application forms and prospectus for admission please apply to the Principal (by designation only) A. U. Colleges, Waltair Enclosing :

(1) A self addressed stamped (20np) envelope of size 10" × 4" and

(2) A postal order of value Re. 1/- (Rupee one Only) payable at Waltair Post Office, issued infavour of PRINCIPAL, A. U. COLLEGES, WALTAIR, towards cost of application form and prospectus. The Postal order obtained after 1st May onwards should be used. Postal orders stamped earlier to that date may be rejected. There should not be any alterations or corrections made on the postal orders.

Requisitions for the supply of application forms received without the above two enclosures will not be attended to.

Correct requisitions will be entertained from 20th May 1964, to 10th June, 1964. The name of the course for which the cannidates intend to apply should specifically be noted on the requisition.

(Sd.) G. GOPALARAO,
Principal.

◆◆◆



MEI
safe and dependable
AC MOTOR STARTERS
designed to meet the needs of specific industries and produced to rigid standards of quality, MEI AC Motor Starters have become the first choice of equipment manufacturers all over the country.
Manufactured by:
THE MYSORE ELECTRICAL INDUSTRIES LTD.
P.O. Box 1601, Bangalore 12
safest for everything in electric power control
Engineering-Fabrication.
Sales & Service
I.A.E.C.
(Hyderabad) PVT. LTD.
Barman Bldg., Gunfoundry, Hyderabad.
Associated Offices :
BOMBAY . MADRAS . DELHI . CALCUTTA . BANGALORE.

సంపాదకవర్గం: కాట్రగడ్డ రాజగోపాలరావు (అధ్యక్షులు) ఏటుకూరు బలరామమూర్తి, తమ్మల వెంకటరామయ్య, విశాలాంధ్ర విజ్ఞానసమితి తరపున ఎడిటర్, ప్రింటర్, అండ్ పబ్లిషర్ కాట్రగడ్డ రాజగోపాలరావు, స్వతంత్ర ఆఫ్ట్ ప్రింటర్స్, విజయవాడ-4.